ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ : fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

21-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 49 పేజీలు: 8+16 వెల: 6.50



ట్రంప్ చిత్రంతో 24 కేరట్ల బంగారు నాణెం
10 హామీల టిఎంసి మేనిఫెస్టో
8లో


# హార్ముజ్ జలసంధి భద్రతకు బ్రిటన్, ఫ్రాన్స్ రెడీ

**జెరూసలెం, మార్చి 20:** ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం తీవ్రమవుతున్న నేపథ్యంలో, ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ లాంటి హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఈ మార్గంలో వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణానికి భరోసా కల్పించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. ఈ ప్రాంతంలో భద్రతా కార్యకలాపాల్లో పాలుపంచుకుంటా మని స్పష్టం చేశాయి. మూడు వారాలుగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వాణిజ్య నౌకలపై దాడులు, సముద్రంలో మైన్‌లు అమర్చడం, డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాల్పడటం వంటి చర్యలను ఇరాన్ వెంటనే నిలిపివేయాలని బ్రిటన్, ఫ్రాన్స్‌తో పాటు జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్ దేశాలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. హార్ముజ్ జలసంధిని అడ్డుకోవడానికి ఇరాన్ ప్రయత్నించడం అంతర్జాతీయ శాంతిభద్రతలకు పెను ముప్పు అని బ్రిటన్ ప్రధాని కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచంలోని ఐదో వంతు ముడి చమురు, సహజ వాయువు ఈ జలసంధి నుంచే రవాణా అవుతాయి. ఈ మార్గానికి ఆటంకాలు ఏర్పడితే ఇంధన ధరలు పెరిగి, ప్రపంచవ్యాప్తంగా సామాన్యులపై తీవ్ర భారం పడుతుందని ఈ దేశాలు హెచ్చరించాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, హార్ముజ్ జలసంధిలో భద్రతను పర్యవేక్షిస్తున్న అమెరికా నేతృత్వంలోని దళాలకు మద్దతుగా బ్రిటన్ తన రాయల్ నేవీ యుద్ధనౌకలను ఇప్పటికే మోహరించినట్లు తెలుస్తోంది. ఇరాన్ నావికాదళం నుంచి ఎలాంటి ముప్పు ఎదురైనా తిప్పికొట్టేలా ఈ ప్రాంతంలో నిఘాను కట్టుదిట్టం చేశారు.

## 'న్యూ విజన్'తో వినూత్న పథకాలు

### రాష్ట్రంలో 1.15కోట్ల కుటుంబాలకు రూ.5లక్షల జీవిత బీమా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి20: 1. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమం కొరకు సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా చూడకుండా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకుప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల జీవిత బీమా అందించే విధంగా జూన్, 02, 2026 నుండి 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకానికి బడ్జెట్ లో రూ.4,000 కోట్లు ప్రతిపాదించాం. **2. చేయూత:**చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నాము. ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.14,861 కోట్లు ప్రతిపాదించాం. **3. తెలం గాణ పబ్లిక్ స్కూళ్లు:**ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక రవాణా వ్యవస్థలతో అన్ని వనరులతో కూడిన తెలగాణపబ్లిక్ స్కూళ్ల గా మార్పు చేయాలని ప్రతిపాదించాము. ఈ స్కూళ్ళలో ప్రీ ప్రైమరీ నుండి 12 వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు విద్య అందించబడుతుంది. ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.500 కోట్లు ప్రతిపాదించాం. **4. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం:**2026-27 విద్యాసంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ బ్రేక్ ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికివారానికి మూడు రోజులు పాలు >>2


శుక్రవారం అసెంబ్లీలో 2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న డి.సిఎం భట్టి విక్రమార్క

మొత్తం బడ్జెట్: రూ. 3,24,234కోట్లు
రెవెన్యూ వ్యయం: రూ. 2,34,406 కోట్లు
మూలధన వ్యయం: రూ.47,267 కోట్లు
వ్యవసాయశాఖ: రూ.23,179 కోట్లు
రైతు భరోసా: రూ.18,000 కోట్లు
మహాలక్ష్మి పథకం: రూ.4,305 కోట్లు
గృహజ్యోతి: రూ.2,080 కోట్లు

# వృద్ధికి భరోసా

## 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమం సమతూకం

### తొమ్మిది కొత్త పథకాలను ప్రజలకు అందించిన పద్దు

### యువతకు విదేశీ ఉపాధి కోసం 'సిఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం

### అసెంబ్లీకి బడ్జెట్‌ను సమర్పించిన డి.సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్,మార్చి 20,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ. 3,24,234 కోట్లు. అందులో రెవెన్యూ వ్యయం రూ. 2,34,406 కోట్లు కాగా.. మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మధ్యాహ్నం 12.05 గంటలకు ప్రారంభించిన బడ్జెట్ ప్రసంగాన్ని గంట 56 నిమిషాలపాటు ప్రసంగించారు. బడ్జెట్ ప్రసంగం ప్రారంభిస్తూ.. పేదవాడి కన్నీరు తుడిచిన నాడే నిజమైన అభివృద్ధి అని అన్నారు. బడ్జెట్ కేవలం సంఖ్యలు, అక్షరాలు మాత్రమే కాదని, తెలంగాణ ప్రజలకు వారి భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందన్న నమ్మకంతో ప్రజల పక్షాన నిలబడి వారి స్వప్నం సాకారం చేసే బడ్జెట్ అన్నారు. వార్షిక బడ్జెట్ రూ. 3,24,234 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ. 2,34,406 మూలధన వ్యయం, రూ.47,267 కోట్లుగా ప్రతిపాదిస్తూ సభకు సభకు సమర్పిస్తున్నానని ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. 2025-26లో జిఎస్‌డిపి, తలసరిఆదాయం, తెలంగాణ ఆర్థిక వృద్ధిని కూడా ఆయన వివరిస్తూ భవిష్యత్‌లో ఆర్థిక ప్రణాళికను వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణస్థూల రాష్ట్రదేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం 17,82,198 కోట్ల రూపాయలు. గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు10.7శాతంగా నమోదు అయ్యింది. ఇదే సమయంలో, దేశ జిడిపిలో 3,57,13,886 కోట్ల రూపాయలు కాగా, వృద్ధిరేటు8 శాతంగా ఉంది. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉంది. అదే విధంగా దేశ జిడిపిలో రాష్ట్ర జిఎస్‌డిపి 5.0శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన గ్రోత్ ఇంజిన్ గాతెలంగాణ నిలుస్తోంది. భారతదేశ వృద్ధిరేటు తగ్గుతూ మందగమనంలో ఉన్నప్పటికీ, మన రాష్ట్ర వృద్ధి రేటులో మెరుగైన పెరుగుదల కనబడుతోంది. ప్రస్తుత ధరల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9.8 శాతంగా ఉన్న దేశ జిడిపి వృద్ధి రేటు, 2025-26నాటికి 8 శాతానికి పడిపోయింది. కానీ, సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్ర స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి వృద్ధిరేటు 2024-25 లో 10.6శాతం నుంచి 2025-26 నాటికి 10.7శాతానికి పెరిగింది. దీని ద్వారా, మన ప్రభుత్వం ఆచరిస్తున్న విధానాలు సరియైన దిశలో ఉన్నాయని, అవి అభివృద్ధికి తోడ్పడుతున్నాయని అనడానికి నిదర్శనం. రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది. 2025-26ఆర్థిక సంవత్సరంలో, ప్రస్తుత ధరలప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం4 లక్షల 18 వేల 931 రూపాయలు(రూ.4,18,931) కాగా, వృద్ధి రేటు 10.2శాతం. దేశతలసరి ఆదాయం2 లక్షల 19 వేల 575రూపాయలు (రూ.2,19,575) కాగా వృద్ధిరేటుకేవలం 6.9శాతం. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ >>2


బడ్జెట్ పత్రాలు పరిశీలిస్తున్న సిఎం రేవంత్

## ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

### సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి20:** డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ఫ్యూచరిస్టిక్ బడ్జెట్. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చాం అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతుల కల్పనకు సరిపడే నిధుల కేటాయింపు జరిగిందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్దపీట వేసిం >>2

# 6 గ్యారంటీలకు రూ.50,713 కోట్లు

### గత ఏడాది కంటే అధిక కేటాయింపులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి20:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. దీనిలో భాగంగా ఆరు గ్యారంటీలకు రూ.50,713 కోట్లను కేటాయించింది. ఈసారి పద్దులో రైతు భరోసాకు రూ.18వేల కోట్లను కేటాయించింది. దీనికి సంబంధించిన పూర్తి అంశాలపై అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా తమ ప్రభుత్వం భావిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో వ్యవసాయ దిగుబడులలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సహాయం కోసం ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.6,000 చొప్పున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి రూ.12,000 సహాయం అందిస్తున్నామని అన్నారు. ఈ బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండడం వారి ఆత్మ గౌరవానికి చిహ్నంగా ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు' అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్లనిర్మాణం కోసం లబ్ధిదారులకు >>2

## ప్రీమియం పెట్రోల్ లీటరు రూ.2 పెంపు



### పారిశ్రామిక డీజిల్ రూ.22హెచ్చింపు

### సాధారణ పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పు లేదు

### హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్ ప్రకటన

### గల్ఫ్ యుద్ధ ప్రభావం

**న్యూఢిల్లీ, మార్చి 20:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్‌ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను లీటర్‌పై రూ.2.09 మేర పెం చారు. ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఇండియన్ ఆయిల్ (ఐఒసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పిసిఎల్) ఈ మేరకు ప్రకటన విడుదల చేశాయి. పెట్రోల్ బంకుల డీలర్ల సమా చారం ప్రకారం, ఐఓసీఎల్ కు చెందిన 'ఎక్స్ పి95', హెచ్‌పిసిఎల్‌కు చెందిన 'పవర్' పెట్రోల్ వంటి హైఆక్టేన్ ఇంధనాలపై ఈ పెంపు వర్తిస్తుంది. అలాగే పరిశ్రమల్లో వాడే బల్క్ డీజెల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం నుంచి ఈ కొత్తధరలు అమలులోకి వచ్చాయి. ఈపెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. సాధారణ వాహనాల్లో >>2

# మూసీపై వెనక్కి తగ్గం



## డిపిఆర్ పూర్తయ్యాక నిధుల కోసం కేంద్రానికి దరఖాస్తు

### మేం చేసిన అప్పు 3.47లక్షల కోట్లు, గత ప్రభుత్వ అప్పునకు చెల్లిస్తున్న వడ్డీ రూ.3.30లక్షల కోట్లు

### నర్సరీ నుంచి ఇంటర్ దాకా ఒకే విద్యావిధానం, అసెంబ్లీలో మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి20:** జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర విద్యావిధానంలో మార్పులుంటాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు ఒకేచోట చదివేలా విద్యావిధానం ఉంటుందన్నారు. విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తెస్తున్నామని, వాటిపై కమిటీ అధ్యయనం చేస్తోందని తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన ముచ్చటించారు. విద్యావ్యవస్థలో మార్పులపై కమిషన్ నివేదికే ఫైనల్ కాదని చెప్పారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత విద్యావ్యవస్థలో మార్పులుంటాయని స్పష్టంచేశారు. మూసీ పునరుజ్జీవం విషయంలో అగే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నష్టపోయిన వారికి ఎలా ఆదుకోవాలో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటామని. బాధితులను తప్పకుండా ఆదుకుంటామని తెలి పారు. మూసీ అభివృద్ధికి అప్పులు ఇచ్చేందుకు ఏడీబీ సిద్ధంగా ఉం దన్న ఆయన డీపీఆర్ సాంకేతిక నిపుణుల ద్వారానే తయార వుతోందని పేర్కొన్నారు. మూసీ డీపీఆర్ పూర్తయ్యాక నిధుల కోసం కేంద్రానికి దరఖాస్తు చేస్తామన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని కాకపోతే నిధులను రాష్ట్రప్రయోజనాలకు ఉపయోగించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. అధికారంలోకి వచ్చాక రూ.3.47లక్షల కోట్లు అప్పులు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అందులో నుంచి రూ.3.30లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకే చెల్లించామన్నారు. తాము తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి వాడుకున్నట్లు చెప్పారు.

కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాలేదు కానీ రూ.44వేల కోట్ల అప్పు చెల్లించినట్లు చెప్పారు. ఆర్థిక వెసులుబాటు చూసుకొని గ్యారంటీలు అమలు చేస్తున్నామని హరీశ్, కేటీఆర్, కేసీ ఆర్‌కు ఏం చెప్పినా చెవుటోడి ముందు శంఖం ఊదినట్లేనని ఎద్దేవా చేశారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశా రని, అందువల్లే ఆయన అసెంబ్లీకి రాలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాల న్నారు. హిల్ట్‌పాలసీ, టీడీఆర్ భూబదలాయింపుపై ఏ ఏజెన్సీతోనైనా విచారణకు సిద్ధమని కేటీఆర్, హరీశ్‌కు అసెంబ్లీలో సవాల్ చేసినట్లు >>2

# ఇరాన్ పోరు ఉధృతం


శుక్రవారం కువైట్ అల్‌మినార్ శుద్ధి కేంద్రంపై దాడి జరిగిన దృశ్యం

### ఖర్గ్ ద్వీపం స్వాధీనమే ట్రంప్ టార్గెట్

### మూడు యుద్ధనౌకలు ఇరాన్ సముద్రజలాల్లోకి రాక...

### ఇజ్రాయెల్‌ను హెచ్చరించిన గంటలోనే ఇరాన్ ప్రతినిధి హతం


**టెహ్రాన్,జెరూసలెం,వాషింగ్టన్, మార్చి 20:** పశ్చిమాసియాలో ఇరాన్‌పై అగ్రదేశం అమెరికా, ఇజ్రాయెల్‌చేస్తున్న దాడులు మరింత ఉగ్రరూపం దాలుస్తున్నాయి. ఇరాన్‌ను అంతంచేయాలన్న లక్ష్యంతోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలమేరకు 2500కిపైగా నావికాసైనికులు, మూడుయుద్ధ విమానాలు సముద్రజలాల్లోకి వస్తున్నాయి. అమెరికా ముందుగా ఇరాన్‌కు ఆయువుపట్టులాంటి ఖర్గ్ దీవిని స్వాధీనంచేసుకోవాలన్న లక్ష్యంతో ఉంది. మొదటిసారిగా ఎఫ్-35యుద్ధవిమానాన్ని దెబ్బతీసామని >>2

## నేటి నుంచి మక్కల కొనుగోలు

### రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** తెలంగాణలో మొక్కజొన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి శుక్రవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. క్వింటాల్‌కు రూ. రూ.2,400 మద్దతు ధర అందించాలని మార్క్‌ఫెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,21,494 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా >>2

## ఇది బోగస్ బడ్జెట్



### అంతా మాటల గారడీయే: హరీష్ రావు

**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త:** తెలంగాణ బడ్జెట్‌పై బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి విరిచారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఇదొక ఝూటా బడ్జెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500పెన్షన్ ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ బడ్జెట్‌లో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ల >>2



శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు బడ్జెట్ ప్రతులను సమర్పిస్తున్న డి.సిఎం భట్టి విక్రమార్క

# ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

>> దని, అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేస్తూ బడ్జెట్ ప్రతిపాదనలపై స్పందించారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశ పెట్టాం. ఈ పథకం ద్వారా రూ. 5 లక్షల బీమా పరిహారం అందిస్తున్నాం. రాష్ట్రంలోని దాదాపు 1కోటి 15లక్షల కుటుంబానికి ఈ పథకం వర్తించనుందని వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశామని, అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని తెలిపారు. జూన్ నుంచి ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా ద్వారా రూ.5 లక్షల పరిహారం ఇస్తామన్నారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలకు, ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక నిధులు కేటాయించామని, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో కూడా మార్పులు తీసుకువస్తామన్నారు. ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులు ఒకే చోట ప్రభుత్వ స్కూల్లో చదివే విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అప్పులు, ఆదాయానికి సంబంధించి పారదర్శకంగా అన్ని వివరాలు వెల్లడించామని,రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు వివిధ విభాగాల్లో ఉన్న లీకేజీలను అరికడుతున్నాం. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా చెవిలో పువ్వులు పెట్టుకుని అసెంబ్లీ నుంచి బయటకు వచ్చిన బిఆర్‌ఎస్ నేతల తీరుపై సిఎం సెటైర్లు వేశారు. బిఆర్‌ఎస్ నేతల చెవిలో పువ్వులు కాదు వంగబెట్టి వీపుపై బండలు కట్టాలన్నారు.



శుక్రవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి బడ్జెట్ ప్రతులను సమర్పిస్తున్న డి.సిఎం భట్టి విక్రమార్క

# వృద్ధికి భరోసా

>> తలసరి ఆదాయం1 లక్ష 99 వేల 356రూపాయలు (రూ. 1,99,356) ఎక్కువ.అంటే1.9రెట్లు ఎక్కువగా ఉంది.200 యుఎస్ బిలియన్ డాలర్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థ2034కు ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా 2047కు 3 ట్రిలియన్ యుఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఈసారి పద్దు లో రైతుభరోసాకు రూ. 18 వేల కోట్లను కేటాయించింది.దేశానికి అన్నం పెడుతున్న రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా తమ ప్రభుత్వం భావిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో వ్యవసాయ దిగుబడులలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సహాయం కోసం ప్రతి సీజన్ కు ఎకరాకు రూ.6,000 చొప్పున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి రూ.12,000 సహాయం అందిస్తున్నామని అన్నారు. ఈ బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీలకు రూ. 50,713 కోట్లను కేటాయించింది. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండడం వారి ఆత్మ గౌరవానికి చిహ్నంగా ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం "ఇందిరమ్మ ఇళ్లు" అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. బడ్జెట్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5,500 కోట్లు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పరచిన మొదటి వాగ్దానం ఉచిత బస్సు ప్రయాణమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజు రాష్ట్రంలోని 34 లక్షల 37 వేల మంది ఆడబిడ్డలు ఉచితంగా ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 269 కోట్ల 68 లక్షల ఉచిత ప్రయాణాలు చేసి, దాదాపు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఈ సంవత్సరం మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని భట్టిపేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామన్నారు. కాగా ఈ సంవత్సరానికి గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.యువతకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్ కామ్ ద్వారా యూఏఈ, జర్మనీ, జపాన్ , యూకే, కెనడా వంటి 16 దేశాలలో సుమారు 13,930 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా నూతనంగా "సీ.ఎం. ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం" ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్ లో కార్మిక సంక్షేమ శాఖకు రూ.998 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. నేటి బడ్జెట్ లో చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణరాహిత్యవిధానాలను సవరిస్తూ అధిక వడ్డీకి తెచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి మా ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. అంతేకాకుండా, రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి, అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20నుంచి 39 సంవత్సరాలకు పొడిగించింది. ఈ రుణ పునర్ వ్యవస్థీకరణ ద్వారా 2025-26 నుండి 2031-32 దాకా చెల్లించాల్సిన 34 వేల 58 కోట్ల రూపాయల నుంచి 11 వేల 915 కోట్లకు తగ్గింది. దీనిద్వారా, రాష్ట్రానికి 22 వేల 142 కోట్ల రూపాయలు క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగింది. రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహాన్ను క్యూర్ ప్యూర్ రేర్ లతో ప్రతిపాదించింది. దీనితో సమతుల్య, సుస్థిర అభివృద్ధి సాధించడానికి వీలవుతోంది. గోదావరి పుష్కరాల నిర్వహణ కొరకు ఈ బడ్జెట్ లో 500 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం. గోదావరి పుష్కర పవిత్ర దినాల్లో సుమారు 8 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత భీమా ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పేరుతో మొదలయ్యే ఈ పథకానికి రూ.4వేల కోట్లుకేటాయిస్తామని జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తామని ప్రకటించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం అమలు చేస్తామని. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు ఇస్తామని తెలిపారు,ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తామని తెలిపారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేశారు. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు,పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు కేటాయిస్తు డిప్యూటీ సిఎం ప్రకటన చేశారు. విద్యా శాఖకు రూ.26.674 కోట్లు ప్రతిపాదించారు. వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లుమహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లుపర్యాటక రంగానికి రూ.1,224 కోట్లుఎస్సీ సంక్షేమంకోసం రూ.11,784 కోట్లు ప్రతిపాదించారు. ఎస్టీ సంక్షేమం రూ.7,934 కోట్లు, వెనుకబడిన తరగతుల సంక్షేమం రూ.12,511 కోట్లు కేటాయిస్తు ప్రకటన చేశారు. మైనార్టీ సంక్షేమం రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మీ పథకం రూ.3,683 కోట్లు కేటాయింపుల చేశారు. ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు ప్రతిపాదించారు. యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు ప్రకటించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీకి వెయ్యి కోట్ల రూపాయలు, మెట్రో రైలు ఫేజ్2 కోసం రూ.600 కోట్లు మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం రూ.723 కోట్లు కేటాయిస్తు ప్రతిపాదనలు చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి రూ.33,688 కోట్లు కేటాయించామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు రూ.22,615 కోట్లు ప్రతిపాదించారు. రవాణా శాఖ రూ.12,759 కోట్లు, న్యాయ శాఖ రూ.2,367 కోటు, పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ రూ.17,907కోట్లు,శాంతి భద్రతలు రూ.11,907 కోట్లు ప్రతిపాదనలతో బడ్జెట్ ప్రసంగం భట్టి చేశారు. పర్యాటక శాఖ రూ.1,224 కోట్లు కేటాయించారు. పంచాయతీరాజ్ రోడ్లకు 2,062 కోట్లు,రోడ్లు భవనాల శాఖకు 6416కోట్లు కేటాయించారు. హ్యామ్ రోడ్లకు 3053కోట్లు, రీజనల్ రింగ్ రోడ్డుకు 1525కోట్లు, రాజీవ్ యువ వికాసానికి 5800 కోట్లు ప్రతిపాదించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని సభకు వివరించారు.

# 6గ్యారంటీలకు రూ.50,713 కోట్లు

>> ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5,500 కోట్లు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పరచిన మొదటి వాగ్దానం ఉచిత బస్సు ప్రయాణమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజు రాష్ట్రంలోని 34 లక్షల 37 వేల మంది ఆడబిడ్డలు ఉచితంగా ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 269 కోట్ల 68 లక్షల ఉచిత ప్రయాణాలు చేసి, దాదాపు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఈ సంవత్సరం మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామన్నారు. కాగా ఈ సంవత్సరానికి గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర యువతకు సురక్షితమైన విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్‌కామ్‌ద్వారా యూఏఈ, జర్మనీ, జపాన్ , యూకే, కెనడా వంటి 16 దేశాలలో సుమారు 13,930 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా నూతనంగా 'సీ.ఎం. ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం' ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్ లో కార్మిక సంక్షేమ శాఖకు రూ.998 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. చేయూతలో నూతన పెన్షన్లు : చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. నేటి బడ్జెట్ లో చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

## శాఖలవారీగా కేటాయింపులు

**ఆరు గ్యారంటీలు రూ. 50,713 కోట్లు**
**రైతు భరోసా: రూ.18వేల కోట్లు**
**విద్యాశాఖ: రూ. 26,674 కోట్లు**
**వైద్యశాఖ: రూ. 13,679 కోట్లు**
**వ్యవసాయశాఖ: రూ.23,179 కోట్లు**
**వ్యవసాయ ఉత్పత్తుల బోనస్: రూ.3500 కోట్లు**
**విద్యుత్ శాఖ రూ. 21,285 కోట్లు**
**పౌరసరఫరాలశాఖ రూ.7,366 కోట్లు**
**పశుసంవర్ధకశాఖ రూ.1,529 కోట్లు**
**కార్మికశాఖ రూ.998 కోట్లు**
**మహిళ, శిశు సంక్షేమశాఖ రూ. 3,143 కోట్లు**
**పర్యాటక రంగం రూ.1,224 కోట్లు**
**ఎస్సీ సంక్షేమం - రూ.11,784 కోట్లు**
**ఎస్టీ సంక్షేమం - రూ.7,934 కోట్లు**
**బీసీ సంక్షేమం - రూ.12,511 కోటు**
**మైనార్టీ సంక్షేమం - రూ.3,769 కోట్లు**
**కల్యాణలక్ష్మీ పథకం రూ.3,683 కోట్లు**
**ఉపకార వేతనాలు-రూ.4,343 కోట్లు**
**యంగ్ ఇండియా స్కూళ్లు-రూ.5వేల కోట్లు**
**పరిశ్రమలు రూ.3,490 కోట్లు**
**పంచాయతీరాజ్ రూ.33,688 కోట్లు**
**నీటిపారుదల శాఖ - రూ. 22,615 కోట్లు**
**రవాణా , ఆర్ అండ్ బీ రూ.12,789 కోట్లు**
**న్యాయ శాఖ - రూ.2,367 కోట్లు**
**మున్సిపల్ శాఖ - రూ.17,907 కోటు**
**హోంశాఖ - రూ.11,907 కోటు**
**రాజీవ్ యువవికాసం రూ.6 వేల కోట్లు**
**గృహ నిర్మాణం రూ.7,430 కోట్లు**
**గృహజ్యోతి పథకం-రూ.2080కోట్లు**
**ఐటీ శాఖ - రూ.875 కోట్లు**
**మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్-రూ.1500 కోట్లు**
**మెట్రో రైలు ఫేజ్2-రూ.600 కోట్లు**
**మహాలక్ష్మీ పథకం-4,305 కోట్లు**
**మహాలక్ష్మీ గ్యాస్ సబ్సిడీపథకం-రూ.723 కోట్లు**
**ఇందిరమ్మ ఇళ్లు-రూ.5,500 కోట్లు**
**రాజీవ్ ఆరోగ్యశ్రీ-రూ.1143 కోట్లు**
**చేయూత పథకం-రూ.14,861 కోట్లు**
**గోదావరి పుష్కరాలు- రూ.500 కోట్లు**
**ఆలయాల అభివృద్ధి: రూ.440 కోట్లు**
**డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు: రూ.2500 కోట్ల రుణాలు**

# ముస్లింలకు కెసిఆర్ రంజాన్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి20:**రంజాన్ మాసం ఆఖరి పర్వదినమైన ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ముస్లిం సహోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రారంభం నుంచి చివరి రోజువరకు, ప్రతిరోజూ ప్రత్యేక దైవ ప్రార్థనలు, ఉపవాస దీక్షలు,భక్తి శ్రద్ధలతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరిస్తారని అన్నారు.

# మంత్రి ఇల్లు ముట్టడి

**కరీంనగర్ రూరల్,ప్రభాతవార్త:** కరీంనగర్ మంకమ్మతోటలో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసాన్ని శుక్రవారం ఆశా కార్యకర్తలు ముట్టడించడం ఉద్రిక్తతకు దారితీసింది. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ పెద్ద ఎత్తున చేరుకున్న ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకునే ప్రయత్నంలో చోటుచేసుకున్న తోపులాటలో కొందరు ఆశా కార్యకర్తలకు గాయాలు అయినట్టు సమాచారం. పోలీసులు,ఆశా కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి అదుపులోకి తీసుకురావడానికి మంత్రి తరఫున ఆశా వర్కర్లతో చర్చలు జరిపి కార్యాలయ సిబ్బంది వినతిపత్రం స్వీకరించారు.

# నేటి నుంచి మక్కల కొనుగోలు

>> సుమారు 29.79 లక్షల టన్నుల మేర మొక్కజొన్న దిగుబడి రానుంది. అయితే ఇప్పటికే మార్కెట్‌లో చాలా వరకు మొక్కజొన్న స్టాక్ ఉండడంతో వెంటనే కొనుగోళ్లను ప్రారంభించాలని ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో మొక్కజొన్న దిగుబడి రావడంలో మొక్కజొన్నను కొనుగోలు చేయాలని కోరుతూ ఈసారి కేంద్ర ప్రభుత్వానికి రాష్ర ప్రభుత్వం లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ లేఖపై సానుకూలంగా స్పందించిన కేంద్రప్రభుత్వం మొత్తం దిగుబడిలో నుంచి 8 వేల క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ 8 వేల క్వింటాళ్ల కొనుగోళ్లకు గాను కేంద్రప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,400 మద్దతుధర ప్రకటించింది. వ్యాపారులు మాత్రం రైతుల నుంచి క్వింటాల్ మొక్కజొన్నను కేవలం రూ.1,600 నుంచి రూ.1,800కు మాత్రమే కొనుగోళు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా మక్కల కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది.

# 'న్యూ విజన్'తో వినూత్న పథకాలు

>> మరియు మిగతా మూడు రోజులు రాగి జావ అందిస్తాము.ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.800 కోట్లు ప్రతిపాదించాం.5. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం:ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులకు కూడా ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నాం. ఈ పథకం మొత్తానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు ప్రతిపాదించాం.6. నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం:ఉద్యోగస్తులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ దాదాపు 23 లక్షల 51 వేల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తాం. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రయివేట్ ఆసుపత్రులలో 1,998 వ్యాధులకు ఈ పథకం ద్వారా చికిత్సను పొందవచ్చు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందిస్తాం. 7. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం:ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టాం. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే 1 కోటి 20 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుంది, 60 ఏండ్ల వరకు 10 లక్షల రూపాయాల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే2కోట్ల రూపాయలుఅదనపుకవరేజి లభించే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేశాం.ఈ పథకం 7 లక్షల 57 వేల ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు వర్తిస్తుంది. ఈ రెండు పథకాల మొత్తానికి బడ్జెట్ లో రూ.1,056 కోట్లు ప్రతిపాదించాం.8. సి.ఎం.ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం: రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణను మరియు వారికి ఉపాధి లభించిన ఆయా దేశాలకు సంబంధించిన భాషా జ్ఞానంలో శిక్షణ ఇప్పించడం, వారికివీసా మార్గదర్శకత మరియు విదేశీ ప్రయాణానికి కావలసిన రక్షణను ఇచ్చి విదేశాలలో ఆరోగ్య సేవలు, హాస్పిటాలిటీ, నిర్మాణపు పనులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం "సి.ఎం.ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం"ను ప్రారంభిస్తున్నాం.ఈ బడ్జెట్ లో సి.ఎం.ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం పథకానికి రూ.1,056 కోట్లు ప్రతిపాదించాం.9. ఏటీసీ ట్రైనీలకు స్కాలర్ షిప్:ఏటీసీలో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతినెల రూ.2 వేలు స్కాలర్ షిప్ రూపంలో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బడ్జెట్ లో ఏటీసీ ట్రైనీలకు స్కాలర్ షిప్ పథకానికి రూ.80 కోట్లు ప్రతిపాదించారు.

# ఇరాన్ పోరు ఉధృతం

>> ఇరాన్ వెల్లడించింది. అలాగే ఇజ్రాయెల్‌సైతం కీలక సైనిక కమాండర్‌ఐఆర్‌జిసి ప్రతినిధి ఆలిమహ్మద్‌నైనీని ఇజ్రాయెల్ సేనలు హతమార్చాయి. ఇదిలా ఉంటే హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును సడలించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్‌దేశాలు అమెరికాకు మద్దతుపలికాయి. అలాగే నిన్నమొన్నటివరకూ మొజ్తబా ఉన్నాడోలేదో నాకు తెలియదని చెపుతూ వస్తున్న ట్రంప్‌నక స్పష్టంచేసేందుకు ఇరాన్ అధికారిక మీడియా మొజ్తబా ఖమైనీ విడియో అయితే ఈవిడుదలచేసింది. అయితే ఈ విడియో పాతవిడియో అని అమెరికా చెపుతోంది. అమెరికా వైమానిక దాడులను అడ్డుకునేందుకు వీలుగా ఇరాన్ తన ఎస్400, బావర్ 373 విమానాలను ఇతర గగనతల రక్షణ వ్యవస్థలన్నింటినీ మొహరించింది. ఇదిలా ఉంటే తమ దాడుల్లో ఇరాన్ అణుక్షిపణి సామర్థ్యం పూర్తిగా ధ్వంసం అయిందని ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. కేవలం అణుస్థావరాలే లక్ష్యంగా దాడులుచేస్తామని ఇజ్రాయెల్‌ప్రధాని చెప్పారు. ఇదిలా ఉంటే కువైట్‌లోని మినా అల్ త్‌మదీ శుద్ధికేంద్రంపై ఇరాన్ క్షిపణులు దాడిచేయడంతో పాక్షికంగా ధ్వంసం అయింది. దీనితో ఉత్పత్తిని, శుద్ధి కార్యాచరణను పూర్తిగా నిలిపివేసింది. ఇ అలాగేముందురోజు దాడిచేసిన ఖతార్ చమురుశుద్ధి, గ్యాస్‌శుద్ధికేంద్రం మరమ్మతులకే ఐదేళ్లకుపైగా పడుతుందని ఖతార్, అమెరికాలుప్రకటించాయి. ఇప్పటికీ యుఎఇ, సౌదీ, బహ్రెయిన్,ఖతార్ చమురు,గ్యాస్ శుద్ధికేంద్రాలపై ఇరాన్ తమ దాడులు ఆపబోమని ప్రకటించింది. అదేవిధంగా ఇజ్రాయెల్‌కు త్వరలోనే ఒక స్పెషల్ చూపిస్తామని ప్రకటించినకొద్దిగంటల్లోనే ఇరాన్ ఐఆర్‌జిసి ప్రతినిధి నైనీని ఇజ్రాయెల్‌సేనలు హతమార్చడంతో ఇరాన్ ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తోంది. ఇజ్రాయెల్‌పై మరిన్ని దాడులు తప్పవని హెచ్చరించింది. ఇప్పటికే అమెరికా హార్ముజ్‌లోని ఇరాన్ టార్గెట్లపై దాడులు ముమ్మరంచేసింది. ఇరాన్‌పైయుద్ధంకోసం వెళుతున్న యుద్ధవిమానాలకు శ్రీలంక అనుమతించకపోవడం సంచలనంగా మారింది. డిజిబౌటినుంచి మట్టాలా ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు శ్రీలంకలో ఆగేందుకు అనుమతికోరితే తాము నో చెప్పామని శ్రీలంక అధ్యక్షుడు దిస్సనాయకే చెప్పారు. కాగా ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్‌జి ఎగుమతులు ఐదేళ్లపాటు దెబ్బతింటాయని నిపుణులు చెపుతున్నారు. పర్షియన్ కొత్తసంవత్సరం రోజు నౌరుజ్‌వేళ కూడా ఇజ్రాయెల్ దాడులుచేయడాన్ని ఇరాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది.

# మూసీపై వెనక్కి తగ్గం

>> గుర్తు చేశారు. హిల్ట్ పాలసీ వల్ల రూ.5 లక్షల కోట్ల అవినీతి జరిగిందనడం సరికాదని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్ట ప్రకారమే ముం దుకెళ్తామన్న ఆయన అలా వెళ్తేనే రేపు కోర్టులో కేసు నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు 20 నెలలు అం దుబాటులో లేరని ఆ కారణంగానే విచారణ 20 నెలలు ఆలస్యమైందన్నారు. ప్రభాకర్‌రావు అం దుబాటులోకి వచ్చాక విచారణ వేగంగా కొనసాగుతోందని, సుప్రీంకోర్టులో ఫోన్‌ట్యాపింగ్ కేసు ఇంకా విచారణకే రాలేదని స్పష్టం చేశారు. చక్రధర్‌గౌడ్ కేసు కొట్టేస్తే ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టేసినట్లు ప్రచారం చేశారని హరీశ్‌రావుపై మండిపడ్డారు. పంజాగుట్టలో ఓ ప్రైవేట్ కేసులో క్లీన్ చిట్ వచ్చిందని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో 6వేల ఫోన్లు ట్యాప్ చేశారని 204 జూన్ 2 నుంచి ఇప్పటి వరకు కెటిఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని, ఫోన్ ట్యాపింగ్ అంశంలో నన్ను విచారణకు రమ్మని నోటీసు ఇస్తే వెళ్తానని చెప్పారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం మా ప్రణాళిక మాకు ఉందని చెప్పారు. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జీఎస్టీ వసూళ్లు గడిచిన రెండునెలల్లో రూ.4వేల కోట్లు దాటా యన్నారు. మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో పోలీ సులపై కాల్పులు జరిగినా బీజేపీ నేతలు ఏ మాత్రం స్పందించలేదని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా బీజేపీ నేతలు మాట్లాడట్లేదని ఆక్షేపించారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తుందని, కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ఏ పదవి అయినా చేపట్టే వెసులుబాటు స్వేచ్ఛ ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత మీరే సిఎంగా ఉంటారా అన్న విషయంపై ఆయన పై విధంగా సమాధానం ఇచ్చారు. జీవన్ రెడ్డి విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షినటరాజన్‌లను అడగాలని తోసిపుచ్చారు. ఆపరేషన్ కగార్ అనేది కేంద్రం తీసుకున్న నిర్ణయమని, మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి రావాలని, భద్రత కల్పిస్తామని మాత్రమే విజ్ఞప్తి చేశానన్నారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్క పెట్టిన వాళ్లు నేను ఎన్నినిధులు తెచ్చానో లెక్కపెట్టాలన్నారు.గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడే గాంధీమనుమడు బిఆర్‌ఎస్ ట్రాప్‌లో పడారని,గాంధీ దేశానికి జాతిపిత అని పేర్కొన్నారు. డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే బిజెపి స్పందించడం లేదని బిఆర్‌ఎస్ వాళ్లని తిడితే బిజెపి ఎందుకు మాట్లాడుతోందని ప్రశ్నించారు.

# లీటరు రూ.2 పెంపు

>> కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, సాధారణ పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలాగే ఎల్‌పిజి సరఫరాలో అంతరాయం లేకుండా సురక్షితం చేయడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది, ఆ మేరకు చర్యలు చేపట్టిందని వివరించింది. మరోవైపు, ఇంధన సరఫరాపై వస్తున్న వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది. 'క్రూడ్ ఆయిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదు. అదనపు కార్గోలు ఇప్పటికే దేశానికి చేరుకుంటున్నాయి. సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉంది' అని పేర్కొంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100డాలర్ల పైనే స్థిరంగా కొనసాగడం, పశ్చిమాసియాలోనెలకొన్న ఉద్రిక్తతల కారణంగా సరఫరాపై ఆందోళనలు పెరగడం ఈ పెంపునకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

# ఇది బోగస్ బడ్జెట్

>> కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు.బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు.

## వారం - వర్జ్యం

21-03-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
తదియ రా.11.56
అశ్వని రా.12.37
వర్జ్యం : రా.8.55-రా.10.24
దు.ఉ.6.10-7.47
శుభసమయం : ఉ.8.20-9.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:**గతంలో మీ వలన సహాయమును పొందిన వ్యక్తులు అవసరమైనప్పుడు అందుబాటులో ఉండకపోవటం జరుగుతాయి.

**వృషభం:** బంధువర్గం అతి జోక్యంవలన కుటుంబకలహాలు ఏర్పడాయి. జాగ్రత్తలు పాటించండి.కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**మిథునం:** అధికశ్రమను పంచుకోవడానికి నమ్మకస్తులైన వారికి కొన్ని బాధ్యతలు అప్పగిస్తారు. విలువైన వస్త్రాలు కొనుగోలు.

**కర్కాటకం:**పుణ్యక్షేత్రముల సందర్శన, ఆధ్యాత్మిక కార్యక్రమముల నిర్వహణ, మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి.

**సింహం:**లిఖితపూర్వక ఒప్పందములకు వక్రభాష్యములను తెచ్చే తుంటరివర్గం పట్ల అప్రమత్తంగా ఉండండి.ఆరోగ్యం జాగ్రత్త.

**కన్య :** బరువు బాధ్యతలకు దూరంగా కొంతకాలం ఒంటరిగా గడపాలనుకుంటారు.విందు, వినోదాలు పాల్గొంటారు.

**తుల :** కార్యాలయంలో ఉన్న పెండింగ్ వర్క్‌ను పూర్తిచేయడానికి ప్రాముఖ్యత నిస్తారు. వ్యాపారవిస్తరణ ఆలోచనలు చేస్తారు.

**వృశ్చికం:**సంస్థాగతంగా పురోభివృద్ధిని సాధించటమే తక్షణకర్తవ్యమని భావిస్తారు. వాటికి సంబంధించిన విషయ వ్యవహారాలపై దృష్టిని సారిస్తారు.

**ధనుస్సు:** మంచి మాటకారి తనంతో దూరప్రాంతాల నుండి రావలసిన ధనం కొంతవరకు చేతికందివస్తుంది. వాహన కొనుగోలు ప్రయత్నం.

**మకరం :**నిజంగా మీ శ్రేయస్సు కోరుకునే వారు ఎవరు అన్నది తెలుసుకుంటారు. టెండర్స్ అతికష్టం మీద అనుకూలిస్తాయి.

**కుంభం:**ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. సన్నిహితులను కలిసి విషయాలు చర్చిస్తారు.శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** నామమాత్రపు విజయాలు సాధిస్తారు. రొటీన్ సంతకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. ఆర్యోగం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఎఫ్ఎస్ఎల్ పోస్టుల ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖకు అనుబంధంగా వున్న ఎఫ్ఎస్ ఎల్‌లో 14 క్యాటగిరీల కింద 59 పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి చేబట్టిన సెలక్షన్ ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ మేరకు నియమక మండలి ఛైర్మన్ శ్రీనివా సరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అర్హులైన వారిని రాత పరీక్షలతో పాటు గతంలో వారికున్న అనుభవం పరిగణలోకి తీసుకుని మార్కులు వేయడం జరిగిందని, వీటి ద్వారా అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి లభించిన మార్కులను పోలీసు వెబ్‌సైట్‌లో వుంచామని శ్రీనివాసరావు తెలిపారు. కాగా ఈ పోస్టులకు ఎంపికైన వారు ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీలో పు అటెస్టేషన్ ఫారంను పోలీసు వెబ్‌సైట్‌లో పొందు పరచాలని ఆయన కోరారు. దీని తరువాత ఈ నెల 30వ తేదీన ఎంపికైన వారు సిటీ సా యుధ బలగం హెడ్ క్వార్టర్స్‌లో అన్ని సర్టిఫికేట్లతో పాటు మూడు ఫోటోలు, అటెస్టేషన్ ఫాంలు, ఇతర పత్రాలను అందించాలని ఆయన కోరారు.

# బిఆర్ఎస్ నాయకులు డ్రగ్స్‌తో దొరికినా స్పందించని బిజెపి

### బిసిల గురించి బిజెపి మాట్లాడటం విడ్డూరం: మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త:** బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అవుతుందనే బిఆర్ఎస్ నాయకులు డ్రగ్స్‌తో పట్టుబడినా బిజెపి నాయకులు స్పందించడంలేదని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరో పించారు. గాంధీభవన్‌లో ఆయన శుక్రవారం మాట్లాడతూ ఈగల టీమ్ చేసిన దాడిలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఒక ఎంపి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారనీ ఆయన వివరించారు. డ్రగ్స్ మీద మా ప్రభుత్వం ఉక్కు మోపుతోందనీ ఆయన చెప్పారు. డ్రగ్స్ రహిత తెలంగాణ చేస్తామనీ ధీమా వ్యక్తం చేశారు. యువనాయకుడి బ్యాచ్ మొత్తం డ్రగ్స్ కార్యక్రమాల్లో దొరుకుతున్నా రనీ ఎద్దేవా చేశారు. కెటిఆర్ ఫాం హౌజ్ లో డ్రగ్స్ తో వాళ్ళ బామ్మర్ది పట్టుబడ్డారనీ చెప్పారు. కెటిఆర్ సన్నిహితుడు డ్రగ్స్ ఎక్కువ తీసుకుని కేదార్ దుబాయ్ లో చనిపోయాడనీ చెప్పారు. పోచంపల్లి ఫాం హౌజ్ లో కోళ్ల పందాలు. ఇవన్నీ జరుగుతుంటే బిజెపి నాయకులు ఎందుకు స్పందించడం లేదనీ ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేతలు ఇంత మంది దొరుకుతుంటే బిజెపి ఎందుకు మాట్లాడడం లేదనీ నిలదీశారు. బిజెపి రఘు నందన్ మాట్లాడితే ఆయన నోరు ఎందుకు ముపించారనీ విమర్శించారు. బిజెపి బిఆర్ఎస్నికల్లోనే కాదు బయట కూడా కలిసి పని



చేస్తున్నారనీ అన్నారు. బిజెపి లో బిఆర్ఎస్ విలీనం అవుతుంది. అందుకే మాట్లాడడం లేదు. బిఆర్ఎస్ హయంలో మీ బిజెపిఅగ్ర నాయకులను అరెస్ట్ చేసింది మరిచిపోయా రా అని ప్రశ్నించారు. బిజెపినాయకులు బిసిల గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉంది.. బండారు దత్తాత్రేయ బిజెపి ఎన్నో సేవలు అందించారు. ఆయన సికింద్రాబాద్ సీటును కిషన్ రెడ్డి లాక్కున్నారనీ విమర్శించారు. బిజెపిరాష్ట్ర అధ్యక్షుడు సీటు ను మొన్న బండి సంజయ్ ను దించి కిషన్ రెడ్డి లాక్కున్నారనీ అన్నారు. బండారు దత్తాత్రేయకు ఉన్న ఒక్క గవర్నర్ పదవి నీ కూడా మరొక అగ్ర కుల నాయకు డు లాక్కున్నాడనీ ఆవేదన చెందారు. బిసిల గురించి బిజెపినేతలు మాట్లాడడం విడ్డూరం గా ఉంది. మేము బిసి లకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నామనీ అన్నారు. డ్రగ్స్ విషయంలో బిజెపి నేతల వైఖరి జనాలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వారం రోజులు గడుస్తున్న మీరు ఎందుకు మాట్లాడడం లేదనీ ప్రశ్నించారు.

## అది ప్రజా వంచన బడ్జెట్

### కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసం.. దగా.. ప్రజా వంచన బడ్జెట్ ఇది అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. అంకెల ఆర్భాటాలు.. కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగేందేమీ లేదని, ఆదాయాన్ని పండబెట్టి...అప్పుల కోసం అర్రుల చాచే బడ్జెట్ ఇది అన్నారు. మరో రూ.లక్ష కోట్లు అదనంగా అప్పు భారం మోపేందుకు సిద్ధమవ్వడం సిగ్గు చేటు అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో హ్యాట్రిక్ (మూడో బడ్జెట్ ఇది) కొట్టిన కాంగ్రెస్ కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రైతు భరోసా పైసలు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా? రూపాయ బిల్ల కూడా ఇవ్వకుండా కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారన్నారు. మహిళలను మళ్లీ వంచించారు...తులం బంగారం తుస్... రూ.2500లు నిల్ అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని, రూ.4 వేల పెన్షన్ పెంపు ఊసే లేదన్నారు. నిరుద్యోగులున్నారనే సోయే లేదు, బడ్జెట్‌లో నిరుద్యోగ భ్రుతి అంశమే లేదని, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు కదా, రూపాయి బిళ్ల కేటాయించలేదన్నారు. 6 గ్యారంటీలకు పాడె కట్టే బడ్జెట్ ఇదని, ఆరోగ్యశ్రీకి బడ్జెట్ కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉందని, విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదిస్తే 8 శాతానికే పరిమితంచేశారని, దేవాదాయ శాఖకు గత బడ్జెట్‌లో రూ.190 కోట్లు కేటాయిస్తే ఈసారి కేటాయింపుల ప్రస్తావనే లేదన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు ఉన్నాయన్నారు.

## రోహిత్ రెడ్డి సహా ముగ్గురు నిందితుల

# కస్టడీపై సోమవారం తీర్పు

### మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అరెస్టయిన ముగ్గురు వ్యక్తుల కస్టడీ పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు సోమవా రం నాడు తీర్పు వెలువరించనుంది. ఈ మేరకు న్యాయమూర్తి శుక్రవారం ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నెల 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో పోలీసులు దాడిచేసిన సమయంలో రితేష్ రెడ్డికి చెందిన లైసెన్స్ రివాల్వర్‌ను నమిత్ శర్మ తీసుకుని పోలీసులను భయపెట్టేందుకు గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరపడం సంచలనం రేపింది. పోలీసులపై కాల్పులు జరపాలని రోహిత్ రెడ్డి పురిగొల్పినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో రోహిత్ రెడ్డి తన ఫాం హౌస్‌లో అసాంఘీక కార్యకలాపాలకు స్థానం కల్పించినందుకు, తన లైసెన్స్ రివ్వార్‌ను మరో వ్యక్తికి ఇచ్చి నందుకు రితేష్ రెడ్డిని, మరొకరి రివాల్వర్‌చేత పోలీసులపై కాల్పులు జరిపినందుకు నమిత్ శర్మను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సేవించిన ఎంపి మహేష్ కుమార్ యాదవ్ సహా అందరికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. కాగా పోలీసులు అరెస్టు చేసిన రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలు ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వుండగా, వీరిపై డ్రగ్స్ వాడడం, అక్రమంగా మాదకద్రవ్యాలు కలిగి వుండడంతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీనిపై శుక్రవారం నాడు మరోసారి విచారించిన న్యాయమూర్తి తీర్పును సోమవారం వెలువరించనున్నట్లు ప్రకటించారు.

## హైదరాబాద్ పన్ను చెల్లింపుదారులకు శుభవార్త

### హెచ్ఆర్ఎ మినహాయింపు 50శాతం పెంపు
### ఇంటి యజమాని వివరాలు
### తప్పనిసరిగా వెల్లడించాలి: కేంద్రం

**న్యూఢిల్లీ, మార్చి 20:** హైదరాబాద్ పన్ను చెల్లింపుదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఏప్రిల్ 1, 2026 నుండి అమల్లోకి వచ్చే కొత్త ఆదాయపు పన్ను నిబంధనల నోటిఫికేషన్ ప్రకరారం, అద్దె ఇళ్లలో నివసించే జీతభత్యాలు పొందే ఉద్యోగులకు లభించే పన్ను రాయితీ (హెచ్ఆర్ఎ మినహాయింపు) 50శాతానికి పెంచింది. ఇంతకు ముందు ఈ మినహాయింపు 40శాతం ఉండేది. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి) ఈ మేరకు నిబంధనలను నోటిపై చేసింది. ఈ అధిక పన్ను రాయితీ కోసం ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాలతోపాటు హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ వంటి కొత్త నగరాలు కూడా చేరాయి. కానీ ఇంటి యజమాని అద్దెదారు సంబంధాన్ని వెల్లడించడాన్ని తప్పనిసరి చేసే ఆదాయపు పన్ను చట్టం, 2025కు సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు శుక్రవారం నోటిపై చేసింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ఉద్యోగులకు 40 శాతం మినహాయింపు అమలులో ఉంటుంది. హెచ్ఆర్ఏ పరిమితిని 50 శాతానికి పెంచడంతో హైదరాబాద్ జీతభత్యాల వర్గానికి భారీ పన్ను ఉపశమనమని చెప్పవచ్చు.

# సిఎం రేవంత్‌రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు

**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన



రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# రంజాన్ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

### హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో వాహనాల మళ్లింపు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండగ సందర్భంగా శనివా రం నాడు పాతబస్తీలోని ఈద్గా సహా ముస్లిం లు సామూహికంగా హాజరై ప్రార్థనలు జరిపే పలు ప్రాంతాలలో కొన్ని గంటల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు ఈ సమయంలో ఆ యా మార్గాలలో ప్రయాణించే వాహనాలను ఇతర మార్గాలగుండా మళ్లించనున్నారు. ఈ మేర కు నగర ట్రాఫిక్ జాయంట్ పోలీసు కమిషనర్ జోయ ల్ డేవిస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాతబస్తీలోని తాడ్‌బండ్ వద్ద గల ఈద్గా వద్ద ఉదయం ఏడు గంటల నుంచి 11.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు వుంటాయి. దీంతో నగరంలోని బహదూర్‌పురా నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే వాహనాలను కిషన్‌బాగ్, నౌ నంబర్, చింతల్‌బస్తీ, డైరీ ఫాం మీదుగా ఆరాంఘర్ వైపు మళ్లిస్తారు. ఇదే సమయంలో ఆరాంఘర్ నుంచి బహదూర్‌పురా వైపు వచ్చే వాహనాలను మైలార్‌దేవుపల్లి లేదా డైరీఫాం మీదుగా నగరంలోకి అనుమతిస్తారు. కాగా పాతబస్తీలోని కాలాపత్తర్ నుంచి ఈద్గా వైపు వచ్చే వాహనాలను ఆంక్షల సమయంలో స మీపంలోని ఇతర మార్గాల గుండా మళ్లిస్తారు. కాగా ఈద్గా వద్ద ప్రార్థనలకు వచ్చే వారి కోసం వాహనాల పార్కింగ్ కు ఏర్పాట్లు చేశారు. ఈద్గాకు స మీపంలోనే ఈ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రార్థనలకు వచ్చేవారు పోలీసుల సూచనలను పాటిస్తూ తమ వాహనాలను పార్కింగ్ కేం ద్రాలలో నిలపాల్సి వుంటుంది. సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ వద్ద గల ఈద్గాలోనూ ఇదే తరహాలో ముస్లింలు వేల సంఖ్య లో ప్రార్థనలకు హాజరవు తారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలోనూ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో పాటు మాసాబ్ ట్యాంక్ వద్ద గల హాకీ గ్రౌండ్స్‌లోనూ ముస్లింలు ప్రార్థనలు చేయనున్నారు. ఇందుకోసం ఇక్కడ కూడా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మొహదీపట్నం నుంచి బంజారాహిల్స్ వైపు వెళ్లే వాహనాలన్ని మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ పైనుంచి లక్ డికాపూల్ వైపు మళ్లిస్తారు. ఇదే సమయంలో లక్‌డికాపూల్ నుంచి బంజారాహిల్స్ వైపు వెళ్లే వాహనాలను నిరంకారి మీదుగా మళ్లిస్తారు. బంజారాహిల్స్ నుంచి మాసాబ్‌ట్యాంక్ వైపు వచ్చే వాహ నాలను తాజ్ కృష్ణా నుంచి ఎర్రమంజిల్ వైపు మళ్లిస్తారు. ట్రాఫిక్ ఆంక్షల సమయంలో వాహనదా రులు పోలీసులకు సహకరించాలని నగర ట్రాఫిక్ జాయంట్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 9010203626కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

## చేవెళ్లలో పెద్ద శబ్దంతో భూ ప్రకంపనలు

### భయంతో వణికి పోయిన జనం

**చేవెళ్ల, మార్చి 20, ప్రభాతవార్త:** చేవెళలో పెద్ద శబ్దంతో భూ ప్రకంపనలు కలక లం సృష్టించింది. శుక్రవారం ఉ. 9.30 గం.ల ప్రాంతంలో చేవెళ్లలో పెద్ద శబ్దం రావడంతో జనం వణికి పోయారు. ఒక్క సారిగా పెద్ద శబ్దంతో భూమి కంపించడంతో జనం తీవ్ర భయాందోళనకు గురైయ్యారు. దీంతో ఎమైందో తెలియక జనం పరుగుల తీశారు. భూమి కంపించిందని కొందరు చెప్పగా, శబ్దం వచ్చిందని మరి కొందరు స్థానికులు తెలిపారు. ఇంట్లోని వస్తువులు కదలడం గమనించామని తెలిపారు. భూ ప్రకంపమా? లేక పెద్ద ఎత్తున భూమిని ఎవరైన బ్లాస్లింగ్ చేశారా? అని, భూకంపం వస్తే భూమి కంపిస్తుంది కాని శబ్దం మాత్రం రాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. శబ్దంతో పాటు భూమి కంపిండంతో ఎమై ఉంటుందని తెలియక జనం తికమక పడుతున్నారు. ఇప్పటికి ఏమై ఉంటుందో తెలియరాలేదని తెలిపారు.

## తెలుగు రాష్ట్ర ప్రయాణికులకు అలర్ట్

### పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు

**తార్నాక, మార్చి 20 ప్రభాతవార్త:** ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో రైలు ప్రయాణం చేసే ప్రయాణికులకు ముఖ్యమైన సమాచారాన్ని అందించింది రైల్వే శాఖ. రైల్వే ట్రాక్ మరమ్మతులు, అభివృద్ధి పనుల కారణంగా పలు మార్గాల్లో నడిచే ప్యాసింజర్ రైళ్లు తాత్కాలికంగా రద్దు చేయబడినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ఈ రైళ్లు నిర్ణీత తేదీల్లో నడవవని అధికారులు స్పష్టం చేశారు. పనులు పూర్తయ్యిన తర్వాత సేవలను పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు సంబంధిత రైళ్ల సమయాలు, రద్దుల వివరాలు అధికారిక వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

### విహారంలో విషాదం

# గోదావరిలో ఏడుగురు బిటెక్ విద్యార్థులు గల్లంతు



**చింతూరు, మార్చి 20 ప్రభాతవార్త:** ఏటపాక మండలం కొల్లుగూడెం పోలవరం జిల్లా, ఏలూరు జిల్లా కుక్కునూరు మధ్య ఏ డుగురు బి టెక్ విద్యార్థులు శుక్రవారం గోదావరి నదిలో గల్లంతు అయ్యారు. వారిలో ఇద్దరు సురక్షితంగా బయట పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే గాలింపు బృందలు సహాయక చర్యలను ముమ్మరం చేయటంతో ముగ్గురి మృత దేహాలు లభ్యం అయ్యాయి. ఈ ఘటనకు సంభందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ఉగాది సెలవులు కావటతో ఏడుగురు స్నేహితులు కలిసి శుక్రవారం భద్రాచలం శ్రీ సితారాంచంద్ర స్వామిని దర్శనం చేసుకున్నారు. భద్రాచలం నుండి కారులో ఏటపాక మండలం కొల్లుగూడెం ఇసుక ర్యాంప్ వద్దకు చేరుకొని, ఇసుక ర్యాంప్ సమీపంలో కారును ఆపి గోదావరి ఇసుకలో రెండు కిలోమీటర్లు నడిచి కుక్కునూరు వైపుకు ఉన్న నది ప్రవాహం వద్దకు చేరుకున్నా రు. అక్కడ ఫొటోలో దిగుతుండగా ఒకరు నదిలోకి జారీ పోవటంతో ఒకరి కోసం ఒకరు మొత్తం నదిలోకి దిగారు. లోతు ఏక్కువగా ఉండటంతో ఐదుగురు మునిగిపోయారు. ఇద్దరు ఈతకోట్టు కుంటూ ఒడ్డుకు చేరుకొని పోలీసులకు సమాచారం చేరవేశారు. అమరావతి లోని ఎస్ఆర్ఎంటీ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు నవదీప్, సతీష్ కుమార్, తేజసాయి, దీపక్, హర్షవర్ధన్లు భద్రాచలంలోని తమ మిత్రులు అభిరామ్, శ్రీకర్‌లతో కలిసి ఎటపాక మండలం లోని పురుషోత్తమపట్నం గ్రామ శివారులో ఉన్న కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలోని గోదావరి నది లోకి దిగి ఫోటోలు తీసుకుంటూ ఉండగా ప్రమాదం చోట చేసుకుంది. ఏడుగురు యువకులు అకస్మాత్తుగా ప్రవాహంలో మునిగి పోగా ఇద్దరికి ఈత రావడంతో ప్రాణాలతో బయట పడ్డారు. మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. రిస్క్యూ ఆపరేషన్ అనంతరం మూడు మృతదేహాలు లభ్యమయ్యాయి, ఇంకా ఇద్దరి కోసం గాలిస్తున్నారు. గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్‌లుగా గుర్తించారు. ఇందులో అభిరామ్, శ్రీకర్ భద్రాచలం ప్రాంతానికి చెందినవారు. శ్రీకర్, అభిరామ్, ఉయ్యూరు కు చెందిన నవదీప్ మృతదేహాలు లభ్యమయ్యాయి. సతీష్ కుమార్, తేజసాయి కోసం గాలింపు కొనసాగుతుంది. ఘటన స్థలాన్ని చింతూరు ఏ ఎస్ పి హేమంత్, యాటపాక, కుక్కునూరు, భద్రాచలం పోలీసులు చేరుకొని సహాయక చర్యలు చెపట్టారు. పండగ పూట విషాదం విద్యార్థుల కుటుంబాలకు కన్నీటిని మిగిల్చింది.

## బాలాపూర్ 31 ఎకరాల భూదాన భూములను

# పేదలకు పంపిణి చేయండి

**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 1 లక్షా 59 వేల ఎకరాల భూదాన భూములు నిరుపయోగంగా పడి ఉన్నాయని, అవి భూమిలేని నిరుపేదలకు చెందాల్సి నవని, వాటిని వెంటనే నిరుపేదలకు పంపిణి చేయాలనీ సీనియర్ సిపిఐ, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పశ, సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్‌లు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేసారు. శుక్రవారం వారు పొంగులేటిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు పంచేందుకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధు లు ఆచార్య వినోబా భావే భూస్వాముల నుండి సేకరించిన దాదాపు 1,79,000 ఎకరాల భూమి కొద్దిమంది నిరుపేదలకు పంచగా మిగితా భూములు కొంత మేరకు అన్యాక్రాంతమైనా, చాలావరకు నేటికీ ఖాళీగానే ఉన్నాయని తెలిపారు, ఈ భూదా



న భూములు నిరుపేదలకు చెందాల్సి నవని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ భూములను పేదలకు పంపిణి చేసిందని తెలిపారు. ఈ భూములను గూడులేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూదాన భూ ములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం అధీనంలో పెట్టుకోవా లని, అఖిల భారత సర్వ సేవా సంఘం చేసిన సిఫార్సుల మే రకు భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి మొత్తం భూములను పేదలకు పంచాలని మంత్రికి విజ్ఞప్తి చేసారు.

# మహిళల అక్రమ రవాణా కేసు గుట్టురట్టు

**బెజ్జూర్, మార్చి 20, ప్రభాతవార్త :** బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో మహిళల అదృశ్యం కేసు నమోదయింది. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతు ఉండగా, ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు బాధితులను మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గుర్తించి సురక్షితంగా తీసుకువచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సిఐ సంతోష్ కుమార్ తెలిపారు. బాధిత మహిళలు చెప్పిన వివరాల ప్రకారం ఇద్దరు యువతులు ఉద్యోగం కోసం మంచిర్యాల ప్రాంతంలో నివసిస్తున్న సమయంలో కిష్టంపేట్ గ్రామానికి చెందిన ముదిమాడుగుల ప్రశాంత్ అతని భార్య సవిత వారికి పని కల్పిస్తామని చెప్పి పరిచయం పెంచుకుని, మహారాష్ట్రకు చెందిన మహేష్ అనే వ్యక్తి సహాయంతో డబ్బు కోసం ఇతర ప్రాంతాల వారితో వివాహాలు జరిపిస్తామని ప్రలోభపెట్టారు. బాధితులు అంగీకరించక పోవడంతో నిందితులు కుట్ర పన్ని. వారిని బెదిరించి బలవంతంగా రైలులో ఎక్కించి మధ్య ప్రదేశ్‌కు తీసుకెళ్లారు. అక్కడ, వారి ఇష్టానికి విరుద్ధంగా అక్కడి వారితో అమ్మాయిల మేన మామ అని చెప్పి దేవాలయంలో వివాహాలు జరిపించి, ఒక్కొక్కరి భర్త వద్ద నుండి రూ.2,50,000/ చొప్పున డబ్బు తీసుకుని మొత్తం రూ.5,00,000 అక్రమంగా లాభం పొందినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. అనంతరం బాధితులను అక్కడే వదిలి నిందితులు పరారయ్యారన్నారు. ఈ కేసులో సంబంధం ఉన్న ముగ్గురు ప్రధాన ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు చేసిన నేరాన్ని అంగీకరించినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుండి బాదితులకు సంబందించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, బ్యాంక్ పాస్ బుక్స్ వంటి పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మరొక నిందితుడైన మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బెజ్జూర్ ఎస్ఐ సర్తాజ్ పాషా పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఆవరణలో పాము కలకలం


**హైదరాబాద్, మార్చి 20 ప్రభాతవార్త:** అసెంబ్లీలో పాము కలకలం సృష్టించింది. శుక్రవారం శాసన మండలి పాత భవనం గార్డెన్ వద్ద పాము ప్రత్యక్షం కావడంతో అక్కడున్న వారు పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. వెంకటేష్ నాయక్ పామును పట్టుకున్నారు. పట్టుకున్న పాముతో కానిస్టేబుల్ మీడియా పాయింట్ వద్దకు రావడం.. అక్కడు న్న కెమెరాలు క్లిక్ మనిపించాయి. అనంతరం జూపార్కు అధికారులకు సమాచారం అందించి వారికి పామును అప్పగించారు. పామును ధైర్యంగా, చాకచక్యంగా పట్టుకున్న ట్రాఫిక్ కాని స్టేబుల్‌ను పలువురు అభినందించారు. అసెంబ్లీ సమావేశాలు మరికొద్ది సేపట్లో ప్రారంభం అయ్యే సమయంలో పాము ప్రత్యక్షం కావడం, అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్ పామును పట్టుకొని జెర్రీపోతు గా తేల్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



అసెంబ్లీ ఆవరణలో పామును పట్టుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆర్. వెంకటేష్ నాయక్

# పుదుచ్చేరిలో పొత్తులు ఖరారు

**పుదుచ్చేరి, మార్చి 20:** పుదుచ్చేరిలోని ఆల్ ఇండి యా ఎన్ఆర్ కాంగ్రెస్ సారథ్యంలోని ఎన్డీయేలో సీట్ల పంపకాలు ఖరారయ్యారు. ఆ ప్రకారం ఏఐ ఎన్ఆర్‌సీ 16 సీట్లలో పోటీ చేయనుండగా, భాగస్వామ్య పక్షమైన బీజేపీ 10 సీట్లలో పోటీ చేయనుంది. తక్కిన భాగస్వామ్య పక్షాల్లో అన్నాడీ ఎంకే, ఎల్‌జేకేకు చెరో రెండు సీట్లు కేటా యించారు. సిఎం ఎన్ రంగస్వామి సారథ్యంలో ఎన్డీయే కూటమి ఎన్నికలకు వెళ్తోంది. ఎన్డీయే కూటమితో ఏఐఎన్ఆర్‌సీ పొత్తు కొనసాగించే విష యంలో కొద్దిరోజులుగా సస్పెన్స్ కొనసాగుతున్న ప్పటికీ ఇందులో ఎలాంటి మార్పు లేదని, బీజేపీ తో కలిసే ఎన్నికలకు వెళ్తున్నామని రంగస్వామి శుక్రవారం ప్రకటించారు. ఈసారి ఆయన రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. తట్టంచ వాడి, మంగళం నియోజకవర్గాల్లో నామినేషన్లు వేశారు. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే



4న ఫలితాలు వెలువడతాయి. 2021 పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో రంగస్వామి సారథ్యంలోని ఏఐఎన్ఆర్‌సీ 10 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. డీఎంకే 6, కాంగ్రెస్ 6, బీజేపీ 6 సీట్లు గెలుచుకున్నాయి. 84.8 శాతం ఓటింగ్ నమోదైంది. 2016 ఎన్నికల్లో కాంగ్రెస్ 15 సీట్లతో మెజారిటీ సాధించింది. ఏఐఎన్ఆర్‌సీ 8 సీట్లు, అన్నాడీఎంకే 4 సీట్లు, డీఎంకే 2 సీట్లు దక్కించుకున్నాయి. 83.6 శాతం పోలింగ్ నమోదైంది.

# దేశంలో ఈద్ రెండు రోజులు



**న్యూఢిల్లీ, మార్చి 20:** భారతదేశంలో ఈద్‌ఉల్‌ఫితర్ పండుగ ఈసారి రెండు వేర్వేరు తేదీల్లో జరుగుతోంది. కేరళలో ముస్లింలు శుక్రవారం పండుగ జరుపుకుంటుండగా, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో శనివారం వేడుకలు నిర్వహించ నున్నారు. శతాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం శవ్వాల్ నెలవంక కనిపించడంలో తేడాలే ఈ వ్యత్యాసానికి కారణం. కేరళలోని పలు తీరప్రాంతాల్లో గురువారం సాయంత్రం నెలవంక కనిపించడంతో, శుక్రవారమే ఈద్ జరుపు కోవాలని స్థానిక మత పెద్దలు ప్రకటించారు. ఢిల్లీతో సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో గురు వారం నెలవంక కనిపించలేదు. దీంతో ముస్లింలు శుక్రవారం రంజాన్ మాసపు 30వ ఉపవాసాన్ని పూర్తి చేసి, శనివారం నాడు ఈద్ వేడుకల్లో పాల్గొననున్నారు. వ ఖ ని ్ల ం ల ం అనుసరించే హిజ్రీ క్యాలెండర్ చంద్రుడి గమనంపై ఆధారపడి ఉం టుంది. భౌగోళిక ప్రాంతం, వాతావరణ పరిస్థి తుల వల్ల నెలవంక కనిపించే సమయం మారడం సహజం. అందుకే తేదీల్లో ఇలాంటి తేడాలు వస్తుంటాయి. తేదీలు వేరైనా పండుగ ఇచ్చే సందే శం మాత్రం ఒక్కటేనని ఫతేపురి మసీదు ఇమా మ్ ముఫ్తీ ముకర్రం అహ్మద్ తెలిపారు. ఈ పండుగ సందర్భంగా దేశంలో సోదరభావం, సామరస్యం పెరగాలని ప్రార్థిస్తున్నామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భద్రతా కారణాలతో కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే ఈద్ ప్రార్థనలపై ఆంక్షలు విధించారు. ప్రార్థనలను మసీదులకే పరిమితం చేయాలని అధికారులు సూచించారు. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
**పురపాలక సంఘ కార్యాలయము :: కొత్తకోట**
**వనపర్తి జిల్లా**

లేఖ నెం.A/56/Auction/24/25/26/2026-2027 వేలం ప్రకటన, తేది : 20.03.2026.

తేది:26.03.2026, నాడు ఉ: 11.00 గంటలకు కొత్తకోట పురపాలక కార్యాలయములో 2026-2027 సంవత్సరముకై 12 నెలలు అనగా ఏప్రిల్-2026 నుండి మార్చి-2027, సంబంధించిన శైబజారు బహిరంగ వేలము వేయబడును. ఆసక్తిగల వారు SBI, Union Bank కొత్తకోట యందు చెల్లునట్లు రూ.లు: 1,00,000.00 (తిరిగి చెల్లించే డిపాజిట్) ను తేది: 25.03.2026 సా 5.00 గంటల వరకు చెల్లించి, వేలం నిబంధనల ప్రకారం రూ.500.00 తిరిగిరాని రుసుమును మున్సిపల్ కార్యాలయము నందు చెల్లించి, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, నో డ్యూ సర్టిఫికేట్, ఆధార్ / ఓటర్ ఐ.డి. సమర్పించి, దరఖాస్తు పొందవలయును. గమనిక: వేలము పొందినవారు, వేలము మొత్తములో 1/4 వంతు డిపాజిట్‌గా (3) రోజులలో జమచేసి, (3) రోజులలో లీజు అగ్రిమెంట్ సబ్ రిజిస్ట్రార్, వనపర్తి గారి ద్వారా పూర్తి చేసి, సమర్పించవలెను, ఆస్తి / గృహము యొక్క తనఖా అగ్రిమెంట్ మరియు పోస్టేడేటెడ్ చెక్కులు (9) తప్పనిసరి డిసెంబర్ మాసము 5వ తేదీ వరకు మిగిలిన సగమును 2 సమాన వాయిదాలలో చెల్లించవలెను. పురపాలక చట్టం షరతులను ఉల్లంఘించిన యెడల వేలం రద్దు చేయుటకు గానీ, తిరస్కరించుటకు గానీ, కమిషనర్, పురపాలక సంఘం కొత్తకోట గారికి పూర్తి అధికారం కలదు.

DIPR.No.17343-PP/CL/Advt/1/2025-26, తేది: 20.03.2026 సం/- కమిషనర్, కొత్తకోట మునిసిపాలిటీ

వార్త


పూర్వీకుల ఘనతమీద బతికే వారిని మృతవీరుల జాబితాలో చేర్చవచ్చు.

న-లాసన్

# చమురు గతి ఇంతే!


అనుకున్నంతా అయ్యింది. చమురు రవాణాలో ఎక్కడ విఘాతమేర్పడినా దాని ప్రభావం ప్రపంచమంతటా, దేశాల అంతర్గతంగానూ వాటి వినియోగదారులను కలవరపెడ్తోంది. గత అనుభవాలన్నీ ఇదే చెబుతున్నాయి. ఇప్పటికే దేశంలో ఎల్‌పిజి సరఫరాపై ఒత్తిడి కొనసాగుతోంది. ఏం కాదులే. మన దగ్గర ఎన్నో నిల్వలున్నాయి. అవి అయ్యేలోపు యుద్ధం ఆగినా ఆగిపోవచ్చుననే ధీమాతో ఉన్న కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. యుద్ధం తొలిరోజుల్లోనే దేశానికి 70శాతానికిపైగా ఎల్‌పిజి గ్యాస్‌ను అందించే ఖతార్ ఎల్‌పిజి రిఫైనరీ మూసివేసి తాము ఎల్‌పిజి సరఫరా చేయలేమని ముందే చెప్పింది. అప్పుడే కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌వాడకాన్ని పొదుపు చేయించాలని గ్యాస్‌బుకింగ్‌లపై కోత విధించింది. ముందు బుకింగ్ కీ బుకింగ్‌కీ మధ్య వ్యవధి21 రోజుల్నించి 25 రోజులకు పెంచింది. కమర్షియల్ గ్యాస్‌కు పూర్తిస్థాయి కోత పెట్టింది. అంతవరకు తమ ఆహార అవసరాలు వీధుల్లోనైనా తీర్చుకోవచ్చునన్న నమ్మకంతో తమ ఉపాధి ఉద్యోగాల కోసం ఉదయాన్నే ఇంటి నుంచి బయటికెళ్లేవారు. కేంద్రం నిర్ణయం పుణ్యమా! అని రోడ్డుపై చిన్న చిన్న అల్పాహార సంస్థలు, హోటళ్లు, హాస్టళ్లు సైతం గ్యాస్ సిలిండర్ దొరక్క మూతపెట్టేశాయి. తమవద్ద గ్యాస్ సిలిండర్ నిల్వ ఉంచుకున్న హోటళ్లు మాత్రం తాము గ్యాస్ బండలు బ్లాక్‌లో కొంటున్నామన్న మిషతో ఒక్కో ఆహార ఆధరువుకు పదిపైసల గ్యాస్ చార్జీలు వసూలు చేస్తున్నారు. గత కాలపు కోవిడ్ రోజుల్లో మానవాళి ఆరోగ్య సూత్రాలను నేర్చుకుంటే ఈ కాలపు యుద్ధ పర్యవసానంగా ఆహార పొదుపు నేర్చుకుంటున్నారు. కానీ అన్నీ మన మంచికేనని సరిపెట్టుకోగలిగిన పరిస్థితులు మృగ్యమౌతున్నాయి. ఇప్పుడు ఖతార్ మీద ఇరాన్ దాడులు చేయడంతో మరో మార్గాంతరాన్వేషణలో భారత్ అధికారులు యోచన చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఎల్పీజీకి ప్రత్యామ్నాయం దొరికేలోపు గ్యాస్ వినియోగాన్ని అదుపు చేసే పనిలో కేంద్రం కసరత్తు చేస్తోంది. పైప్డ్ నేచురల్ గ్యాస్ నెట్‌వర్క్‌కోసం వ్యూహాలు సిద్ధం చేస్తోంది. హాస్టళ్లు, హోటళ్లు, తీర్థస్థలాల్లో ఆహార వినియోగదారులకు బాగా 'సెగ' తగిలింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ సరఫరా ఉన్న అపార్ట్‌మెంట్ వాసులకు ఎల్‌పిజి సరఫరా 'కట్' చేస్తూఉత్తర్వులిచ్చింది. తొలి నాటి నిర్ణయం బెడిసికొట్టేసరికి వాణిజ్య సంస్థలకు 30 శాతం పెంచినట్లు చెబుతోంది. కానీ ఇప్పటివరకు మూసివేసిన చిన్న చిన్న రోడ్‌సైడ్ హోటళ్లు ఏమీ పునరుద్ధరణ జరుగలేదు. ఉపాధి కోసం పల్లెల నుంచి పట్నం వచ్చిన నిరుద్యోగులు సైతం ప్యాక్‌డ్ ఫుడ్‌తో కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి ఉంది. చేతిలో డబ్బులు అయిపోయాక వారి గతేం కాను. ఇక కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటన ఒకటి విచిత్రంగా ఉంది. పైప్డు నేచురల్ గ్యాస్ నెట్‌వర్క్‌ను వేగవంతం చేసే రాష్ట్రాలకు 10 శాతం అదనంగా ఎల్‌పిజిని కేటాయిస్తామని హామీ ఇచ్చింది.దేశానికి అవసరమయ్యే ఎల్‌పిజిలో 60 శాతానికి పైగా కోతపడింది. పిఎన్‌జి సరఫరాలో గృహావసరాలను, పారిశ్రామికావసరాలను నిరంతరాయంగా కొనసాగించగలమని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ వెల్లడించారు.ప్లాన్‌బాగానే ఉంది కాని దాని అమలు మాత్రం చాలాకష్టమని గ్యాస్ వినియోగదారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో చమురు రేటు బాగా పెరిగింది. ఈ విషయాన్ని ఇరాన్ ముందే హెచ్చరించింది. అయినా ట్రంప్ దూకుడు ఆపలేదు. ప్రపంచదేశాలన్నీ చమురుసెగను తట్టుకోలేక తత్తరబిత్తర పడుతున్నాయి. హార్మూజ్ జలసంధి నుంచి వచ్చే చమురు నౌకలపై త్వరలో ఇరాన్ టోల్‌టాక్స్ వసూలుచేసే ఆలోచనలో ఉంది. ఏదిఏమైనా 'ఎంకిపెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్న' చందాన ఉంది. మళ్లీ చమురు, దాని ఉత్పత్తుల రేట్లుబాగా పెరుగుతాయి. వచ్చేఐదేళ్లూ ఎల్‌పిజి తయారీ సామర్థ్యాన్ని 17 శాతానికి తగ్గిస్తామని ఖతార్ రిఫైనరీ ప్రకటించడం ఆందోళనకరం. ఎల్‌పిజికి ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితుల్లో ఇలాంటి సమాచారం వినేందుకు భారతదేశానికి పెద్ద కుదుపే. చమురు గ్యాస్ వంటి పెట్రోలియం ఉత్పత్తులకు కొరత ఏర్పడితే అన్ని రంగాల్లోనూ వెనుకబాటుతనం ఆవహిస్తుంది.ఇది తథ్యం. పశ్చిమాసియా యుద్ధం కారణంగా లక్షల టన్నుల మేర ముడి చమురు పర్షియన్ గల్ఫ్ జలాల్లో నౌకల్లో చిక్కుకుపోయాయన్న సమాచారం భారతీయుల్ని ఆందోళనలో ముంచింది.16.7లక్షల టన్నుల ముడిచమురు 3.2 లక్షల టన్నుల ఎల్‌పిజి, దాదాపు రెండు లక్షల టన్నుల ద్రవరూప సహజవాయువు 22 సరకు రవాణా నౌకల్లో ఉండిపోయాయి.గల్ఫ్‌లోనే ఉండిపోయాయి. అక్కడి నుంచి బయలుదేరి బయట పడితే తప్ప భారత్‌లో వినియోగదారుల అవసరావు తీరవు. తీరా ప్రస్తుత తరుణంలో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు 119డాలర్లకు చేరుకుంది. ఇరాన్ గ్యాస్ ఫీల్డ్ మీద ఇజ్రాయెల్ దాడి చేసింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై ఇరాన్ దాడులు ప్రారంభించింది. ఇలా ఇప్పుడు చమురు నిక్షేపాలపై యుద్ధ ఛాయలు కనిపిస్తున్నాయి. మరోపక్క రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోళ్లపై అమెరికా ఆంక్షలను సడలించడం, రష్యా చమురు భారత్‌కు చేరుకోవడం ఆశావహంతో ఉన్నా, ఇక్కడకు చేరుకుంటేనే కానీ భారత్ ఊపిరి పీల్చుకోలేదు. పెట్రోల్, డీసెల్, ధరలు పెంపు ముఖం పట్టాయి. ఇదే జరిగితే ఎక్కడో యుద్ధానికి ఇక్కడ భారతీయులు చేతులు ముడు చుకొని కూర్చోవాల్సిందే. చమురు, కొరత, రవాణా వ్యయం పెరిగితే ప్రపంచంలో ఆహార సంక్షోభం తలెత్తుతుందని ప్రపంచ వాణిజ్య సంస్థ ఆందోళన వెలిబుచ్చింది.

దేశభక్తులెప్పుడూ దేశం కోసం తాము మరణిస్తామంటారు. కాని ఎవరినైనా చంపుతామని మాత్రం అనరు.



బర్ట్రండ్ రస్సెల్

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

# ప్రజావాక్కు



## యుద్ధం వద్దు!

యుద్ధం పేరుతోకొన్ని దేశాలవారు ఐక్య రాజ్యసమితి ఆశయాలు, వాటి నిబంధనలు తుంగలో తొక్కి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది చాలావిచారకరం.ఈ కారణంగా అంతర్జాతీయస్థాయిలో మానవత్వం మంట కలిసిపోయింది. బాంబుల దాడులు, భీకారమోతలు, చమురు దేశాల్లోకలకలం ప్రపంచశాంతి నినాదం,కరువైంది. ప్రాణనష్టం,ఆస్తులనష్టం గురించిఆలోచించి అడుగు ముందుకు వేయాలి. సామాజిక అభివృద్ధి, మానవ హక్కులు కాపాడేందుకు 1945 సంవత్సరంలో న్యూయార్క్ నగరంలో ఏర్పాటు అయింది. చట్టం, భద్రత, సామాజిక అభివృద్ధి మానవ హక్కుల పరిరక్షణ ఈ సంస్థ ప్రధాన కర్తవ్యం. ఐక్య రాజ్య సమితి ఆశయాలు నిజం చేయడానికి బదులు ప్రస్తుతం మంటకలిపారు. అణుబాంబులు వ్యాప్తి కారణంగాఅమాయక ప్రాణాలుబలి.పర్యావరణ పరిరక్షణ కరువు. ఆస్తినష్టం, ప్రాణనష్టం ఇక ఎవరికి లాభం ఆలోచించాలి.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర, హైదరాబాద్

## సైబర్ నేరాలను అరికట్టాలి

ప్రభుత్వరంగబ్యాంకుల్లో ప్రజలు తమకష్టార్జితాన్ని పొదుపు రూపంలోదాచుకుంటారు.అయితే సైబర్‌నేరగాళ్ల ప్రజలకు తెలియకుండానే ఈ సొమ్మును దొంగిలిస్తున్నారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు పోలీసులకు, బ్యాంకులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా అవిదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయం. బ్యాంకులు స్తంభింపజేసిన సొమ్మును తిరిగి పొందడం కేవలం సైబర్‌సెక్యూరిటీ సిబ్బంది ద్వారానే సాధ్యమని చెబుతున్నాయి. అధికారులు సకాలంలో స్పందించి, సాంకేతికతనుఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి వచ్చేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

## నఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో భూముల విలువ ధరలుపెరగడంతో ఎస్సీ,ఎస్టీలఇండ్ల స్థలాలు అగ్రవర్ణాలు ఆక్రమించుకోవడం అక్రమ నిర్మాణాలు చేయడం జరిగింది.ఈవిషయమై భూమిని కోల్పోయిన వారు భూకబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి 3 సంవత్సరాలు దాటుతున్నా న్యాయం జరగడం లేదు.

- రాపాక రవీందర్, జనగాం

## అప్పుల ఊబిలో భాగ్యనగరం!

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం ఇప్పుడు ఒక అంతుచిక్కని ప్రశ్నగా మారింది.అసెంబ్లీ సాక్షిగాప్రభుత్వంప్రవేశపెట్టిన బడ్జెట్ గణాంకాలు చూస్తుంటే అంకెల గారడీతో ప్రజల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తాజా నివేదిక ప్రకారం, రాష్ట్రం ఊహించని ఆర్థిక సంక్షోభంలోకూరుకుపోతోంది. 2025-26ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 2.29 లక్షల కోట్ల రెవెన్యూ రాబడిని అంచనా వేయగా,జనవరి 2026 నాటికి కేవలం 60.23 (రూ.1,38,371 కోట్లు) మాత్రమే వసూలైంది. రెవెన్యూ వ్యయం మాత్రం రూ. 1,48,937 కోట్లకు చేరింది. అంటే, సంక్షేమం పాలన కోసం వచ్చే ఆదాయం కంటే ఖర్చేఎక్కువగా ఉంది. ఫలితంగా రాష్ట్రం రూ. 10,566కోట్ల భారీ రెవెన్యూ లోటును నమోదు చేసింది. 2026 జనవరి నాటికే రాష్ట్రం అప్పుల పరిమితిని దాటేసింది.

- దిడ్డి శ్రీకాంత్, హైదరాబాద్

## యుద్ధాలతో గుణపాఠాలు

ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు మానవాళికి ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయి. అయినప్పటికీ దేశాల మధ్య విభేదాలు పెరిగినప్పుడల్లా యుద్ధం అనే మార్గానికే మొగ్గుచూపడం ఆందోళనకర విషయం. ప్రస్తుతం పరస్పరం పోరాడుతున్న దేశాల వైఖరి రోజురోజుకు కఠినంగా మారుతోంది. ఈ పరిస్థితి చూస్తే ఈఘర్షణ కూడా దీర్ఘకాలిక యుద్ధంగా మారేప్రమాదం ఉందనే భావన కలుగుతోంది. ఇటీవల ప్రపంచం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘర్షణల వల్ల ఎంతటి విధ్వంసం సంభవించిందో చూసింది.ప్రస్తుతం ప్రపంచంలో అణ్వాయుధాలు వంటి అత్యంత ప్రమాదకర ఆయుధాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలోయుద్ధాలు భయంకర పరిణామాలకు దారితీయవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

మన దేశంలో దాదాపు 30 రకాల పర్యాటక రంగాలున్నాయి. అందులో ఒకటి విమానరంగం.పూర్వం బేగంపేట విమానాశ్రయంలోవచ్చేపోయే విమానాలను చూడటానికిపల్లెటూర్ల నుండి పనిమీద బంధువుల ఇంటికి హైద్రాబాద్ వచ్చినవారు టికెట్టుకొని పర్యాటకుల కోసం ఏర్పాటు చేసినమిద్దె మీద ప్రదేశానికి వెళ్ళి చూసేవారు. ఇదే మాదిరిగా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో కూడా పర్యాటకులకు ఇటువంటి సదుపాయాన్ని రూ.50లోపు ప్రవేశ రుసుమును నిర్ణయంచాలి.

- పి. లక్ష్మి, సికింద్రాబాద్

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎవరి 'పంచాంగం' వారిదే!

**ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లో వందల వేల సంవత్సరాల క్రితం రూపొందించిన శాస్త్రాలలో గ్రహాల స్థితిగతులు, ప్రధానంగా సూర్యచంద్రుల గమనాలు, గ్రహణాలు, నిమిషాలు, సెకండ్లతోసహా స్పష్టంగా పేర్కొన్నారు. అవి తు.చ తప్పకుండా జరుగుతున్నాయి. అలాంటి శాస్త్రాల ఆధారంగా చెబుతున్న పంచాంగ శ్రవణాల పట్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గిపోతున్నది.**

దామెర్ల సాయిబాబ

ఏ శాస్త్రమైనా అధ్యయనాల మీద అధ్యయనాలు చేసి మదించే కొద్దీ కొత్త విషయాలు ఆవిష్కరిస్తుంటాయి. శాస్త్రాలను అధ్యయనం చేసిన పండితులు, స్వామిజీలు, పీఠాధిపతులు తదితర వైజ్ఞానిక సంపన్నులు వాటిలోని ఆంతర్యాన్ని, మారిన కాల, మాన పరిస్థితులకు అనుగుణంగా సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో విషయాలు అందించాలి. అప్పుడే శాస్త్రాలపై, వాటిని బోధించే పెద్దలపైనా, వాటన్నింటికి మూలమైన దైవంపైన విశ్వాసం, నమ్మకం ఏర్పడుతుంది. ఆరాధనా భావం పెరుగుతుంది. ఇందులో దైవం కంటే ఈ పెద్దల పాత్రే కీలకం. అందుకే వారు ప్రవచించడం, ప్రబోధించడమే కాదు వీలైనంతవరకు ఆచరించి అనుకరణీయంగా వ్యవహరించి ఆదర్శప్రాయంగా వారి ప్రవర్తన, వ్యవహారశైలి ఉండాలి. అందుకు భిన్నంగా ప్రవర్తన ఉన్నట్లు ప్రజలు గ్రహిస్తే వారి బోధనలకు విశ్వసనీయత ఉండదు. అందుకే కొందరు మఠాధిపతులకు, స్వామిజీలకు, పీఠాధిపతులకు ఎక్కడలేని ప్రజాదరణ ఉండి, జనం వారి ప్రవచనాలు వినేందుకు తండోపతండాలుగా వస్తుంటే మరికొందరు స్వామిజీలు, పీఠాధిపతుల ప్రసంగాలకు రాజకీయ సమావేశాలకు తరలించినట్లు కూలి జనాన్ని తరలించాల్సి వస్తున్నది. వాస్తవంగా చూస్తే భారత్‌లో శాస్త్రాలకు కొరత లేదు. ఏది ఎప్పుడు ఎలాచేయాలో అనే వివరాలు మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. పండగ, పబ్బాలే కాదు, వివాహక కార్యక్రమాలు, చివరకు అంత్యక్రియలకు కూడా ఎలా చేయాలో స్పష్టంగా పేర్కొంటున్నాయి. కానీ దాన్ని అర్థం చేసుకొని అన్వయించడంలోనే అసలు విషయం దాగి ఉంది. తెలుగు ప్రజలకు ప్రధానమైన పండుగల్లో పవిత్రమైన, ప్రధానమైన తొలిపండుగ ఉగాది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ప్రపంచంలోని తెలుగువారందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. సకల సౌకర్యాలతో అష్టలక్ష్ములతో తులతూగాలని శుభాకాంక్షలు అందచేసుకుంటూ పండుగలు జరుపుకోవడం ఆనవాయితీ. పండుగలు సమాజానికి జీవనాధారం. అవి నూతనోత్తేజాన్ని ఇస్తాయన్న విషయం కాదనలేం.గత స్మృతులు గుర్తు తెచ్చుకొని బంధుమిత్రులతో ఆనందంగా గడిపే తొలి పండుగ ఈ ఉగాది. అన్నింటికంటే మించి పల్లె సీమల్లో ముఖ్యంగా రైతుల జీవనంతో ఈపండుగ ముడిపడి ఉంది. వ్యవసాయానికి సంబంధించి రైతులు భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేసుకునేందుకు ఈ పండుగ సందర్భంగా స్వామిజీలు, పీఠాధిపతులు, పండితులు చేసే పంచాంగ శ్రవణంపై ఆధారపడుతుంటారు. ఇది ఇప్పటికిప్పుడే పుట్టింది కాదు. శతాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. ఉగాది రోజు తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల్లో సైతం కొత్త సంవత్సరంలో వర్షాలు ఎలా వస్తాయి? ఏ పంటలకు అనుకూలం? ప్రభుత్వాల పరిస్థితి కూడా ఈ పంచాంగ శ్రవణంలో పంచాంగాలు చూసి పండితులు వివరిస్తుంటారు. అందుకోసం గ్రామంలో ఉన్న రైతులు ఉగాది రోజు దేవాలయం వద్దనో, లేక గ్రామపంచాయతీ కార్యాలయం వద్దనో సమావేశమై పంచాంగ శ్రవణాన్ని శ్రద్ధాభక్తులతో ఆలకిస్తారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రభుత్వమే అధికారికంగా ఈ పంచాంగ శ్రవణాన్ని ఏర్పాటు చేస్తున్నది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తర్వాత దీనికి ప్రాముఖ్యత పెరిగిందనే చెప్పొచ్చు. అయితే ఒకనాడు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పంచాంగ శ్రవణం రానురాను ఆదరాభిమానాలు కోల్పోతున్నదేమోననిపిస్తున్నది. పర్యావరణంలో వచ్చిన మార్పులు కారణంగా రుతువులు గతి తప్పుతున్నాయి. వరుణదేవుని అడుగులు వాతావరణ శాస్త్రజ్ఞులకే అందడం లేదు. మానవుడు పర్యావరణానికి చేస్తున్న హానితో అందుకు ప్రకృతి కూడా రెట్టింపు స్థాయిలో 'తమలపాకుతో నువ్విట్లంటే తలుపు చెక్కతో నేనట్లంటా' అన్నట్లు ప్రతీకారం తీర్చుకుంటున్నది. మరొకపక్క పంచాంగాలు లెక్కకు మించి వస్తున్నాయి. శాస్త్రం ఒక్కటే అయినా అన్వయించే సిద్ధాంతకర్తల ఆలోచనా

ఒక్క మాట

సరళికి, అవసరాలకు అనుగుణంగా మారిపోతున్నది. ఇందులో రాజకీయాలు ప్రవేశించాక పరిస్థితి మరింతదిగజారింది. ప్రతియేడాది రాజకీయ పార్టీలకు సంబంధించి ఆయా పార్టీల ఆఫీసుల్లో ఈ పంచాంగ శ్రవణాలు జరుగుతున్నాయి. కానీ ప్రతి పార్టీకి కొత్త సంవత్సరంలో ఎదురు ఉండదని చెప్తుంటారు.నాయకుల జాతకాల ప్రకారం వారి మాటలకు తిరుగు ఉండదని అధికారంలో ఉన్నవారైతే తిరిగి అఖండ విజయం సాధిస్తారని, ప్రతిపక్షంలో ఉన్నవారైతే అధికారంలోకి రావడం ఖాయమని చెప్తుంటారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో మొన్న ఉగాది పండుగ రోజు జరిగిన పంచాంగ శ్రవణంలో కూటమి ప్రభుత్వానికి ఎదురుండదని, మరింత ప్రజాభిమానం సంపాదించుకొని ముందుకు సాగిపోతుందని పంచాంగ శ్రవణకర్త వివరించారు. వైఎస్సార్‌సిపికి సంబంధించి జరిగిన పంచాంగ శ్రవణంలో ప్రభుత్వం మీద అసంతృప్తి పెరుగుతున్నదని, అది వైఎస్సార్‌సిపి పార్టీకి అనుకూలంగా మారే అవకాశాలున్నట్లు చెప్పుకొచ్చారు.ఇక తెలంగాణలో అధికారికంగా జరిపిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి ఈ యేడాది రాజయోగం బలంగా ఉందని, రాజకీయ అడ్డంకులను, ప్రత్యర్థి వ్యూహాలను పటాపంచలు చేసి శత్రువులపై పైచేయి సాధిస్తారని,పంచాంగశ్రవణం చేసిన సిద్ధాంతి వివరించారు. ముఖ్యమంత్రి తీసుకొనే కొన్ని సంచల నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్‌నే మార్చేస్తాయని, అలాగే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు అంతర్గత కలహాలు సృష్టించే శక్తులు చురుగ్గా ఉంటాయని కూడా చెప్పారు. ఈ యేడాది ముఖ్యమంత్రి జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం పొందుతారని, ఇక ప్రధాన ప్రత్యర్థి పార్టీ బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్లతోపాటు పాలనా వైఫల్యాలు కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, ఈ యేడాది ప్రతిపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం ఉందన్నారు.ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా యుద్ధమేఘాలు కమ్ముకున్నా భారత్‌లో గ్యాస్ సిలిండర్ ధర ఇప్పటివరకు పెరగలేదు. ఇకముందు కూడా పెరగబోవు అంటూ భవిష్యత్‌లో ఏం జరగబోతుందో ముందే ఊహించే దృక్పథం ఉన్న దూర దృష్టి కలిగిన మోడీ నాయకత్వమే ఇందుకు కారణమని మరో పంచాంగకర్త బిజెపి కార్యాలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో వివరించారు. శాస్త్రం ఒక్కటే అయినా శాస్త్రుల అన్వయంలో మారిపోతున్నాయి.గతంలో ఒకసారి ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాంగ శ్రవణకర్తకు ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తే కార్యక్రమం అప్పగించారు. అందుకు ఆయన ససేమిరా అన్నారు. ఆనేతకు గ్రహబలాలు బాగాలేవని, ముఖ్యమంత్రిగా ఆయనకు అదే చివరి అవకాశమని ఆ పంచాంగకర్త గట్టిఅభిప్రాయమే కాదు నమ్మకం కూడా.దీంతో అప్పటికప్పుడు ఏకంగా పంచాంగకర్తనే మార్చి మరొకరితో చెప్పించారు. ఆయన అన్నట్టే ఆ ముఖ్యమంత్రికి అదే చివరి అవకాశమైంది. మన శాస్త్రాలకు ఎంతో విశిష్టతఉంది. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లో వందల వేల సంవత్సరాల క్రితం రూపొందించిన శాస్త్రాలలో గ్రహాల స్థితిగతులు, ప్రధానంగా సూర్యచంద్రుల గమనాలు,గ్రహణాలు,నిమిషాలు, సెకండ్లతోసహా స్పష్టంగా పేర్కొన్నారు. అవి తు.చ తప్పకుండా జరుగుతున్నాయి.అలాంటి శాస్త్రాల ఆధారంగా చెబుతున్న పంచాంగ శ్రవణాల పట్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గిపోతున్నది. ముఖ్యంగా సనాతనధర్మ సంప్రదాయాలను, దైవాలను విశ్వసించేవారిలో ఎలాంటి ప్రభావం చూపుతున్నదో పండితులు, స్వామిజీలు ఆలోచించాలి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరుగుతున్నా అంతకు రెట్టింపుస్థాయిలో మానసిక ఒత్తిడి నుంచి బయటపడి ప్రశాంతత కొరకు దైవం పట్ల మొగ్గుచూపే వారి సంఖ్య అంతకురెట్టింపు స్థాయిలో పెరుగుతున్నది. దేవుడికి సమర్పించుకునే కానుకలు ఏ మేరకు సద్వినియోగం అవుతున్నాయనే విషయాన్ని పట్టించుకోకుండా కోట్లాది రూపాయలు సమర్పించుకుంటున్నారు. మరొకపక్క పవిత్రమైన దేవాలయ పాలకమండళ్లలో నేరచరిత్రులు చోటు దక్కించుకుంటున్నారు. సాక్షాత్తు కలియుగ దైవం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు కలిగిన తిరుపతి వెంకన్న కూడా ఈదోపిడీ, దగానుంచి తప్పించుకోలేకపోతున్నారు. మఠాధిపతులు, స్వామిజీలు, సంతులు, పండితులు వైజ్ఞానిక జ్ఞానసంపన్నులు తదితరపెద్దలందరూ మనస్సుపెట్టి ఆలోచించాల్సిన తరుణమిది. ఏదో కొందరు రాజకీయ నేతల మెప్పుకోసం స్వలాభాల ఆరాటంలో కొందరు స్వామిజీలు పంచాంగ పండితులు శాస్త్రాలను కూడా వక్రీకరిస్తున్నారనే అభిప్రాయం జనంలోరానురాను బలపడుతున్నది. ఇది సమాజానికి ఏమాత్రం మంచిది కాదు. ●

# 'ఆస్కార్'కు మనం దగ్గరా.. దూరమా?

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ప్రపంచ సినీ రంగంలో అత్యున్నత గౌరవంగా భావించే ఆస్కార్ అవార్డులు ప్రతి సినిమా దేశానికి ఒక లక్ష్యం, ఒక గౌరవ ప్రతీక. భారతీయ సినిమా శతాబ్ద కాలం చరిత్ర కలిగి ఉన్నా, ఈ అంతర్జాతీయ వేదికపై మన విజయాలు చాలా పరిమితంగానే ఉండటం ఒక ఆలోచనీయ విషయం. ఒకప్పుడు భారతీయ చిత్రాల గొప్పతనం దేశ సరిహద్దులకే పరిమితమైపోయిందనే విమర్శలు వినిపించేవి. ఈ నేపథ్యంలో గతం, వర్తమానం, భవిష్యత్తును ఒకే దృశ్యంలో చూసినప్పుడు భారతీయ సినిమాల ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా కనిపిస్తుంది. భారతదేశం నుంచి ఆస్కార్‌కు వెళ్లిన చిత్రాల చరిత్రను చూస్తే, కొన్నే చిత్రాలు అంతర్జాతీయ ఫీచర్ విభాగంలో నామినేషన్ దశను చేరుకున్నాయి. అవి కూడా గెలుపు తలుపు దగ్గరే ఆగిపోయాయి. అంటే ప్రతిభలో కొరత లేదు కానీ, గెలుపు కోసం అవసరమైన మరి కొన్ని అంశాల్లో వెనుకబాటుతనం ఉందని స్పష్టమవుతుంది. అయితే ఇటీవల జరిగిన కొన్ని విజయాలు మాత్రం ఈ దృశ్యాన్ని కొంతవరకు మార్చాయి. ఒక పాటకు, ఒక డాక్యుమెంటరీకి వచ్చిన అవార్డులు భారతీయ సినీ ప్రపంచానికి ఒక కొత్త ఆశను ఇచ్చాయి. సరైన కథ,సాంకేతిక నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం ఉంటే మన సినిమాలు కూడా గెలవగలవని అవి నిరూపించాయి. ఇంతవరకు మన సినిమాలు ఆస్కార్ స్థాయిలో ఎందుకు నిలబడలేకపోయాయనే ప్రశ్నకు సమాధానం వెతికితే, అనేక కారణాలు కనిపిస్తాయి. మన కథలు స్థానికంగా బలంగా ఉన్నా,అవి ప్రపంచ ప్రేక్షకులకు పూర్తిగా చేరే విధంగా రూపకల్పన కావడం కొన్ని సార్లు కష్టమవుతోంది. భాషా భేదం,భావ వ్యక్తీకరణలోని సాంస్కృతిక ప్రత్యేకతలు, అనువాదంలో కోల్పోయేభావం ఇవి ఒక గోడలా మారుతున్నాయి. అంతేకాదు, ఆస్కార్ వేదికపై ప్రభావం చూపే ఓటర్లలో




ఎక్కువ మంది పాశ్చాత్య ప్రపంచానికి చెందినవారు కావడం వల్ల, వారిఅభిరుచులు,వారి కథన శైలులు ఎక్కువగా ప్రాధాన్యం పొందుతున్నాయి. మన సినిమాల సంగీతం, నాటకీయత, భావోద్వేగాల వ్యక్తీకరణను వారు ఎప్పుడూ అదే తీవ్రతతో స్వీకరించకపోవడం కూడా ఒక కారణం. మరో ముఖ్యమైన అంశం ప్రచారం. ఒక సినిమా ఎంత గొప్పదైనా, అది ప్రపంచవ్యాప్తంగా చర్చకు రాకపోతే, సరైన వేదికలలో ప్రదర్శించబడకపోతే, ఓటర్లకు చేరుకోకపోతే, అవార్డు అవకాశాలు తగ్గిపోతాయి. ఈవిషయంలో భారతీయ సినిమాలు చాలాకాలంగా వెనుకబడిఉన్నాయి. సరైన ప్రదర్శన, సమర్థమైన ప్రచారం, అంతర్జాతీయ స్థాయిలో వ్యూహం ఇవి అన్నీ కలిసి పనిచేయాలి. అదే సమయంలో విడుదల వ్యవస్థ కూడా కీలకం. ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లో ప్రదర్శన లేకపోతే, విమర్శకుల దృష్టికి రాకపోతే, ఒకమంచి సినిమా కూడా గుర్తింపు పొందకుండా మిగిలిపోతుంది.అయితే ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి.ప్రపంచం చిన్నదవుతోంది. భారతీయ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా సులభంగా అందుబాటులోకి వస్తున్నాయి. కథలలో కూడా మార్పుకనిపిస్తోంది. స్థానికతను కాపాడుకుంటూనే, ప్రపంచంలోని ప్రతి మనిషికి అనుభూతి కలిగించే అంశాలను మనచిత్రాలు స్పృశిస్తున్నాయి.సాంకేతికంగా కూడా మన సినిమా స్థాయిపెరిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీపడే స్థాయికి చేరుకుంటోంది. ఈ మార్పులు కొనసాగితే, ఆస్కార్ వేదికపై భారత దేశంస్థానం మరింత బలపడే అవకాశం ఉంది. కాబట్టి 'ఆస్కార్‌కు ఆస్కారం లేదు" అని తేల్చేయడం సరైన దృక్కోణం కాదు. ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అందుకోలేకపోయామన్నది నిజం. కానీ మార్పు ప్రారంభమైంది. సరైన దిశలో అడుగులు వేస్తే,కథలో విశ్వవ్యాప్తతను పెంచితే,ప్రచారంలో నైపుణ్యం చూపితే, భవిష్యత్తులో ఆస్కార్ గెలుపు భారతీయ సినిమాలకు సాధారణ విషయంగా మారే రోజులు దూరంలో లేవు. ●

# అటవీ సంరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ అటవీ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహించబడుతుంది. 2012లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించినప్పటి నుండి, ప్రపంచ దేశాలు అన్ని రకాల చెట్లు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించబడింది. మానవుల ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని తెల్పడం ప్రపంచ అటవీ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. ప్రస్తుత, ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియజేయడం కోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. మానవాళి మనుగడకు అడవులు సోపానాలు. మన జీవావరణ సంపదలు. ఇవి అనేక జీవరాసులకు ఆవాసాలు. పర్యావరణ సమతుల్యానికి పట్టుకొమ్మలు.నదీనదాలకు వర్షాధారాలు. అడవులు మూలికా ఔషధాలకు నిలయాలు. జీవకోటికి ప్రాణ వాయువును అందించడంలోనూ, భూమి కోతను నివారించి భూసారాన్ని పరిరక్షించడంలోనూ ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అందుకే వృక్షో రక్షిత రక్షితః అన్నారు. వృక్షాలను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయి. ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వుంటాయి. మానవుల, పశువుల సంచారానికి, కలప కొరకు చెట్లను నరకడం ఈ అడవులలో నిషేధం. భారత దేశంలో ఈ అడవులు 40.1 మిలియన్ హెక్టార్లు అనగా 53శాతం వరకు విస్తరించి వున్నాయి. ఇవి ప్రభుత్వ పరిరక్షణలో ఉన్నప్పటికీ మానవులు, పశువులు సంచారానికి అనుమతి వుంది. అయితే ఈ అడవులకు ఎటువంటి నష్టాన్ని కలుగ చేయకూడదు. భారత దేశంలో ఈ అడవులు 21.5 మిలియన్ హెక్టార్లు అనగా 29శాతం వరకు విస్తరించివున్నాయి. **కేటాయించని అడవులు:** ఇవి చెట్లు నరకడానికి, మరియు పశువుల సంచారానికి ఎటువంటి నియమ నిర్బంధాలు లేవు. భారత దేశంలో ఈ అడవులు 13.1 మిలియన్ హెక్టార్లు అనగా 18మేరకు విస్తరించి వున్నాయి. అడవులు ప్రపంచంలో 4.057మిలియన్ హెక్టార్ల భూభాగంలో విస్తరించి వున్నాయి. ప్రపంచ అటవీ విస్తీర్ణతలో భారతదేశంలో అటవీ విస్తీర్ణత 1.85 శాతంవుంది. అంటే 2శాతం కూడా లేదు.తలసరి అటవీ విస్తీర్ణత 0.05 హెక్టార్లు మాత్రమే వుంది. 2003 ఇండియన్ సెట్ ఫారెస్టు రిపోర్టుప్రకారం 69.79మిలియన్ హెక్టార్ల అడవులు భారత దేశ భూభాగంలో విస్తరించి వున్నాయి. ఇది దేశ భౌగోళిక విస్తరణలో 21.23 శాతంగా వుంది. ఈ నివేదిక 2013 ప్రకారం అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 34.572 చదరపు



కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. రాష్ట్ర భూభాగంలో 22.64శాతం కలిగి వున్నాయి. దేశ అటవీ విస్తీర్ణత ప్రకారం ఆంధ్ర రాష్ట్రం 9వ స్థానాన్ని కలిగి వుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో 29.242 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉండేవి. రాష్ట్ర భూభాగంలో 25.46 శాతం మేరకు విస్తరించి ఉండేవి. కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఖమ్మం జిల్లాలోని 327 ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం వల్ల రాష్ట్ర అడవుల విస్తీర్ణం 26,903.70 చ.కి.మీ.కు తగ్గింది. ఇది రాష్ట్ర వైశాల్యంలో 23.99 శాతం.దేశ అటవీ విస్తీర్ణతలో 4.22 శాతం వరకు విస్తరించి, తెలంగాణ 12వ స్థానాన్ని కలిగి వుంది. ఈ సర్వేప్రకారం భారత దేశంలో అడవులు ఎక్కువగావున్న రాష్ట్రాలలో మధ్యప్రదేశ్ మెదటి స్థానాన్ని రెండవ స్థానాన్ని అరుణాచల్ ప్రదేశ్ మూడవ స్థానాన్ని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు వరుస స్థానాల్లో వున్నాయి. అత్యధిక అడవులు కలిగిన కేంద్రపాలిత ప్రాంతాల్లో మెదటి స్థానంలో నికోబార్ రెండవ స్థానంలో దాద్రా నగర్ హవేలి వున్నాయి. భారత దేశంలో అత్యధిక శాతం అడవులు కలిగిన రాష్ట్రాలు మిజోరం మెదటి స్థానంలో అరుణాచల్‌ప్రదేశ్ రెండవ స్థానంలో వున్నాయి. దేశంలో అత్యఅల్ప శాతం అడవులు కలిగిన రాష్ట్రాలు వరుసగా హర్యానా మెదటి స్థానంలో పంజాబ్ రెండో స్థానంలో బీహార్ మూడోస్థానంలో వున్నాయి. అత్యల్పశాతం అడవులు కలిగిన కేంద్రపాలిత ప్రాంతాలు వరుసగా పుదుచ్చేరి మెదటి స్థానంలో ఢిల్లీ రెండవ స్థానంలో వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షాడెబ్బై వేల ఎకరాల అడవులు అంతరిస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చెట్లను నరికివేసి వాటి నుంచి వచ్చే కలపను ఇంధనంగా వాడటం,పశువుల పచ్చిక బయళ్లుగా మార్చడం,వంటచెరకు, గృహ నిర్మాణాలు, గృహోపకరణాలకు ఉపయోగించడం, పెరుగుతున్న ప్రపంచ జనాభా అవసరాలను తీర్చడానికి జనావాసాలుగా మార్చడం వంటి చర్యలను అటవీ నిర్మూలనకు కారణాలు.అలాగే అడవుల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలతో విలువైన జాతుల అటవీ సంపదకు నష్టం వాటిల్లుతోంది. భారీ వృక్షాలు, అడవి జంతువులతోపాటు ఆయుర్వేద గుణాలున్న విలువైన మూలికా వృక్షాలు, మొక్కలకు చేటుకలుగుతోంది. సమస్త జీవకోటికి ప్రత్యక్షంగా,పరోక్షంగా అడవులే ఆధారం. అయితే, ప్రస్తుతం అంతరించిపోతున్న అడవులు జీవ వైవిధ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయి. ఒక వైపు అక్రమార్కుల చేతిలో పడి అడవులు చిక్కిపోతుంటే, మరోవైపు మానవ తప్పిదాలు అటవీ సంపదకు చేటు చేస్తున్నాయి. వేసవిలో ఏటా అగ్ని ప్రమాదాలకు వృక్ష సంపద ఆహుతవుతోంది. పెరుగుతున్న జనాభా తమ అవసరాలకు మించి అడవులను నరికివేస్తున్న వైనం. దీంతో ఉష్ణోగ్రతలు పెరిగి జల, వాయు కాలుష్యాలు అధికమై సమస్త జీవరాసుల మనుగడకు ముప్పువాటిల్లే ప్రమాదముంది. అటవీనిర్మూలన జరిగిన ప్రదేశాల్లో భూమికోతకు గురవుతుంది.బంజరు భూమిగా రూపాంతరం చెందుతుంది. వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం భూభాగంలో33శాతం అడవులుండాలి.ప్రస్తుతం24.12 శాతం మాత్రమే ఉన్నాయి. ఇది చాలా విచారించదగ్గ విషయం. అంతరించిపోతున్నవాటిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది. అడవుల రక్షణ బాధ్యత అందరిది. ●

# రెండేళ్లలో రైతు సంక్షేమానికి 1.09 లక్షల కోట్లు



## ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు లేదు

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కేవలం రెండేళ్లలోనే రూ. 1,09,400 కోట్లకు పైగా రైతు సంక్షేమానికి ఖర్చు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తూ, రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడం, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంద న్నారు. రైతు కేంద్రిత పాలన ఎలా ఉండాలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి చూపుతోందని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం పేరుతో నినాదాలు మాత్రమే చేసిన గత పాలనతో పోలిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఫలితాల ఆధారంగా పని చేస్తోందన్నారు. మాటలు కాదు, పనులతో రైతు పక్షపాతి అని నిరూపించిన ప్రభుత్వం కాంగ్రెస్‌దని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని స్పష్టం చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం పథకాలు ప్రకటించి, అమలులో పూర్తిగా విఫలమై రైతులను అప్పుల బారిన పడేలా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా..? అని ప్రశ్నించారు. 2014, 2018లో లక్ష వరకు రుణమాఫీ పేరుతో మోసపూరిత ప్రకటనలు చేసిందని మండిపడ్డారు. ఫలితంగా రైతులపై రైతులపై 2014-18 కాలంలో రూ.2630 కోట్లు, 2018-23 కాలంలో రూ.8515 కోట్ల వడ్డీభారం మోపిన దారుణాన్ని రైతులు మర్చిపోలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పకుండా రూ.2 లక్షల లోపు రుణాలను మొదటి పంట కాలంలోనే, ఒకే దఫాలో మాఫీ చేసి లక్షలాది రైతు కుటుంబాలను రుణవిముక్తం చేసిందని వివరించారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో సమర్పించిన నివేదికతో తేటతెల్లమైందని గుర్తు చేశారు. రైతుబంధు పేరుతో ప్రచారం చేసి, సమయానికి నిధులు విడుదల చేయకుండా రైతులను నిరాశలో ముంచిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రైతు సంక్షేమంపై మాట్లాడటం హాస్యాస్పదమని తుమ్మల అన్నారు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 9 రోజుల్లోనే రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసి, ఇది నిజమైన రైతు ప్రభుత్వం అని చాటి చెప్పిందన్నారు. రైతుబంధు పేరుతో కేంద్ర పథకాలను పూర్తిగా పక్కనపెట్టి, దాదాపు రూ. 3,000 కోట్ల విలువైన ప్రయోజ నాలను రైతులు కోల్పోయేలా చేసిన దారుణానికి బాధ్యత ఎవరిది అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నిం చారు.

వ్యవ సాయ యాం త్రీకరణను నిలిపి వేయడం, పంట భీమాను నిరక్ష్యం చేయడం, నష్ట పరిహారం ఇవ్వకపోవడం, విత్తన సబ్సిడీ నిలిపివేయడం, పంటలు కొనుగోళ్ల బాధ్యత నుండి వైదొలగడం ఇవి అన్నీ రైతులను నష్టాల్లోకి నెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.316 కోట్లు ఖర్చు చేసి ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ రైతులకు భరోసా కల్పిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గోదాముల సామర్థ్యాన్ని మరో 4,53,400 మెట్రిక్ టన్నులకు పెంచేలా 38 గోదాముల నిర్మాణం చేపట్టిందని చెప్పారు.

కొహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి భారీ ప్రాజెక్టులు రైతు భవిష్యత్తుకు పునాది వేస్తాయని తెలిపారు. వ్యవసాయ విద్య, ఉద్యోగాల విషయంలో కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరక్ష్యం చూపిందని ఆయన మండిపడ్డారు. సంవత్సరాల పాటు ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేయకుండా వ్యవస్థను బలహీనపరిచిందని విమర్శించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో విఫలమైన ప్రతిపక్షాలు, ఇప్పుడు రైతుల పేరుతో రాజకీయాలు చేసి పబ్బం గడిపే ప్రయత్నం చేస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు.




## సోమవారానికి శాసనసభ వాయిదా

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభ సోమవారానికి ఉదయం పది గంటలకు వాయిదా పడింది. మంత్రి భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రసంగంను ఉదయం 12:03 నిమిషాలకు శాసన సభలో మొదలు పెట్టారు. గంటా యాభైఐదు నిమిషాలు ఆయన బడ్జెట్ అంశాలను సభ్యులకు వివరించారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం కొన సాగతుండగానే సభ నుంచి బిఆర్ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ.. చెవిలో పూలు పెట్టుకుని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను చించివేశారు. బడ్జెట్ మొత్తం మోసం.. మోసమంటూ బిఆర్ఎస్ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవంటూ బఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

> ఆరు గ్యారెంటీలకు నిధుల కేటాయించలేదని
> బిఆర్ఎస్ వాకౌట్
> చెవిలో పువ్వుతో వినూత్న నిరసనలు

## ప్రజల అభివృద్ధే లక్ష్యం

### సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకంగా బడ్జెట్

### మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** బడ్జెట్‌పై రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధిశాఖ మంత్రి వాకిటి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతూ, సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతు నుంచి విద్యార్థి వరకు, యువత నుంచి మహిళల వరకు ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందించారని కొని యాడారు. ఈ బడ్జెట్ కేవలం సంఖ్యల సమా హారం కాకుండా సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమం కలిసిన ప్రజా బడ్జెట్ అని తెలిపారు.

గతంలో అభివృద్ధి అసమానంగా ఉండటం వల్ల కొన్ని వర్గాలు వెనుకబడిన పరిస్థితి కనిపించిందని, ఆ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈసారి ప్రభుత్వం సమతుల అభివృద్ధి లక్ష్యంగా కేటాయింపులు చేసినట్లు మంత్రి వివరించారు. ఈ బడ్జెట్ తెలంగాణను మరింత శక్తివంతమైన, సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తుందని, ప్రజల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## హోం శాఖకు రూ.11,907 కోట్లు కేటాయింపు

> నక్సలిజం పుట్టుకకు కారణమైన ఫ్యూడలిజం, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కృషి
> అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో 2026-27కు సంబంధించి హోం శాఖకు కేటాయింపులు కొంతమేర పెరిగాయి. గత ఏడాది బడ్జెట్‌లో 10,188 కోట్ల రూపాయల కేటాయింపులు వుండగా ఈ ఏడాది 11,907 కోట్ల రూపాయలకు పెంచారు. మొత్తం మీద ఈ కేటాయింపులు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 1,719 కోట్ల రూపాయల మేరకు పెరిగాయి. హోం శాఖకు కేటాయించిన బడ్జెట్‌లో ఎస్టాబ్లిష్‌మెం ట్ (జీతభత్యాలు, నిర్వహణ) కోసం 10,944 కోట్ల రూపాయలు కాగా పథకాల లమలు అభివృద్ధి పనుల కోసం 963 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ కేటాయింపులపై శుక్రవారం నాడు అసెంబ్లీలో ప్రకటన చేశా రు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సవ్యంగా వుండేందుకు పోలీసు శాఖను పటిష్టం చేయడంతో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్ద పీట వేస్తున్నట్లు, మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు



ఈగల్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. డ్రగ్స్‌కు బానిసగా మారి న వారిని సాధారణ వ్యక్తులుగా మార్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు.

యేడాది కాలంలో ఈ గల్ విభాగం రహస్యంగా డ్రగ్స్ తయారు చేస్తున్న 15 ఫ్యాక్టరీలను ధ్వంసం చేసిందని మంత్రి తెలిపారు. డ్రగ్స్ నివారణకు అంతరాష్ట్ర చెక్ పోస్టు లను పటిష్టం చేశామని, కేసుల దర్యాప్తును పెంచేందుకు ఎఫ్ఎస్ఎల్ విభాగాలను కొత్తగా ఏర్పాటు చేశామని, విద్యా సంస్థల్లో 4729 యాంటి డ్ర గ్స్ కమిటీలను, 20,989 క్లబ్‌లరు ఏర్పాటు చేసి యువతలో చైతన్యం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ర హితంగా మార్చేందుకు ఈగల్ సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. నక్సలిజం రూపు మాపేందుకు కొత్త పంథాను ఎంచుకున్నందున మావోయిజంపై యువత ఆసక్తి తగ్గిందని, ఈ క్రమంలోనే భారీగా లొంగుబాట్లు పెరిగాయని ఆయన తెలిపారు. నక్సలిజం పుట్టుకకు కారణమైన ఫ్యూడలిస్టిక్ సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు సర్కారు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. 2014 నుంచి 2023 వరకు 347 మంది మావోయిస్టులు లొంగిపోతే గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు నాలుగు నెలల కాలంలో 732 మంది లొంగిపోయారని మంత్రి తెలిపారు. జంట నగరాలు, శివారు ప్రాంతాలను కలిపి నాలుగు పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేసి, వాటిని పూర్తిగా పునర్ వ్యవస్థీకరిం చినట్లు ఆయన తెలిపారు. కొత్తగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఏర్పాటు కాగా రాచకొండ కమిషనరేట్‌ను మల్కాజిగిరి కమిషనరేట్‌గా మార్చామని ఆ యన వెల్లడించారు. పోలీసు శాఖలో ఆయా విభాగాలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పోలీసుల పిల్లల కో సం ఏర్పాటు చేస్తున్న పోలీసు గురుకుల పాఠశాలలు యంగ్ ఇండియా స్కూల్స్ కోసం బడ్జెట్‌లో ఐదు వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు మ ంత్రి ప్రకటించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ పాఠశాలలు వుంటాయని ఆయన తెలిపారు.

## మాంసం, పాల ఉత్పత్తిలో తెలంగాణ దూకుడు

### వెల్లడించిన సోషియో ఎకనామిక్ సర్వే

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖలు రెండేళ్లలో అద్భుత పురోగతిని సాధించాయని సోషియో ఎకనామిక్ అవుట్ లుక్ -2026 (సామాజిక ఆర్థిక సర్వే) నివేదిక వెల్లడించింది. 20వ జాతీయ లైవ్‌స్టాక్ సెన్సెస్ -2019 ప్రకారం రాష్ట్రంలో 3.26 కోట్ల పశు సంపద ఉందని తెలిపింది. రాష్ట్రాల ర్యాంకుల వారీగా చూస్తే తెలంగాణ 8వ ర్యాంక్‌లో ఉండగా, గొర్రెల సంఖ్యలో మొదటి స్థానం, పౌల్ట్రీ 3వ ర్యాంక్ ఉందని వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 190.63 లక్షలు, కోళ్ల సంఖ్య 799.99 లక్షలు, గేదేల సంఖ్య 42.26 లక్షలు, మేకల సంఖ్య 49.35 లక్షలు, ఆవులు 42.31 లక్షలు, పందులు 1.78 లక్షలు ఉన్నట్లు నివేదిక వివరించింది.

2024-2025లో రూ.98,512 ఉన్న రాబడి, 2025-2026లో 5.1 శాతం పెరిగి రూ.1,03,525 కోట్ల లక్ష్యాన్ని చేరుకుందని స్పష్టం చేసింది. పాడి రంగంలో అద్భుత ప్రగతి సాధించిందని సామాజిక, ఆర్థిక సర్వే వెల్లడించింది. రాష్ట్రంలో పాల ఉత్పత్తి ఈసారి 4.04 శాతం పెరిగి 2025-2026లో 6,175 వేల టన్నులకు ఉత్పత్తి సాధించిందని తెలిపింది. తెలంగాణలో పౌల్ట్రీ రంగానికి అధిక డిమాండ్ ఉండడంతోపాటు గుడ్ల ఉత్పత్తి కూడా 6 శాతానికి పెరిగిందని సర్వే వెల్లడించింది. మాంస ఉత్పత్తిలో తెలంగాణ 6.72 శాతం రికార్డు వృద్ధిననమోదు చేసిందని అభిప్రాయ పడింది.

## మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### సోమవారానికి సభను వాయిదా వేసిన ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను శాసన మండలిలో పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రవేశ పెట్టారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభం కాగానే .. 2026-27 సంవత్సర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మంత్రికి సూచించారు. దీంతో మధ్యాహ్నం 12.02 గంటలకు బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గంట 50 నిమిషాలపాటు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి మొత్తం వ్యయం రూ.3,24,234 కోట్లు కాగా.. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా బడ్జెట్ ప్రతిపాదన చేశారు.

మన భవిష్యత్తు కలలు కనే యువతకు భవిష్యత్తుపై ఆశ కల్పించడం, ఆసరా కోసం చూసే బలహీనులను ఆదుకోవడం, నీడలేని వారికి నీడకల్పించడం, పంటపొలాలకు నీళ్ల పారించడం, ఫలసాయం పెంచడం, కష్టపడే వారికి పని కల్పించడం.. ఇష్టపడేలా పాలన అందించడం.. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశా దీపమని తెలిపారు.

అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేసి ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యత నిస్తున్నాం. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం.. పీడిత, తాడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇస్తున్న భరోసా...ఒకవైపు ఆర్థికపరమైన ఒడిదుడుకులు ఎన్ని ఎదురైనా, అభివృద్ధి సంక్షేమ కార్యక్ర మాలకు ఏమాత్రం నిధుల కొరత రాకుండా ఈ బడ్జెట్‌ను సమతుల్యంగా రూపొందిం చామన్నారు.

పన్నుల భారంతో సామాన్యుడి పైన భారం మోపకుండా, ఉన్న వనరులను సద్వి నియోగం చేస్తూ, కొత్త సంపదను సృష్టించి దానిని ప్రజలకు పంచడమే మా ప్రజా ప్రభుత్వ ఆర్థిక విధానమని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

# చదువుల అభివృద్ధికి రూ. 26,674 కోట్లు

### ఓయుకు రూ. 1,000 కోట్లు, మహిళా వర్సిటీకి రూ. 400 కోట్లు
### పాఠశాల నుంచి ఇంటర్ వరకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్
### ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
### గత యేడాది కంటే పెరిగిన నిధులు.. బడ్జెట్‌లో 8.23 శాతం కేటాయింపు



**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ప్రభుత్వం శుక్రవారం ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ. 26,674 కోట్లను కేటాయించారు. గత ఏడాది కంటే నిధులను పెంచారు. గత ఏడాది రూ. 23,108 కోట్లను కేటాయించగా.. ఈ ఏడాది అదనంగా రూ. 3566 కోట్లను అదనంగా కేటాయించి రూ. 26,674 కోట్లను కేటాయించారు. గత ఏడాది మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 7.9 శాతం నిధులను కేటాయించగా.. ఈ ఏడాది బడ్జెట్‌లో 8.23 శాతం నిధులను కేటాయించారు. గత ఏడాది పాఠశాల విద్యకు రూ. 15,359 కోట్లను కేటాయించగా ఈ ఏడాది రూ. 16,191 కోట్లను కేటాయించారు. యూనివర్సిటీ విద్యను బలోపేతం చేయాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి రూ. 1000 కోట్లను కేటాయిం చగా.. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి రూ. 400 కోట్లను కేటాయించారు. ఇవి కాకుండా మిగిలిన యూనివర్సి టీలోల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రూ. 50 కోట్లను కేటాయించారు. కళాశాల విద్యకు రూ. 707 కోట్లను కేటాయించగా ఇంటర్మీడియట్ విద్యకు రూ. 1010.53 కోట్లను కేటాయించారు. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలోని 439 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అమలు చేయనున్న బ్రేక్‌ఫాస్ట్ కోసం రూ. 56 కోట్లను కేటాయించగా.. మధ్యాహ్న భోజనం కోసం రూ. 70 కోట్లను కేటాయించారు. సాంకేతిక విద్య రంగానికి రూ. 538.99 కోట్లను కేటాయించారు. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీల తరహాలో రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో కూడా విద్యాప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యా లయం, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాలను అంతర్జాతీయస్థాయి విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ సమాజం ఒక ఉమ్మడి వసుధైక కుటుంబంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులు ఒకచోట చదువుకునేందుకు వీలుగా అధునాతన వసతులతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్పాఠశాలలు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే 79 స్కూళ్ళు మంజూరు చేయగా.. వాటిల్లో 44 చోట్ల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 33 జిల్లాల్లో 1,362 ప్రీ ప్రైమరీ విభాగాలను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. రాబోయే విద్యా సంవత్సరంలో మరో 2,000 నుండి 2,500 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించారు. బాలికల విద్యను ప్రోత్స హించేందుకు 2025-26 విద్యా సంవత్సరంలో 93 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలను (కేజీబీవీ) యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రకటించి, 120 కేజీబీవీలను ఇంటర్మీడియట్ స్థాయికి పెంచారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక రవాణా వ్యవస్థలతో అన్ని వనరులతో కూడిన క్యాంపస్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. వాటిల్లో ప్రీ ప్రైమరీ నుండి 12 వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు విద్య అందించ బడుతుంది. విద్యార్థుల పోషణ, విద్యా ఫలితాలను మెరుగుపరచడానికి వీలుగా రెండు నూతన పథకాలు ఈ బడ్జెట్‌లో ప్రవేశ పెట్టారు.



ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు మిగిలిన మూడు రోజులు రాగి జావ అందించనున్నారు.

## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు నిధుల పెంపు




**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ఈ యేడాది 2026-27 బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత 2025-26 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెరిగింది. ఈ ఏడాడి బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ. 33, 688 కోట్ల కేటాయింపులు జరిగాయి. గత ఏడాది బడ్జెట్‌లో రూ.31605 కోట్లు కేటాయించారు. మొత్తంగా గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ ఏడాది పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.2083 కోట్ల మేర కేటాయింపులు పెరిగాయి. అయితే పెంపు మొత్తం అతి స్వల్పంగా కావడం గమనార్హం. గత 2025-26 మొత్తం బడ్జెట్ రూ.3,04, 965కోట్లు కాగా అందులో 31605 కోట్ల కేటాయింపు శాతం 10.36శాతంగా ఉండగా ఈ ఏడాది 3, 24, 234 కోట్లలో కేటాయింపులు రూ.33, 688 కోట్ల కేటాయింపు 10.39 శాతంగా ఉంది. గత ఏడాది మొత్తం బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు కేటాయింపుల శాతంతో పోలిస్తే ఈ ఏడాది కేటాయింపుల శాతం అతి స్వల్పంగా 0.03శాతం మేర మాత్రమే పెరిగాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు కేటాయించిన రూ.33688 కోట్లలో రూ.5893 కోట్లను ఉద్యోగుల జీతాలు, ఇతరత్రా ఖర్చులు (ఎస్టాబ్లిష్‌మెంట్)కింద ఖర్చు చేయనుండగా రూ. 27, 794 కోట్లను శాఖాపరమైన గ్రామీ ణాభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చు చేయనున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి కోసం రూ. 2062 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. ఇక 5 లక్షల కంటే తక్కువ గ్రాంట్లు పొందే పంచాయ తీలకు ఆర్థికసాయం కింద రూ.10కోట్లు, సర్పంచ్‌ల వేతన చెల్లింపుల కోసం రూ.99కోట్లు, హ్యామ్ రోడ్ల నిర్మాణం కోసం రూ.1372 కోట్లు, గ్రామాల్లో వంతెనల నిర్మాణం కోసం రూ.20కోట్లు, గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ నిధుల కింద మ్యాచింగ్ గ్రాంట్ రూ.721కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు రూ.600 కోట్లు, చేయూత పింఛన్ల చెల్లింపుకు రూ.14, 861 కోట్లు కేటాయించారు. అదేవిధంగా గ్రామీణ రోడ్ల నిర్మాణం కోసం రూ.750 కోట్లు, రోడ్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా రూ.500 కోట్ల కేటాయింపులు జరిగాయి. ఇక హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 2,980 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

> 2,083 కోట్లు అధికంగా మొత్తం రూ. 33,688 కోట్లు కేటాయింపు
> మొత్తం బడ్జెట్‌లో 10.39 శాతం నిధులు
> హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రూ.1372 కోట్లు,
> చేయూత పింఛన్లకు రూ.14, 861 కోట్లు




# భారీ కేటాయింపులతో తాజా బడ్జెట్

**రెవెన్యూ రాబడులు రూ.2,41,263.58 కోట్లు**

**మొత్తం ఆదాయవనరులు రూ.3,24,234 కోట్లు**

**అభివృద్ధి వ్యయం రూ.1,80,934.48 కోట్లు**

**రాష్ట్ర జిఎస్‌డిపిలో ప్రభుత్వ రుణ బకాయి వాటా 29%**

**ద్రవ్యలోటు రూ.58,485.71 కోట్లు**

**ప్రాథమిక లోటు రూ.37,154.32 కోట్లు**

**హైదరాబాద్, మార్చి 20:** కొత్త ఆర్థికసంవత్సరానికి సంబంధించి 2026-27 సంవత్సర బడ్జెట్ మొత్తం మూడు లక్షల 24 వేల 234 కోట్లుగా ఆర్థికమంత్రి డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క శాసనభలో ప్రవేశపెట్టారు. వీటిలో రెవెన్యూ రాబడులు రూ.2,41,263.58 కోట్లుగా ఉంది. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా 33,191.64 కోట్లు వస్తాయని అంచనావేసారు. పన్నురాబడులు ఈసారి గణనీయంగాపెరుగుతాయని అంచనా. రూ.1,48,185.75 కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో అంచనావేసారు.పన్నేతర రాబడులు కూడా 35,730.20 కోట్లవరకూ ఉన్నాయి. ఇవికాకుండా గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద మరో 24,166 కోట్లు రాగలవని అంచనా. ఇక మూలధన రాబడులు 82,870.42 కోట్లుగా పొందుపరిచారు. బహిరంగ మార్కెట్‌నుంచి రుణాలు 73,383.60 కోట్లుగా అంచనావేసారు. కేంద్రప్రభుత్వంనుంచి కూడా ఈసారి రూ.5500 కోట్లు రుణాలుగా సమీకరించాలనినిర్ణయించారు. డిపాజిట్ లావాదేవీలు 1500 కోట్లుగా అంచనావేస్తే ఇతరత్రా రుణాలుకూడా వెయ్యికోట్లవరకూ ఉంటాయనిఅంచనా. ఇక ఇతర రుణాలు అడ్వాన్సుల రూపంలో 1486.82 కోట్లవరకూ సమకూరవచ్చని అంచనా. ఇక అంతర్‌రాష్ట్ర సెటిల్‌మెంట్లురూపంలో గత ఏడాది ఈ ఏడాది ఏమి లేవని నిర్ధారించారు. ఇక ద్రవ్యలోటు 58,458.71 కోట్లుగా ఉంటుందని అంచనా. అలాగేప్రాథమిక లోటు కూడా 37,154.32కోట్లు అని అంచనా వేసారు.

ఆదావయనరుల రూపంలో మొత్తం రాబడులు రూ.3,24,134 కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పొందుపరిచారు. మొత్తం జమలు వేస్‌అండ్‌మీన్స్ అడ్వాన్సులతోకలుపుకుంటే రూ.3,24,234 కోట్లుగా అంచనావేసారు. ఇక రెవెన్యూ వ్యయం పరంగాచూస్తే రూ.2,34,405.82 కోట్లుగా ఉండవచ్చని అంచనా. వీటిలో వడ్డీ చెల్లింపులే 21,304.39 కోట్లు వరకూ ఉంటాయి. మూలధన వ్యయం 47,267.28 కోట్లుగా ఉంది. రుణాలు ఇతర అడ్వాన్సుల రూపంలో 19,536.01 కోట్లుగా ఉంటాయని అంచనా. మూలధన పంపిణీలకింద మొత్తం 22,924.89కోట్లుగా వెల్లడి అయింది. ప్రభుత్వ రుణం చెల్లింపుల పరంగా 19,785.98 కోట్లుగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు 410 కోట్లు అంచనావేస్తే ఇతర రుణాలరూపంలో 2728.91 కోట్లుగా ఉంటుందని తేల్చారు. దీనితో మొత్తంగా వ్యయం 2026-27 సంవత్సరానికిగాను రూ.3,24,134 కోట్లుగా బడ్జెట్ పొందుపరిచారు. రెవెన్యూరాబడులు,మొత్తం వ్యయం మినహాయిస్తే ముగింపు నిల్వ 283.82 కోట్లుగా ఉంటుందని, రెవెన్యూ మిగులు 6587.76 కోట్లుగా ఉంటుందని అంచనావేసారు. పన్నులు ఇతర సుంకాలరూపంలో రూ.1,81,367.39 కోట్లుగా ఉంటాయని కేంద్ర పన్నుల్లో వాటా రాష్ట్ర పన్నులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందనిచూపించారు. భూరెవెన్యూ 11.14 కోట్లుగా ఉంది. ఎస్‌జిఎస్టీతోపాటు అమ్మకాల పన్ను కూడా 90,595.55కోట్లుగా ఉంటుందని, రాష్ట్ర ఎక్సైజ్ రాబడి కూడా 27,668.48 కోట్లుగా ఉంటుందని తేల్చారు. నికరపన్నురాబడి 35,730.20 కోట్లుకాగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ 24,166 కోట్లుగా ఉంది. మొత్తం రాబడులు 2,41,263.58 కోట్లుగా ఉండవచ్చని అంచనా.

ఇక వ్యయం పరంగా అభివృద్ధి వ్యయమే రూ.1,80,394.48 కోట్లుగా ఉంది. రుణసర్వీసు చెల్లింపులు 21,305 కోట్లు పాలనాపరమైన సేవలకు చెల్లింపులు 14,691.70 కోట్లు, పన్ను వసూళ్ల ఛార్జీలు 1004.51కోట్లు, ఇతర వ్యయం 16,470.14 కోట్లుగా ఉంటుందని అంచనా. ఇదిలా ఉంటే 2026-27 ఆర్థికసంవత్సరంలో ప్రభుత్వ రుణ బకాయి రూ.5,62,363కోట్లుగా ఉంటుందని రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 29శాతంగా ఉంటుందని తేలింది. అలాగే వీటిలోప్రభుత్వ గ్యారంటీ ఉన్న రుణాలు 86,309 కోట్లుగా న్నాయి. స్పెషల్‌పర్పస్ వెహికల్(ఎస్పీవీ)కింద ప్రభుత్వ గ్యారంటీ రుణాలు 1,55,434 కోట్లుగా ఉన్నాయి. ప్రభుత్వగ్యారంటీ లేని రుణాలు కార్పొరేషన్‌లు చెల్లించనివి రూ.60,092కోట్లువరకూ ఉనానయి. మొత్తంగా ప్రభుత్వ గ్యారంటీ రుణాలు ఈబడ్జెట్‌లో రూ.3,01,835కోట్లుగా అంచనా వేసారు.





## సమగ్ర సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి దిశానిర్దేశం చేసిన బడ్జెట్: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ఈ యేడాది (2026-27 ఆర్థిక సంవత్సరానికి) ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రజాకర్షక బడ్జెట్‌గా అభివర్ణించారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం శాసనసభలో శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గ్రామీణాభివృద్ధికి వెన్నెముకగా నిలిచే పంచాయతీరాజ్‌శాఖకు అత్యధిక కేటాయింపులు చేయడం ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం అయిందన్నారు. సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, రెండు లక్షల కొత్త పెన్షన్ల మంజూరు నిర్ణయం ఎంతో హర్షణీయమన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, వారి గౌరవప్రద జీవనానికి ప్రభుత్వం ఇస్తున్న హామీగా భావించాలన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు భద్రత కల్పించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని సీతక్క అన్నారు. ప్రమాదవశాత్తు కుటుంబంలో ప్రధాన ఆదారాన్ని కోల్పోయిన సందర్భాల్లో ఆ కుటుంబం ఆర్థికంగా కుదేలుకాకుండా ఉండేందుకు ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషిస్తోందని వివరించారు. ఈ పథకం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు భరోసా, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు.



# వ్యవసాయశాఖకు 23,179 కోట్లు

**గత బడ్జెట్‌తో పోలిస్తే 0.87 శాతం మేర తగ్గిన కేటాయింపులు**

**ఈ యేడాది బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు 7.14 శాతం కేటాయింపులు**

**రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు, సన్న ధాన్యం బోనస్ చెల్లింపునకు రూ.3500 కోట్లు**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ఈ యేడాది బడ్జెట్‌లో వ్యవసాయశాఖకు రాష్ట్ర ప్రభుత్వం రూ.23, 179 కోట్లను కేటాయించింది. అయితే గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే స్వల్పంగా నిధుల కేటాయింపులు తగ్గాయి. గత 2025-26 బడ్జెట్‌లో 8.01శాతం మేర రూ.24, 439 కోట్లు కేటాయించగా ఈ ఏడాది 7.14శాతం మేర రూ.23, 179కోట్ల కేటాయింపులు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.1260కోట్ల మేర నిధుల కేటాయింపులు తగ్గడం గమనార్హం. రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం కోసం రూ.18వేల కోట్లను, సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించేందుకు రూ. 3500 కోట్లను కేటాయించారు. వ్యవసాయ శాఖకు కేటాయించిన మొత్తం రూ.23, 179కోట్లలో ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర శాఖాపరమైన నిర్వహణ ఖర్చులు (ఎస్టాబ్లిష్ మెంట్) పద్దు కింద రూ.1328 కోట్లను, రాష్ట్రంలో వ్యవసాయభివృద్ధి పథకాలు, రైతు సంక్షేమం కోసం రూ.21, 851కోట్లను ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. రైతులకు విత్తన సరఫరా కోసం రూ.109కోట్లు, పప్పు ధాన్యాల ఆత్మనిర్భరత మిషన్ కింద రూ.14కోట్లను ఖర్చు చేయనున్నారు. వ్యవసాయ యాంత్రీకీకరణ కోసం రూ.344కోట్లు, వ్యవసాయ సంక్షేమ పథకాలకు కేంద్రం నుండి రూ.1097కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేశారు.

సన్న ధాన్యానికి బోనస్ కింద ఏటా రెండు సీజన్లు కలిపి ప్రతి ఎకరానికి రైతుకు రూ.25వేల మేర చెల్లిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది.

ఇక పంట బీమా పథకం కోసం ఈ బడ్జెట్‌లో రూ.1886కోట్లను ప్రతిపాదించారు. పిలిపైన్స్ దేశానికి 22, 750 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తెలంగాణ ఎగమతి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయిల్‌ఫామ్ సాగు విస్తీర్ణాన్ని ఈ ఏడాదిలో మరో 68వేల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2లక్షలా90వేల 466 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగవుతున్నట్లు చెప్పారు.

## ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత

# ఇహెచ్‌ఎస్ పథకానికి రూ.1,056 కోట్లు కేటాయింపు

**421 ఎంపానెల్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో 1,998 వ్యాధులకు వర్తింపు**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం క్యాష్‌లెస్ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్)ను ప్రవేశ పెట్టింది. ఈ పథకానికి రూ. 1056 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. కొన్ని దశాబ్దాల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు. పెన్షనర్లు ఎదురు చూస్తున్నటువంటి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

ఈ పథకం ఉద్యోగస్తులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యు లందరికీ వర్తిస్తుందని తెలిపింది. ఇది ప్రభుత్వ ఉద్యోగస్తులకు, పెన్షనర్లకు ఈ ప్రభుత్వం కల్పిస్తున్న భద్రత, భరోసా అని ప్రభుత్వం బడ్జెట్‌లో తెలిపింది.

ఈ నగదు రహిత ఆరోగ్య భద్రత(ఈహెచ్‌ఎస్)పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రయివేట్ ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు ఈ పథకం ద్వారా చికిత్సను అందించనున్నట్టు తెలిపింది. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అంది స్తామని, ఈ పథకం ద్వారా దాదాపు 23.51 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగస్తులు, పెన్ష నర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు లబ్ది పొందుతారని తెలిపింది. ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్ట నున్నట్టు తెలిపింది.

ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమా దవశాత్తు మరణిస్తే రూ. 1.20 కోట్ల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపింది. 60 యేళ్ల వరకు 10 లక్షల రూపాయాల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2కోట్ల రూపాయలు అదనపుకవరేజి లభించే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం 7.57 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తిస్తుందని ప్రకటించింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ ప్రయోజనాలను మంజూరు చేస్తూ, టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు ఇవ్వనున్నట్టు ప్రకటించిందఇ. 60 ఏళ్ల వయసులో స్వచ్ఛందంగా విధుల్లోంచి విరమించుకున్న వారికి కూడా ఈ ప్రయోజనాలు అందుతాయని తెలిపింది.

## వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ. 12,511 కోట్లు

**రాజీవ్ యువ వికాసానికి రూ.6వేల కోట్ల కేటాయింపు**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెనుకబడిన తరగతల(బీసీ) సంక్షేమానికి రూ. 12,511 కోట్లను బడ్జెట్ లో కేటాయించారు. రాష్ట్ర జనాభాలో సుమారు 56 శాతంగా ఉన్న బీసీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో బీసీల కీలక పాత్రను గుర్తించిన ప్రభుత్వం విద్యా, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక సాధికారత, గ్లోబల్ అవకాశాలు, సాంప్రదాయ వృత్తుల రక్షణకు గౌరవం కల్పిస్తూ, భద్రతతో కూడిన జీవనాన్ని అందిస్తుందన్నారు. బడ్జెట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ. 12,511కోట్లు ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, ఆర్థికసాయం చేయడం కోసం రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన యువతకు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. యువతలో ఆర్థిక స్వయంసమృద్ధిని, వ్యవ స్థాపక సామర్థ్యాలను పెంపొందించడానికి సం బంధిత కార్పొరేషన్ల ద్వారా ఈ పథకం అమలు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ పథకం అమలుకు 2026-27లో రూ.6 వేల కోట్లను

# ఆరోగ్య శాఖకు రూ. 13,679 కోట్లు

**గత యేడాది కంటే రూ. 878 కోట్లు అధికం**



**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్యశాఖకు ప్రాధాన్యతను కల్పిస్తూ ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి వైద్య, ఆరోగ్యశాఖకు రూ. 13,679 కోట్లు కేటాయించింది. గతేడాది కంటే రూ. 878 కోట్లు అధికంగా కేటాయింపు చేశారు. తెలంగాణ చరిత్రలో ఆరోగ్యశాఖకు ఇదే అత్యధిక కేటాయింపుగా అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని పేద ప్రజలందరికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ... తెలంగాణ రైజింగ్ విజన్-2047 లక్ష్యాల మేరకు, రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు ఆరోగ్యం, యువత ఆరోగ్యం, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, మానసిక ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి జిల్లా కేంద్రాల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు, నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల క్లినిక్స్, వృద్ధులకు ప్రత్యేక క్లినిక్స్, పాలియేటివ్ కేర్ సెంటర్లు, ట్రా న్స్‌జెండర్‌ల కోసం మైత్రి క్లినిక్స్ ఏర్పాటు చేయబడ్డాయి. ఇంతకాలం గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ సంస్థగా ఉన్న 12,720 బెడ్స్ సామర్థ్యం గల తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివి)ని పూర్తిస్థాయి ప్రభుత్వ సెకండరీ హెల్త్ కేర్ విభాగంగా మార్పు చేస్తు నిర్ణయం తీసుకున్నారు. ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌ని సిద్ధం చేసి, వారికి డిజిటల్ హెల్త్ కార్డులు అందజేయనున్నారు. గత ప్రభుత్వం కేవలం పేపర్ల మీదే మెడికల్, నర్సింగ్ ఇతర కళాశాలలను చూపించిందని ప్రజల్లో ఒక భ్రమను కలిగింపజేసిందని, కానీ తాము వాటిని వాస్తవ రూపంలోకి తీసుకువచ్చి వాటి నిర్మాణ పనులు ప్రారంభించామని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2023 డిసెంబర్ నాటికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో 30,377 పడకలు అందుబాటులో ఉండగా, కొత్తగా ప్రారంభించిన 9 ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా మరో1,980 పడకలు అందుబాటులోకి వచ్చాయి. దీనికి అదనంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 సంవత్సరంలో 4,540 కొత్త బెడ్స్ అందుబాటులోకి వచ్చాయి. 2026 చివరి నాటికి సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, అల్వాల్‌లోని టిమ్స్ ఆసుపత్రులతో పాటు నిమ్స్ విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో కలిపి మరో 6,582 పడకలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇవిగాక, సెకండరీ కేర్ ఆసుపత్రులలో 12,720 పడకలు ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 44,029 పగకలు అదుబాటులో రానున్నాయి. నూతనంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టనున్నారు. కొత్తగా 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారా మెడికల్ కాలేజీలను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం.. చికిత్స ఆధారిత వ్యవస్థ నుంచి నిరోధక వైద్య సేవల వైపు మార్పును తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య శాఖకి రూ. 13,679కోట్లను కేటాయింపులు చేసింది.

# షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి రూ. 11,784 కోట్లు

**షెడ్యూల్డ్ తెగల సంక్షేమానికి రూ. 7,937 కోట్లు**

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 19,721 కోట్లను కేటాయించింది. అంతరాలు లేని సమాజం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని.. అందులో భాగంగానే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సామాజిక న్యాయం చేయాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమా నికి రూ. 11,784కోట్లను, షెడ్యూల్డ్ తెగల సంక్షే మానికి రూ. 7,937కోట్లను కేటాయి స్తున్నట్టు శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని, రూ. 368.27 కోట్ల అంచనా వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్ళ, అంబేద్కర్ భవనాలు, విగ్రహాలు మంజూరు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలును సంపూర్ణంగా అమలు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి సబ్ ప్లాన్ చట్ట ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో ఎస్సీలకు చెందిన రూ.13,617 కోట్లు, ఎస్టీలకు చెందిన రూ. 1,317 కోట్లు మొత్తం రూ. 14,934 కోట్లు ఖర్చు కాకుండా ఉందని మంత్రి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో చేసిన కేటాయింపులతో పాటు, ఈ బకాయిలను కూడా అదనంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ నిధులను క్యారీ ఫార్వర్డ్ చేస్తూ, ఎస్సీలకు రూ. 7,757 కోట్లు, ఎస్టీలకు రూ. 1,754 కోట్లు ఖర్చు చేయవలసి ఉందన్నారు. వాటిని తమ ప్రభుత్వం 2026627 ఆర్థిక సంవత్సరంలో కేటాయించాల్సిన మొత్తానికి అదనంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన బకాయిలను కూడా కేటాయిస్తున్నా మన్నారు. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మించ నున్నట్టు తెలిపారు. కాచిగూడలోని నింబోలి అడ్డలో బాబూ జగ్జీవన్ రామ్ పేరుతో నూతన వసతి గృహాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. గిరిజనాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ములుగు జిల్లాలో సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీస్థాపన, వివిధ గిరిజనవర్గాల అభివృద్ధి కోసం మూడు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గిరిజనగ్రామాల్లో ఆదివాసి సేవా కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గిరిజనులు సేకరించే అటవీ ఉత్ప త్తులకు న్యాయమైన ధరల ను కల్పించడం ద్వారా తెలంగాణ గిరిజన సహ కార సంస్థ వారి జీవనోపాధి అవకాశాలను మెరుగు పరిచాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు.

# రవాణా, రోడ్డు, భవనాల శాఖకు రూ. 12,789 కోట్లు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో రవాణా, రోడ్లు, భవనాల శాఖకు రూ. 12,789 కోట్లను కేటాయించారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ పరిధిలో 1.82 కోట్ల నమోదిత వాహనాలు ఉన్నాయి. వ్యవసాయ, త్రిచక్ర వాహనాలకు చెందిన 11.75 లక్షల వాహనాలకు,

రూ. 105.16 కోట్ల పన్ను మినహాయింపులు మంజూరు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఎలక్ట్రిక్ వాహన విధానం కింద 1,06,000 ఎలక్ట్రిక్ వాహనాలకు(ఈవి) రూ. 856.98 కోట్ల పన్ను మినహాయింపులు ఇచ్చి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వానికి రాబడి తగ్గినప్పటికీ, పర్యావరణ పరిరక్షణ విషయంలో వెనుకడుగు వేయడంలేదని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతా చర్యలను మరింత కఠినతరం చేసినట్టు బడ్జెట్‌లో తెలిపింది. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్‌ను అభివృద్ధి చేసిన డిజిటల్ సేవలు సారథి, వాహన్‌లను తెలంగాణలో అమలు చేస్తున్నట్టు రాష్ట్ర సర్కార్ బడ్జెట్ సందర్భంగా తెలిపింది. వాహన్ సేవలను వచ్చే ఆరు నెలల్లో పూర్తిగా అందుబాటులోకి తీసుకు రానున్నట్టు స్పష్టం చేసింది.

## 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపుసెట్లు

### గిరిజన రైతుల కోసం ఇందిరా సౌరగిరి జల వికాస పథకం

### బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త :** తెలంగాణలో గిరిజన రైతుల జీవనాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో ఇందిర సౌర గిరి జల వికాసం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజన కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం ప్రధాన ధ్యేయంగా ఈ పథాకానికి రూ.600 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. మారుమూల అటవీ ప్రాంతాల్లోని గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం అందించడమే లక్ష్యంగా ఈ పథకానికి నిధులు కేటాయించారు. ఈ పథకం ద్వారా సుమారు 2.10 లక్షల మంది గిరిజన రైతులు లబ్ధి పొందనున్నారు. 6 లక్షల ఎకరాల పోడు భూముల్లో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల అభివృద్ధిని ప్రభుత్వం ప్రోత్సహించనుంది. 100 శాతం సబ్సిడీతో సౌర పంపుసెట్లను రైతులకు అందజేయనుంది. విద్యుత్ సౌకర్యం లేని అటవీ ప్రాంతాల్లో సౌరశక్తి ద్వారా సాగునీటిని అందించి రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే అచ్చంపేట నియోజక వర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పథకాన్ని ప్రారంభించి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపింది.

# మూడులక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

### 2047 నాటికి లక్ష్యసాధన దిశగా అడుగులు




**హైదరాబాద్, మార్చి 20:** ఉత్పత్తి ఆధారిత వృద్ధితె తెలంగాణ రాష్ట్రం మరింత ముందుకు పరుగులు పెడుతోందని క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ నమూనా అభివృద్ధికి మరింత ఊతం ఇస్తున్నట్లు ప్రభుత్వం అంచనావేసింది. 2047 నాటికి రాష్ట్ర జిడిపి మూడులక్షలకోట్ల డాలర్ల వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతోకృషి జరుగుతున్నట్లు అంచనావేసింది. వచ్చే రెండుదశాబ్దాల్లోనే రెండంకెల వృద్ధిని నమోదుచేస్తుందని విశ్లేషించింది. శాసనసభలోప్రవేశపెట్టిన ఆర్థికసర్వేలో రాష్ట్ర అభివృద్ధిమూలాలను విశ్లేషించింది. 2025-30 సంవత్సరం వరకూ సగటు జిడిపి వృద్ధి 8శాతం, 2031-39 వరకూ ఏడుశాతం, 2041-47 నాటికి 5.2శాతం వృద్ధి ఉండవచ్చని అంచనావేసింది. అంతర్జాతీయ స్థాయిలోపోటీపడే రాష్ట్రంగా తెలగాణ భాసిల్లుతుందని అంచనావేసింది. సమ్మిళిత అభివృద్ధి, సుస్థిర అభివృద్ధి నినాదాలతోమరింత ముందుకు పోతున్నట్లు రాష్ట్రం ప్రస్తావించింది. ఒర్ఒర్‌జోన్‌ను మొత్తం, నెట్‌జీరో, కేవలం సర్వీస్ సెక్టార్ మెట్రోపోలిస్‌గా అభివృద్ధిసాగుతున్నదని అంచనావేసింది. 2025-26 లో రాష్ట్ర జిఎస్‌డిపి ప్రస్తుత ధరలప్రకారం రూ.17.82 లక్షలకోట్లుగా అంచనావేసారు. 10.7శాతం వృద్ధినమోదయింది. జాతీయ సగటు 8శాతం కంటే ఎక్కువగా ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం కూడా జాతీయ తలరి ఆదాయం కంటే ఎక్కువగానే ఉంది. తెలంగాణ తలసరి ఆదాయం 4,18,931గా ఉంటే జాతీయస్థాయిలో కేవలం 2,19,575గా ఉంది. ప్రైమరీ సెక్టార్ స్థూల విలువలు రూ.2,49,691గా అంచనావేసారు. ఇపుడు తెలంగాణలో సెకండరీ సెక్టార్ కూడా విస్తృతం అవుతోందని, రాష్ట్ర జిడిపికి రూ.11,30,596 కోట్లు అందిస్తున్నట్లు అంచనా. వృద్ధిరేటు 13.5శాతంగా ఉంది. రాష్ట్రం ఎక్కువగా సేవల రంగ ఆధారిత ఆర్థికవ్యవస్థగా శరవేగంగా వృద్ధిలోకి వస్తోందని రాష్ట్ర అర్థగణాంకశాఖ అంచనావేసింది. తెలంగాణలోప్రస్తుతం ఉపాధివృదిధరేటు గ్రామీణపట్టణప్రాంతాల్లోకలిపి 41.5శాతం వ్యవసాయ రంగంలో ఉంద,ఇ 22.2శాతం పరిశ్రమల రంగంలోను, 36.3శాతం సేవలరంగంలోను ఉందని తేల్చింది. రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువగా రెవెన్యూ కేటాయింపులేనని తేలింది. మొత్తం ప్రభుత్వ వ్యయంలో 78.9శాతం రెవెన్యూ వ్యయమే ఉంది. వ్యవసాయరంగపరంగా 62.6శాతం మందిజనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఆధారపడి ఉన్నారు. ప్రభుత్వ వ్యవసాయ రంగానికి 26,684 కోట్లు కేటాయించినట్లు తేలింది. ఈరంగంనుంచే రాష్ట్ర జిఎస్‌డిపికి 2,13,799 కోట్లు వాటాగా వెళుతున్నట్లు తేలింది. రైతుభరోసా వంటి పథకాలతో ప్రభుత్వం రైతన్నకు ఆపన్న హస్తం అందిస్తోంది. ఇకపారిశ్రామిక రంగపరంగాచూస్తే తెలంగాణ ఆర్థిక చోదకశక్తిగా ఉంది. జిఎస్డీపీకి రూ. 3,04,217 కోట్లు అందిస్తోంది. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో 88,534 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, సులభశైలి వాణిజ్యంలో తెలంగాణ టాప్ అచీవర్‌గా నిలిచిందని అంచనావేసారు. సేవలరంగపరంగా తెలంగాణ 13.5శాతం వృదిధరేటుతో ఉంది. మొత్తం స్థూల విలువలజోడింపునకు 23.4శాతంగా ఉంది. సేవలరంగంలో మొత్తం ఉపాధిలో 36.3శాతం, అర్బన్ ఉపాధికల్పనలో 64.9శాతం వాటాతో ఉంది. ఐటి, ఐటి ఆధారితసేవలరంగపరంగా ఎగుమతులు రూ.3.13 లక్షలకోట్లు జరిగాయని, 9.39 లక్షలమందికి ఉపాధి లభించిందని అంచనా. హైదరాబాద్‌లోనే జాతీయ స్థాయితోపోలిస్తే గ్లోబల్ కేపబిలిటి సెంటర్లలో 20శాతం వాటాతో ఉన్నాయని వెల్లడి అయింది. ఇక మౌలికవనరులరంగపరంగా చూస్తే ఈ ఏడాది 23,187 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యంతో ఉంది. శిలాజ ఆధారిత ఇంధనాలు 44.55శాతంగా ఉంది. పునరుత్పత్తి విద్యుత్‌పరంగా హైడ్రో, పవన, థర్మల్ రంగంలో మంచి వృద్ధినిసాధించామని, రాష్ట్రంలో మొత్తం 1.98 కోట్ల విద్యుత్‌కనెక్షన్లు సక్షేమపరిధిలోనే కేటాయించినట్ల తేల్చింది. 10.97 కోట్ల జీరో బిల్లులు జారీచేసి 3901 కోట్ల సబ్సిడీని అందిస్తున్నట్లు ప్రస్తావించింది. 74.51 లక్షల హెక్టార్లకు విద్యుత్‌సాయంతో సాగునీటి సౌకర్యం అందించినట్లు సర్వేలో పొందు పరిచింది. వైద్యరంగంలో అత్యున్నత సేవల కోసం తెలంగాణ సూపర్‌హాస్పిటల్ కార్పొరేషన్ స్థాపించి రూ.9339 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, వీటితో వెయ్యిపడకల మూడు సూపర్‌స్పెషాలిటీ ఆసుత్రులు వనిర్మాణంజరుగుతుందని వివరించింది. ఇక గర్భస్త శిశు మరణాలు గణనీయంగా తగ్గాయ,ఇ ప్రతి లక్షలమంది జననాల్లో కేవలం 43 మంది మాత్రమే మృతిచెందుతున్నట్లు తేలింది. అదే జాతీయ సగటు 88గా ఉందని గుర్తుచేసింది. ఇక పసికందుల మరణాలపరంగా చూస్తే 18గా ఉంది. అక అభయహస్తం ఆరుగ్యారంటీలతో సంక్షేమంలో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణనిలిచిందని ప్రస్తావించింది. ఆర్థికభద్రత, సామాజిక భద్రతకు ప్రభుత్వం పెద్దపీటవేసింది. మహిళాసాధికారతకు ఎక్కువ కృషిజరుగుతోంది, మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. 269.68 కోట్లమంది ప్రయాణం చేసినట్లు తేలింది. అలాగే 42.90 కుటుంబాలకు సబ్సిడీతోకూడిన సిలిండర్లను పంపిణీచేస్తుంటే 200 యూనిట్లవరకూ ఉచిత విద్యుత్‌కూడా అందిస్తున్నారు. చేయూత పింఛన్లు 42.23 లక్షలమంది లబ్దిచేకూరుతోందని, ఇందిరమ్మ ఇళ్లపథకం కింద ఇప్పటికే 3,24,536 ఇళ్లు కేటాయించామని ఆర్థికసర్వేలో పొందుపరిచారు.




## బడ్జెట్‌లో బడుగులకు పెద్దపీట

### అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రజాసంక్షేమ బడ్జెట్

### రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** శుక్రవారం ప్రవేశ పెట్టిన 2026-27 బడ్జెట్‌లో బడుగులకు పెద్ద పీట వేస్తూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినాయకత్వంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా రంజక బడ్జెట్ అన్నారు. బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించారని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కు 2025-26 బడ్జెట్ కంటే అదనంగా దాదాపు వెయ్యి కోట్లు ప్రతిపాదించి ఈసారి బడ్జెట్ లో రూ. 12511 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం రాగానే 48 గంటల్లో ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని, మహిళలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం బడ్జెట్ నిధులు కేటాయించిందన్నారు.

## వేసవిలో తాగునీటి కొరత రావొద్దు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త :** వేసవి కాలంలో ఈ ఏడాది కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. పైపులైన్ మరమ్మతులు లేదా ఇతర పనులు చేయాల్సి వస్తే, గ్రామస్తులకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాని గ్రామాలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గూడాల్లో తాగునీటి కోసం బావులు తవ్వాలని ప్రజల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయని, ఆ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, తక్షణమే బోర్లు, బావులు తవ్వాలని ఆదేశించారు.

## కాంగ్రెస్ బడ్జెట్ 2026-27 అంకెల గారడీ

### ఒక ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్!.. బిజెపి రాష్ట్ర చీఫ్ ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఆర్థిక మంత్రి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్‌నే చదివారేమో అన్న అనుమానం కలుగుతుందని, ఎందుకంటే పోయినసారి బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా, ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పుకోవడానికి ఒక్క రిజల్ట్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యా రంగానికి ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి గత యేడాది కంటే రూ. 1000 కోట్లు పెంచినట్లు చూపిస్తున్నా, ఓవరాల్ బడ్జెట్‌లో దీని వాటా కేవలం 8 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (13శాతం), బీహార్ (21శాతం ) తమ బడ్జెట్‌లో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతలో సగం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు అని గొప్పలు చెప్పడం తప్ప, విద్యా వ్యవస్థను మెరుగుపరిచే ఒక్క ప్రయత్నం కూడా కనిపించడం లేదన్నారు.ఆరోగ్య రంగం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగున ఉందని నిలదీశారు. ఆరోగ్యశ్రీ బకాయిలే ఇంకా చెల్లించలేని రేవంత్ ప్రభుత్వం, పెన్షన్లు, ఇతర బెనిఫిట్లను కూడా ఆరోగ్యశ్రీ డిపార్ట్‌మెంట్‌కే అప్పగించడం అంటే ఆ సంస్థను కూడా దివాళా తీయించడమేనని హెచ్చరించారు. అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో చెప్పకుండా ఫ్యూచర్ సిటీ అని ఫ్యాన్సీ పేర్లతో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకుంటున్న ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అన్నీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా పథకాల వల్ల వచ్చినవేనని స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్, దాని పక్కన వచ్చే రీజనల్ రింగ్ రైల్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఫండింగ్ అని, కేవలం భూసేకరణ తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఎండగట్టారు.




## భారత్‌లో ఎస్ఇడి న్యూరోసైన్స్ ఆధారిత లెర్నింగ్ ప్లాట్‌ఫాం ప్రారంభం

### శ్రీచైతన్యతో వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి20:** అమెరికాకు చెందిన స్టూడెంట్ ఎడ్యుకేషన్ దయాగ్నస్టిక్స్(ఎస్ఈడి) తన నేచురల్ ఇంటెలిజెన్స్,న్యూరోసైన్స్ ఆధారిత లెర్నింగ్ దయాగ్నస్టిక్ ప్లాట్ ఫాంను భారత దేశంలో అధికారికంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా మార్చి 20న హైదరాబాద్‌లోని హోటల్ దస్పల్లాలో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందు మార్చి 17న న్యూఢిల్లీలో విజయవంతంగా మొదటి లాంచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈడీ,శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ భాగస్వామ్యానికి గుర్తుగా రెండు సంస్థల మధ్య కుదిరిన మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్(ఎంఒయు) ఫ్రేమ్ కాపీని ఎస్ఈడీ ప్రతినిదులు శ్రీచైతన్య ప్రతినిధులకు వేదికపై అందజేశారు. మీడియా సమక్షంలో జరిగిన ఈ ఎంఒయు ప్రదర్శన ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా నిలిచింది. ఎస్ఈడీ ప్లాట్‌ఫాం సంప్రదాయ మూల్యాంకనం విధానాలకు భిన్నంగా,విద్యార్థులు ఎలా నేర్చుకుంటారు అనే అంశంపై దృష్టి పెడుతుంది. నేచురల్ ఇంటెలిజెన్స్,న్యూరోసైన్స్ సిద్ధాంతాల ఆధారంగా, ఇది విద్యార్థుల మానసిక నమూనాలను విశ్లేషించి,వారి బలాలు,లెర్నింగ్ గ్యాప్స్‌ను గుర్తించి వ్యక్తిగత అభివృది మార్గాలనను రూపొందిస్తుంది. ఈ ప్లాట్ ఫాం న్యూరోసైన్స్ బెస్ట్ అసెస్‌మెంట్స్ ద్వారా విద్యార్థులు సమాచారాన్ని ఎలా గ్రహిస్తారు. ఎలా ఉపయోగిస్తారు అన్న దానిని విశ్లేషి స్తుంది. తద్వారా వ్యక్తిగత అకడమిక్ రోడ్ మ్యాప్‌లను రూపొందించి ప్రారంభ దశలోనే లెర్నింగ్ లోపా లను గుర్తించి విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. శ్రీచైతన్య ఎడ్యు కేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన మాట్లాడుతూ ఎస్ఈడీతో భాగస్వామ్యం కావడం మాకు ఆనందంగా ఉంది, నేచురల్ ఇంటెలిజెన్స్,న్యూరోసైన్స్ ఆధారంగా విద్యార్థులు లెర్నింగ్ ప్యాటర్న్స్‌ను అర్థం చేసుకోవడం ద్వారా విద్యా వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. ఎస్ఈడి వ్యవస్థాపకులు శ్రీనేష్ వి, ఎస్ఈడీ సీఈవో ఆష్లీ సంబాలుక్ మాట్లాడారు.

## ఎస్ఎల్‌బిసి ఇన్‌లెట్ తవ్వకపు పనులు పునఃప్రారంభం

### వేగంగా కొనసాగుతున్న సొరంగం తవ్వకపు పనులు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి సొరంగం ఇన్‌లెట్ తవ్వకాల పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే దేవరకొండ నుండి ఔట్‌లెట్ పనులు ప్రారంభం అయిన నేపథ్యంలో ఇప్పుడు ఇన్లెట్ పనులు కుడా ప్రారంభించామన్నారు. దీంతో సొరంగం తవ్వకాల పనులు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు.

ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఎస్ఎల్‌బిసితోపాటు డిండి ఎత్తిపోతల పథకం, అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ పురోగతిపై ఆయన ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సొరంగం రెండు వైపులా తవ్వకాలు ప్రారంభం అయినందున ఇకపై నిరంతరాయంగా పనులు కొనసాగుతాయని తెలిపారు.ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగ నిలువనున్న ఈ ప్రాజెక్ట్ తవ్వకాల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.తవ్వకాల సమయంలో సొరంగ మార్గం చివరికంటూ గాలి వెలుతురు ప్రసారమయ్యేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## సంక్షేమ రంగాలకు కోతపెట్టిన రాష్ట్ర బడ్జెట్

### పేద, దళిత, రైతులకు తీవ్ర నష్టం : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు కోతపెట్టి,పేద, దళిత, రైతులకు తీవ్ర నష్టం చేశారని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. రూ. 3,24,233 కోట్లతో రాష్ట్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారని, గత బడ్జెట్‌తో పోలిస్తే.. దాదాపు రు.26 వేల కోట్లు ఖర్చు పెట్టలేదన్నారు. ఈ బడ్జెట్ కూడా అదే రకంగా ఉండొచ్చన్నారు. గృహనిర్మాణం, నీటిపారుదల, విద్యుత్ తదితర ముఖ్యమైన రంగాలకు గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో నిధులు కోతపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నరు.

## పాత పెన్షన్ అమలు ప్రస్తావన లేకపోవడం విచారకరం

### టిఎస్‌సిపిఎస్ఇయు రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పాత పెన్షన్ అమలు ప్రస్తావన లేక పోవడం విచారకరమని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. సీపీఎస్ ఉద్యోగులకు వృద్ధాప్య అభద్రత వద్దని,పదవీ విరమణ తర్వాత సామాజిక భద్రత అనేది సీపీఎస్ ఉద్యోగుల హక్కు అని, అది ఎవరో ఇచ్చే భిక్ష కాదన్నారు. పాత పెన్షన్ (ఓపీఎస్)ను సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ స్పష్టం చేశారు.

## విద్యాశాఖ బడ్జెట్‌పై ఉపాధ్యాయ సంఘాల పెదవి విరుపు

**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులపై ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా.. కేవలం 8.23 శాతం నిధులనే కేటాయించాయని మండిపడుతున్నాయి. జనాకర్షక పథకాలకే తప్ప ప్రస్తుత వ్యవస్థను బాగుచేసే విధంగా విద్యారంగానికి కేటాయింపులు లేవని టిఎస్ యుటిఎఫ్ అభిప్రాయపడింది. 2026- 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య, మానవ వనరులకు కేటాయించింది 26,674 కోట్లు మాత్రమే. ఇది మొత్తం బడ్జెట్లో 8.2 శాతమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు.

# నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావనే లేదు

### బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:** నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బడ్జెట్‌లో ఎలాంటి అంశం లేదని శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రైతు భరోసాను ఇచ్చిన మాట ప్రకారం ఈ సారైనా ఎకరానికి రూ.15 వేలకు పెంచుతారని ఆశించామని, కానీ ఊసే తీయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి ఆ రూ.12 వేల చొప్పున కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పలేదని ధ్వజమెత్తారు. రైతులకు ఏడాదికి రూ.12 వేల అంశం కూడా ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఇక మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డితోసహా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**బిసిల బడ్జెట్ కోసం ఎదురుచూశాం : మాజీ మంత్రి గంగుల**

కాంగ్రెస్ ప్రభుత్వం స్కీములను మరిపించి స్కాములకు తెరలేపారని బిఆర్ఎస్ మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బీసీలకు ఇస్తామన్న 20 వేల కోట్ల బడ్జెట్ కోసం ఎదురు చూశాం. రెండు ఏళ్ళు మోసం చేసి, మరో సారి బీసీల గొంతు కోశారు. తులం బంగారం అమలు చేయకుండా సమ్మక్క సారక్క ఇచ్చే బెల్లమే బంగారం అంటున్నారు.కేసిఆర్ 6.52 లక్షల రేషన్ కార్డులు ఇస్తే, అసలు ఇవ్వలేదనే అబద్ధపు ప్రచారం చేస్తున్నారు.

**విభజించిన కార్పొరేషన్లకు బడ్జెట్ లేదు : బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్**

హైదరాబాద్ ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్ విమర్శించారు. జిహెచ్ఎంసిని మూడు భాగాలు చేసి దోచుకోవడానికి చూస్తున్నారున్నారు. అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'ఈ స్పష్టత లేని బడ్జెట్. విభజించిన కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయింపు లేదు.పెద్దఎత్తున వసూళ్లు చేస్తూ ఢిల్లీకి మూటలు పంపుతున్నారు.' అని వివేకానంద విమర్శించారు.

**హాట్రిక్ చీటింగ్ బడ్జెట్ : బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్ యాట్రిక్ ఛీటింగ్ బడ్జెట్ అని బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "ఈఆర్థిక విధ్వంసానికి బాటలు వేసిన బడ్జెట్. హామీల ఎగవేతల బడ్జెట్. అప్పుల కుప్పగా ఉన్న బడ్జెట్. మాయ పాకిర్ల బడ్జెట్. ఊహా జనిత బడ్జెట్. హామీల అమలు ప్రస్తావన లేదు.వాస్తవికతకు దూరంగా ఉన్న బడ్జెట్. అప్పుల మీదనే ప్రభుత్వం ఆధారపడ్డట్లు ఈ బడ్జెట్ తో ఉంటున్నది. ముస్లింలతో పోలిస్తే బీసీలకు అన్యాయం, నిరుద్యోగులను, మహిళలను మోసం చేసం చేశారు.

**బిసి సబ్‌ప్లాన్ ఊసే లేదు: బిజెపి ఎమ్మెల్యే పాయల్‌శంకర్**


రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సబ్ ప్లాన్ ఊసే లేదదని బిజపి పాయల్‌శంకర్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'ప్రభుత్వం నుండి బీసీలకు సహకారం అందడం లేదు. బడ్జెట్లో బీసీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ప్రభుత్వం పెన్షనర్లు జమ చేసుకున్న డబ్బులు ఇవ్వదు కానీ, విమాన ప్రమాదంలో మరణిస్తే వారికి రెండు కోట్లు ఇస్తారా..పంటల భీమా అమలు చేయడం లేదు.స్కాలర్‌షిప్ రాక విద్యార్థులు హోటళ్లలో పని చేసుకుంటున్నారు.ఇది మోసపూరిత బడ్జెట్. బడ్జెట్ సవరణ చేయాలి. రైతు భరోసా గురించి ప్రస్తావన లేదు. లోపాలు బడ్జెట్ సమావే శాల్లో ఎత్తి చూపుతాం'అని ఆయన పేర్కొన్నారు.

**అన్ని వర్గాలకు న్యాయం చేసే బడ్జెట్ : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాలకు న్యాయం చేసే విధంగా ఉందని ప్రభుత్వ పథకాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'ఈ బడ్జెట్ వరి వేస్తే ఉరి అన్న వారి సన్నవడ్లకు కూడా బోనస్ ఇచ్చే బడ్జెట్. ఇంటర్మీడియట్ పేద విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చూస్తుంటే ఓర్వలేకపోతున్నారు. మిగిపోయిన ప్రాజెక్టులకు, రైతాంగానికి పెద్దపీట వేశామని' ఐలయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ చూసి ప్రతిపక్షాల ముఖం రంగులు మారాయని ప్రభుత్వ విప్‌యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి వారి కళ్లకు కట్టినట్లుగా కనపడ్డది ఈబడ్జెట్ తో..బి.ఆర్.ఎస్ నేతలు మానసికస్థితి కోల్పోయి అసెంబ్లీలో ప్రవర్తించారని' అన్నారు.

**జనరంజక బడ్జెట్ : విప్ ఆదిశ్రీనివాస్**

బడ్జెట్ జనరంజకంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "ఈరాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పడే బడ్జెట్. ప్రతిపక్షాలు నీళ్లు నమిలేలా ఉన్న బడ్జెట్. పదేళ్ల అధికారంలో ఉండి పేద ప్రజలకోసం ఆలోచించలేకపోయాం అని ప్రతిపక్షం అనుకునే బడ్జెట్. దేశంలో ఇండ్ల నిర్మాణానికి ఏ రాష్ట్రం కూడా ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం లేదు. అలాంటిది అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం.ఇందిరమ్మ జీవిత భీమా పథకం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రతిపాదిస్తే అలాగే ఉద్యోగస్తులకు ప్రమాద బీమా పథకం, నగదు రహిత వైద్యం అందిస్తే ఇష్టం లేక బడ్జెట్ ప్రతులు చించివేశారు. విద్యా శాఖకు ప్రాధాన్యం ఇచ్చిన బడ్జెట్. ఫోర్త్ సిటీ, మూసి నది ప్రక్షాళన అంశం ప్రస్తావన రాగానే వాకౌట్ చేశారు. ఎందుకు వాకౌట్ చేశారో తెలంగాణ ప్రజలకు సంధానం చెప్పాలి."అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

**విద్య,వైద్యానికి పెద్దపీట : విప్ రాంచందర్ నాయక్**

రాష్ట్ర బడ్జెట్ విద్య, వైద్య, ఇరిగేషన్ అన్ని రంగాలకు ప్రాధాన్యం

### అసెంబ్లీ మీడియా పాయింట్

ఇచ్చిన బడ్జెట్ అని ప్రభుత్వం విప్ రాంచందర్ నాయక్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'ఉద్యోగస్తులకు ప్రమాద బీమా పథకం పెడితే జీర్ణించుకోలేక పోతున్నారు. వీధిలో కోతుల్లా బి.ఆర్.ఎస్ నేతలు అసెంబ్లీలో వ్యవహరించారు. పదేళ్ల అన్ని వర్గాలను మోసం చేసి ఇప్పుడు అసెంబ్లీలో వింత చేష్టలు చేస్తున్నారని' అని రాంచందర్ నాయక్ పేర్కొన్నారు.



**కాంగ్రెస్‌లో కష్టపడే వారికి ప్రాధాన్యత ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్**

కాంగ్రెస్‌లో కష్టపడే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎంఎల్‌సిలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ అన్నారు. విప్‌లుగా నియమితులైన సందర్భంగా సిఎంను కలిసిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ "మండలిలో మాలాంటి సిన్సియర్ కార్యకర్తలకు స్థానం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నాం.పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీ ఎంత ప్రాధాన్యం ఇస్తుందో మాకు ఇచ్చిన స్థానం బట్టి మరోసారి అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తుంది. కష్టపడి పని చేసే వారికి పార్టీలో ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుంది అని మరోసారి స్పష్టం అయ్యింది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తాము "అని అని పేర్కొన్నారు.

**తీపి, చేదు కలగలిపిన రాష్ట్ర బడ్జెట్:**

**సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఉగాది పచ్చడిలా మిశ్రమంగా ఉందని సిపిఐ శాసనసభా పక్షం నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ ఆయన స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రం మొత్తంగా రూ. 8.64 కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అన్నారు. దీంతో పాటు మరో రూ ఒక లక్ష కోట్ల రూపాయల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆ లెక్కలు ఈ బడ్జెట్ చూపించలేదని పేర్కొన్నారు.



ఇంత డబ్బు ఎలా తీసుకువస్తారనేది పెద్ద ప్రశ్న ఈ దశలో బడ్జెట్ ప్రవేశపెట్టడం అంటే కత్తి మీద సాము లాంటిదని, ఎవరూ కూడా చేయగలిగిందేమీ లేదన్నారు. ఉన్న దాంట్లో కొంచెం కష్టమైన, క్లిష్టమైన స్థితిలో ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చేదు, తీపిల మిశ్రమంగా భావిస్తున్నామని చెప్పారు.

# కివీస్ జట్ల జోరు

## సౌతాఫ్రికాపై అబ్బాయిల దారిలో అమ్మాయిలు





**అక్లాండ్:** సౌతాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 137 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్ జట్టు 16.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు డెవాన్ కాన్వే(26 బంతుల్లో 39), టామ్ లాథమ్ (55 బంతుల్లో 63 నాటౌట్) మొదటి వికెట్ కు 96 పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఇద్దరూ సౌతాఫ్రికా బౌలర్లపై సిక్స్‌లు, బౌండరీలతో విరుచుకుపడుతే వేగంగా స్కోరు పెంచారు. ఓవర్‌కు 9పరుగుల సగటు సాధించారు. 11 ఓవర్లలోనే 96 పరుగులకు చేర్చారు. శతకం భాగస్వామ్యం వైపు దూసుకెళ్తున్న ఈ జోడీని కేశవ్ మహారాజ్ విడదీశాడు. ఆ ఓవర్ చివరి బంతికి డెవాన్ కాన్వేను స్పిన్నర్ కేశవ్ మహారాజ్ అవుట్ చేశాడు. అయినా ఓపెనర్ టామ్ లాథమ్ జోరు అలాగే కొనసాగింది. 45 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. టిమ్ రాబిన్సన్(17), నిక్ కెల్లీ(1) అండగా న్యూజిలాండ్‌కు మరో 22 బంతులుండగానే ఘన విజయాన్ని అందించాడు.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. ప్రొటీస్ బ్యాటర్లలో టెయిలెండర్ కొబాని మొకినా (26 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలవగా, జార్జ్ లిండే (23) పర్వాలేదనిపించాడు. సౌతాఫ్రికా టాపార్డర్, మిడిలార్డర్‌ను కివీస్ బౌలర్లు కుప్పకూల్చారు. దీంతో సఫారీలు స్వల్ప స్కోరుకే పరిమితమయ్యారు. కివీస్ బౌలర్లలో కైల్ జేమీ సన్, మిచెల్ సాంట్నర్, బెన్ సియర్స్ తలా 2 వికెట్లు పడగొట్టారు. పొదుపుగా బౌలింగ్ చేసిన లోకీ ఫెర్గూసన్‌ను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. ఈ మ్యాచ్ విజయంతో న్యూజిలాండ్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఆదివారం వెల్లింగ్టన్‌లో

**అక్లాండ్:** మహిళల క్రికెట్‌లోనూ ఫలితం పునరావృతమైంది. మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ విమెన్ టీమ్ ఆరు వికెట్ల తేడాతో సౌతాఫ్రికాపై ఘన విజయం అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా విమెన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 149 రన్స్ చేసింది. ఓపెనర్లు సునె లూస్(3), టెంజ్‌మిన్ బ్రిట్స్(0) నిరాశపరిచాడు. 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన సౌతాఫ్రికాను కెప్టెన్ కెప్టెన్ వోల్‌వార్డ్(37) ఆదుకునే ప్రయత్నం చేశారు. అన్నెరీ డెర్క్‌సెన్(27)తో కలిసి జట్టు స్కోరు 60 పరుగులు దాటించారు. ఈ దశలో కివీస్ బౌలర్లు విజృంభించడంతో సౌతాఫ్రికా వేగంగా వికెట్లు కోల్పోయింది. టెయిలెండర్ రైనెక్(34 నాటౌట్) దాటిగా ఆడడంతో సౌతాఫ్రికా గౌరవప్రదమైన స్కోరుకు చేరుకుంది. కివీస్ విమెన్ బౌలర్లలో సోఫీ డివైన్, సుజీ బేట్స్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

అనంతరం ఈ లక్ష్యాన్ని కివీస్ విమెన్స్ తడబడుతూ ఆరంభించినా చివరకు నాలుగు వికెట్లు కోల్పోయి 18.4 ఓవర్లలోనే చేధించింది. బౌలింగ్‌లో రాణించిన సోఫీ డివైన్ బ్యాటింగ్‌లో రాణిస్తూ అర్ధసెంచరీతో అజేయంగా నిలిచింది. మిగతా వారిలో కెప్టెన్ అమెలియా కెర్(30) రాణించారు. చివర్లో మాడీ గ్రీన్(34నాటౌట్) ధాటిగా ఆడి 25 బంతుల్లోనే వేగంగా 34 పరుగులు చేయడంతో కివీస్ మరో 8 బంతులుండగానే విజయం అందుకుంది. ఈ విజయంతో న్యూజిలాండ్ విమెన్స్ 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచింది.

# తన్వీ సంచలనం

## ఓర్లీన్స్ సెమీస్‌లోకి దూసుకెళ్లిన యువ షట్లర్



**ఫ్రాన్స్:** ఓర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ తన్వీ శర్మ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన ఆరో సీడ్ నట్సుకిపై సంచలనంవిజయం సాధించింది. కేవలం 43 నిమిషాల్లోనే 21-14, 21-14తో వరుస సెట్లలో తన్వీ శర్మ గెలుపొందింది. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 38వ ర్యాంకులో ఉన్న తన్వీ శర్మ... ఈ టోర్నీలో ఆరంభం నుంచి చక్కని ఆటతీరును ప్రదర్శిస్తోంది. అదే జోరును క్వార్టర్ ఫైనల్లోనూ చూపిన తన్వీ శర్మ రెండు సెట్లలోనూ జపాన్ ప్రత్యర్థిని పుంజుకునే అవకాశం ఇవ్వకుండా బలమైన స్మాష్‌లతో ఉక్కిరిబిక్కిరి చేసింది. మరో మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మాల్వికా బన్సొద్.. భారత్‌కే చెందిన సహచరిణి ఇషారాణితో తలపడనుంది. ఎవరూ గెలిచినా భారత్‌కు మరో సెమీఫైనల్ బెర్త్ దక్కనుంది.

కాగా పురుషుల డబుల్స్‌లో భారత జోడీ అర్జున్ రామచంద్రన్, హరిహరన్.. క్వార్టర్ ఫైనల్లోనే పోరాడి వెనుదిరిగారు. భారత జోడీపై ఇండోనేషియా జోడీ మౌలానా, లియో కార్నండో 21-12, 22-20తో గెలుపొంది సెమీఫైనల్లో ప్రవేశించారు. భారత జోడీ తొలి సెట్‌లో పేవల ప్రదర్శన ఇచ్చినా... రెండో సెట్‌లో పుంజుకుంది. నువ్వానేనా అన్నట్లుగా పాయింట్లు రాబట్టారు. ఓ దశలో ఆధిక్యం చాటినా... చివరి కొచ్చేసరికి ఒత్తిడికి గురై సెట్, మ్యాచ్ చేజార్చుకుంది. దీంతో పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత షట్లర్ల పోరు ముగిసింది.

# విండీస్ టూర్ విజయంతో స్టార్ట్

## తొలి టీ20లో ఆసీస్ విజయం

**కింగ్స్‌టన్:** వెసిండీస్ పర్యటనను ఆస్ట్రేలియా విమెన్ జట్టు గెలుపుతో ప్రారంభించింది. తొలి టీ20మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను దాని సొంతగడ్డపై 43 పరుగుల తేడాతో ఓడించింది. వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్ విమెన్ బెత్‌మూనీ సూపర్ హాఫ్ సెంచరీతో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా విమెన్స్ 20 ఓవర్లలో 6వికెట్లకు 164 పరుగులు చేసింది. జార్జియా వోల్(8), లిట్చ్‌ఫీల్డ్ (6) రూపంలో ఆస్ట్రేలియా తొందరగానే రెండువికెట్లు కోల్పోయింది. మరో ఎండ్‌లో దూకుడుగా ఆడిన బెత్ మూనా(79)...ఎలైస్ పెర్రీ(36) అండగా మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని అందించింది. ఈ క్రమంలో బెత్ మూనీ 55 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 79 రన్స్ సాధించింది. పెర్రీ 32 బంతుల్లో 36 రన్స్ చేసింది. మిగతా బ్యాట్స్ విమెన్ నిరాశపరిచారు. విండీస్ బౌలర్లలో డీన్‌ద్రా డొట్టిన్ మూడు వికెట్లు, చిన్నెల్లీ హెన్రీ రెండు వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్‌ను 121 పరుగులకే ఆస్ట్రేలియా బౌలర్లు పరిమితం చేశారు. విండీస్ జట్టులో ఓపెనర్ క్వియానా జోసెఫ్ (45) టాప్ స్కోరర్‌గా నిలిచింది. 39 బంతుల్లో 7 ఫోర్లతో 45 రన్స్ చేసింది. మిగతా వారిలో స్టాఫీన్ టేలర్ 38 రన్స్ సాధించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అలనా కింగ్ మూడు వికెట్లు పడగొట్టింది.




# మార్పేది లేదు

## ఫిఫా స్పష్టీకరణ



**న్యూయార్క్:** ఇరాన్‌కు అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్ షాకిచ్చింది. ఫిఫా ప్రపంచకప్‌లో తమ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు తరలించాలని ఇరాన్ చేసిన విజ్ఞప్తిని ఫిఫా తోసిపుచ్చింది. ఇప్పటికే మ్యాచ్ వేదికలను సిద్ధం చేశామని, షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు చేయడం లేదని ఫిఫా అధ్యక్షుడు గియాన్ని ఇన్ఫాంటియానో వెల్లడించారు. ఇరాన్ అభ్యర్థన సహా పలు అంశాలను పరిశీలించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫిఫా పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గియాన్ని వెల్లడించారు. గత డిసెంబర్‌లోనే ఫిఫా మ్యాచ్‌లకు సంబంధించి పూర్తి షెడ్యూల్ విడుదల చేసినందున, ఇప్పటికిప్పుడు ఇరాన్ మ్యాచ్ వేదికలను మార్చలేమన్నారు. అమెరికా, కెనెడా, మెక్సికోలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా ప్రపంచకప్ జూన్ 11న ప్రారంభమై జూలై 19 వరకు కొనసాగనుంది. గ్రూప్‌జిలో ఉన్న ఇరాన్.. బెల్జియం, న్యూజిలాండ్, ఈజిప్ట్‌లతో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

అయితే ఇరాన్ తన మూడు మ్యాచ్‌లను అమెరికాలోనే ఆడాల్సి ఉండగా.. లాస్‌ఏంజిల్స్ వేదికగా రెండు, మరో మ్యాచ్‌ను సియాటెల్‌లో ఆడాల్సి ఉంది. అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ తమ లీగ్ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు తరలించాలని అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌కు విజ్ఞప్తి చేసింది. తాజాగా ఫిఫా నిర్ణయం ఇరాన్‌ను చిక్కుల్లో పడేసినట్లయింది.

### ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్

# నార్త్ ఈస్ట్‌కు ఒడిశా షాక్

**గౌహతి:** ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్‌లో ఒడిషా గెలుపు బోణీ చేసింది. సొంతగడ్డపై శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 4-1 గోల్స్‌తో నార్త్ ఈస్ట్ యునైటెడ్ క్లబ్‌కు షాకిచ్చింది. రాహుల్ ఆరో నిమిషంలో చేసిన గోల్ తో ఒడిషా జట్టు 1-0 ఆధిక్యం చాటింది. అయితే మకర్టన్ పదో నిమిషంలో చేసిన గోల్‌తో నార్త్ ఈస్ట్ యునైటెడ్ 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. ఆతర్వాత నుంచి ఒడిషాఆధిక్యం చివరి వరకు కొనసాగింది. ఒడిషాకు 25వ నిమిషంలో శుభం, 65వ నిమిషంలో రాహుల్ గోల్స్ అందించారు. 68వ నిమిషంలో మకర్టన్ సెల్ఫ్‌గోల్‌తో ఒడిషా ఖాతాలో మరో గోల్ చేరింది. ఒడిషాకు నాలుగు మ్యాచ్‌ల్లో ఇది తొలి విజయం.

ఇండియన్ సూపర్ లీగ్‌లో మొత్తం 14 జట్లు తలపడుతున్నాయి. సింగిల్ లెగ్ రౌండ్ రాబిన్ పద్ధతిలో ఒక్కో జట్టు 13 మ్యాచ్‌లు ఆడుతుంది. మే 17 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 91 మ్యాచ్‌లు జరుగుతాయి. టాప్ క్లబ్ జట్లు మోహన్ బగాన్, జంషెడ్‌పూర్ నాలుగు గేసి విజయాలతో అగ్రస్థానంలో ఉన్నాయి. ముంబై సిటీ 4 విజయాలు, రెండు డ్రాలతో కొనసాగుతోంది.




# వారాంతంలో లాభాలతో సెన్సెక్స్, నిఫ్టీ

## ఐటి, పిఎస్‌యు బ్యాంక్స్ మద్దతు



**ముంబయి, మార్చి 20:** రెండురోజుల నష్టాల నుంచి వారాంతంలో మార్కెట్లు కొంత కోలుకున్నాయి. ముడిచమురుధరలు సడలింపులు, మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న అంచనాలతో దిగువస్థాయిలో కొంతమేర కొనుగోళ్లు జరిగాయి. ఎంపిక చేసినసెక్టార్లలో అంటే ఐటి, పిఎస్‌యు బ్యాంక్స్ వంటివి లాభాల్లోముగిసాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మాత్రం ఒత్తిడిలోనే కొనసాగింది. అయినా కూడా విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాల బాట వీడలేదు. అమెరికా బాండ్ల రాబడులు, రూపాయి క్షీణత వంటివికూడా కీలకం అయ్యాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 325.72పాయింట్లు లాభపడి 74,532.96 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 112.35పాయింట్లు పెరిగి 23,114.50 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్150 సూచీ 0.66 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.47 శాతం పెరిగాయి. మార్కెట్ల పరంగా కొంత సానుకూలంగానే ముగిసాయి.

బిఎస్ఇలో 2458 షేర్లుపెరిగితే 1804 కంపెనీలషేర్లు క్షీణించాయి. 170 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో భారత్ రూపాయి ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. 93.7150వద్ద కదలాడింది. అంతకుముందు 92.89 నుంచి మరింతగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ సెటిల్‌మెంట్‌కు సంబంధించి 1.23 శాతంగా ఉంది. రూ.1,46,705గా నమోదయింది. అమెరికాపదేళ్ల బాండ్ల రాబడులు 0.40 శాతంపెరిగి 4.3శాతంగా నమోదయింది. కమోడిటీస్ మార్కెట్‌పరంగా బ్రెంట్ ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్‌కు సంబంధించి 1.47 డాలర్లుపెరిగి 110.12 డాలర్లుగా నమోదయింది. ఇక వాల్‌స్ట్రీట్ మార్కెట్లలో డౌజోన్స్ ఫ్యూచర్స్ 200 పాయింట్లు క్షీణించింది. యూరోపియన్ షేర్లు శుక్రవారం ఇన్వెస్టర్లు అప్రమత్తంగా కొనసాగినట్లు కనిపిస్తోంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ కీలకరేట్లు స్థిరంగానే కొనసాగించింది. స్విస్ నేషనల్ బ్యాంకు, స్వీడన్ రిసక్స్ బ్యాకులు కూడా స్థిరంగా వడ్డీరేట్లు కొనసాగించాయి. ఇక ఆసియా మార్కెట్లుకూడా దిగువ స్థాయిలోనే ముగిసాయి.

మధ్య ప్రాచ్యం లోనియుద్ధ ఉద్రిక్తతలు ఎక్కువ ఒత్తిడి తెచ్చాయి. జపాన్‌మార్కెట్లు పబ్లిక్ హాలిడే కావడంతోమూతపడ్డాయి. చైనా పీపుల్స్‌బ్యాంక్ వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగించింది. ఇక వాల్‌స్ట్రీట్‌లో డౌజోన్స్ పారిశ్రామిక సగటు 0.44 శాతం, ఎస్అండ్‌పి 5000.27శాతం నాస్‌డాక్ కాంపోజిట్‌కూడా 0.28శాతం చొప్పున క్షీణించాయి. ఇక దేశీయ మార్కెట్లపరంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.41శాతం క్షీణించింది. హ్యాపియెస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ 10.70శాతం పెరిగింది. భారతీయ స్టేట్‌బ్యాంకు 0.90శాతం పెరిగింది. టిసిఎస్ షేర్లు 1.44శాతం, టాటాపవర్ కంపెనీ 1.07శాతం, నాట్కో ఫార్మా 2.92శాతం, ఎన్టీపీసి 1.89శాతం, విఎ టెక్ వాబాగ్ 2.91 శాతం చొప్పున పెరిగాయి. పిఎన్ గాడ్గిల్ జ్యూయెలర్స్ 0.81శాతం లాభపడ్డాయి.



# 8 పారిశ్రామిక రంగాల వృద్ధి 2.3%

**న్యూఢిల్లీ, మార్చి 20:** భారత్ ఎనిమిది కీలకరంగాల సమిష్టి వృద్ధి ఫిబ్రవరిలో 2.3శాతంగా నమోదయింది. అంతకుముందు నెలలో నాలుగుశాతం నుంచి గణనీయంగా దిగజారింది. కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ కీలకరంగాల వృద్ధి గణాంకాలను శుక్రవారం ఇడుదలచేసింది. ముడిచమురు ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. 5.2శాతంగా ఉంది. ఏప్రిల్‌నుంచి ఫిబ్రవరకూ చూస్తే 2.5శాతం క్షీణించింది. సిమెంట్ ఉత్పత్తి మాత్రం గణనీయంగాపెరిగింది. 9.3శాతంగా ఉంది. అయితేఅంతకుముందునెలలో 11.3శాతంగా ఉంది. అయితే నిర్మాణరంగ కార్యకలాపాలు మందగమనంతో ఉండటంతోనే ఉత్పత్తికూడా తగ్గినట్లు భావిస్తున్నారు. ఉక్కు ఉత్పత్తి మాత్రం భారీగా పెరిగింది. 7.2శాతంగా ఉంది. జనవరిలో ఒక్కసారిగా 11.5శాతం నమోదయిన సంగతి తెలిసిందే. ఇక బొగ్గుపరంగా 2.3శాతం మాత్రమే ఉంది. ఎరువుల ఉత్పత్తి కూడా 3.4శాతంగా ఉంది. పెట్రోలియం శుద్ధి ఉత్పత్తులు 1శాతం క్షీణించాయి. భారత పారిశ్రామిక ఉత్పత్తిసూచీకి ఎనిమిది కీలకపరిశ్రమల డేటా 40శాతం వాటాతో ఉంటుంది. ఐఐపి జనవరిలోకూడా 0.4శాతం నమోదుచేసింది. గడచి 14 నెలలతో పోలిస్తే అత్యంత కనిష్టంగా ఉంది. ఇక వార్షిక పద్ధతిలోచూస్తే పారిశ్రామిక ఉత్పత్తిసూచీ 4.8శాతంగా ఉంది. అదే డిసెంబరులో 7.8శాతం ఉంది. ఉత్పత్తిరంగంలోనే ఎక్కువ మందగమనం నెలకొనడంతోనే కనిష్టస్థాయికి చేరిందని చెపుతున్నారు. బేసిక్ మెటల్స్ మోటార్ వాహనాలు, ట్రెయిలర్లు, సెమి ట్రెయిలర్లు నాన్‌మెటాలిక్ ఖనిజ ఉత్పత్తులు వంటివాటితో స్వల్ప వృద్ధినమోదయింది.

### కళతప్పిన ఆర్బీఐ

# విదేశీ కరెన్సీఖజానా



**ముంబయి, మార్చి 20:** భారత్ విదేశీ కరెన్సీ నిల్వలు 7.052 బిలియన్ డాలర్లు కరిగిపోయాయి. మార్చి 13తో ముగిసన వారంలో 709.759 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ వెల్లడించింది. మొత్తంగా రిజర్వులు అంతకుముందు వారంలోకూడా 11.683 బిలియన్ డాలర్లు తగ్గి 716.81 బిలియన్ డారల్లకు చేరాయి. తర్వాత ఫారెక్స్ ఖజానా ఆల్‌టైమ్ గరిష్టానికి అంటే 725.727 బిలియన్ డాలర్లకు చేరాయి. గతనెల 13వ తేదీతోముగిసిన వారంలోనే ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. విదేశీ కరెన్సీఆస్తులపరంగా కూడా క్షీణత ఉంది. 7.678 బిలియన్‌డాలర్లు పతనం అయి 555.568 బిలియన్ డాలర్లుగా నిలిచింది. ఇక బంగారం విలువలు కూడా 6.64 మిలియన్ డాలర్లుపెరిగి 130.681 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బిఐ ప్రకటించింది. ఇక ఎస్డీఆర్‌లుగా పిలిచే స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్‌కూడా 23 మిలియన్ డాలర్లు క్షీణించి 18.697 బిలియన్ డాలర్లకు చేరింది. ఐఎంఎఫ్‌వద్ద భారత రిజర్వు స్థాయి కూడా తగ్గింది. 15 మిలియన్‌డాలర్లు తగ్గి 4.814 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు ఆర్బిఐ ప్రకటించింది.

### వాణిజ్యం

# బులియన్ ధరల్లో భారీ పతనం



**ముంబయి, మార్చి 20:** అమెరికా ఫెడరల్ రిజర్వ్(ఫెడ్) విధాననిర్ణయం బులియన్ మార్కెట్‌లో ప్రకంపనలు సృష్టించింది. వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతున్నట్లు ఫెడ్ ప్రకటించడంతో డాలర్ విలువ బలపడింది. దీనికి తోడు ట్రెజరీ బాండ్ల రాబడులు కూడా పెరగడంతో, పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి సురక్షిత సాధనాల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. దీనితో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. సాధారణంగా భౌగోళిక ఉద్రిక్తతల సమయంలో పెరిగే ఈ లోహాలు, అందుకు భిన్నంగా యూటర్న్ తీసుకోవడం గమనార్హం.

మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏప్రిల్ కాంట్రాక్ట్‌లో కిలో వెండి ధర కేవలం ఒక్క రోజులోనే 8 శాతం పతనమైంది. అంటే ఏకంగా19 వేలు నష్టపోయి 2.29 లక్షలకు చేరింది. బంగారం పరిస్థితి కూడా ఇదే తీరులో ఉంది. 10 గ్రాముల బంగారం (ఏప్రిల్ డెలివరీ) ధర సుమారు 4 శాతం క్షీణించింది. దాదాపు6వేలు తగ్గి 1.46 లక్షల వద్ద ట్రేడ్ అయింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నాటికి 10గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.1.52 లక్షలుగా, కిలో వెండి ధర రూ.2.36 లక్షలుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం ఔన్సు ధర గతంలో 5,000 డాలర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం 4,682 డాలర్లకు దిగి వచ్చింది. స్పాట్ వెండి ఔన్సు ధర 70 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పుడు బంగారం, వెండి వంటి వడ్డీరహిత ఆస్తులపై పెట్టుబడులు తగ్గుతాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఫెడ్ తీసుకున్న నిర్ణయం బంగారం, వెండిపై మరింత ఒత్తిడి పెంచిందని చెపుతున్నారు. ఈ ధరల తగ్గుదలను కొనుగోలుకు అవకాశంగా చూడాలా లేక మరింత పతనం కోసం వేచిచూడాలా అనే సందిగ్ధంలో ఇన్వెస్టర్లు ఉన్నారు.

# ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి



**ముంబయి, మార్చి 20:** అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిణామాల నేపథ్యంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ సరఫరా వ్యవస్థలో అంతరాయాల కారణంగా వారాంతపు ట్రేడింగ్‌లో రూపాయి భారీగా బలహీనపడింది. ఒకే రోజు 0.55 శాతం క్షీణించి, డాలర్‌కు 93.72 వద్ద కొనసాగింది. బుధవారం నమోదైన 92.63 కనిష్ఠ స్థాయిని కూడా ఇది అధిగమించింది. పశ్చిమాసియాలో సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి రూపాయి విలువ దాదాపు 2 శాతం క్షీణించడం గమనార్హం. పెరుగుతున్న ముడి చమురు ధరలు, అంతర్జాతీయంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపడం దీనికి ప్రధాన కారణాలని చెబుతున్నారు. రూపాయి విలువ కుప్పకూలినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రం అనూహ్యంగాపుంజుకున్నాయి. సెన్సెక్స్ 325.72 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ దాదాపు 112.35 పాయింట్లు పెరిగింది. అయితే, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) నికర అమ్మకందారులుగా కొనసాగుతున్నారు. ముందురోజే వారు రూ. 7,558.19 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ డేటా స్పష్టం చేస్తోంది. ఇరాన్ చమురుపై ఆంక్షల సడలింపు సంకేతాలతో తగ్గిన ముడి చమురు ధరలు మరోవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కాస్త తగ్గాయి. ఇరాన్ నుంచి సముద్ర మార్గంలో ఉన్న ముడి చమురుపై ఆంక్షలను సడలించే అవకాశం ఉందని అమెరికా సంకేతాలు ఇవ్వడంతో ధరలు దిగివచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 3.39 శాతం తగ్గి 104.96 డాలర్లకు చేరగా, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ 3.22 శాతం తగ్గి 110.12 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు 40 శాతం పెరగడం గమనార్హం.

# 180 డాలర్లకు పెరగనున్న ముడిచమురు

## ధరల మంట తప్పదని సౌదీ హెచ్చరిక




**న్యూఢిల్లీ, మార్చి 20:** పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం వల్ల చమురు ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇరాన్ ఇప్పటికే హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా రవాణా ఆగిపోయింది. ఈఉద్రిక్తతలు ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర బ్యారెల్‌కు ఏకంగా 180 డాలర్ల మార్కును తాకవచ్చని చమురు దిగ్గజ దేశం సౌదీ అరేబియా హెచ్చరించింది. ప్రస్తుత సంక్షోభం కేవలం ఒక్క ప్రాంతానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా కలిగిన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా గతనెల 28వ తేదీన యుద్ధం మొదలైనప్పుడు ఒక బ్యారెల్ ధర 70 డాలర్లుగా ఉండగా అది ఇప్పటికే 119 డాలర్లకు చేరుకుంది.

హార్ముజ్ జలసంధిలో ముప్పు ఉండటంతో సౌదీ అరేబియా తన ఎగుమతుల కోసం ఎర్ర సముద్రం మార్గాన్ని ఎంచుకుంది. అయితే అక్కడి యాన్బు పోర్టు సమీపంలోని అరామ్‌కో రిఫైనరీపై కూడా డ్రోన్ దాడులు జరగడంతో పరిస్థితి మరింత దిగజారిపోయింది. రవాణా మార్గాలకు అడ్డంకులు ఏర్పడితే చమురు ధర 150 డాలర్లకు పెరగడం లో ఆశ్చర్యంలేదని విదేశాంగ నిపుణుడు అంచనావేసారు. ఒకవేళ ఏప్రిల్ చివరి వరకు ఇదే పరిస్థితి కొనసాగితే అది 180 డాలర్లకు చేరి రికార్డులు సృష్టించవచ్చని అన్నారు. భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 85 నుంచి 90 శాతం దిగుమతుల ద్వారానే భర్తీచేసుకుంటోంది. బ్యారెల్ ధర 180 డాలర్లకు చేరితే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు ఊహించని రీతిలో పెరిగే అవకాశం ఉంది. ఇది రవాణా ఖర్చులను పెంచి, ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ప్రస్తుతం గల్ఫ్ దేశాలు ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ ఇంధన క్షేత్రాలే లక్ష్యంగా జరుగుతున్న దాడులు ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.